1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం


సంపుటి : 5
సంచిక : 9
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

నవంబరు 2019






నాణేలనే ప్రాణంగా భావించి
నాణ్యశాస్త్ర జ్ఞానాన్ని ప్రేమించి
86 ఏళ్ల వయసులో
అక్టోబర్ 6న కాలధర్మం చెందారు
'నాణేల రాజు'గారు

- మాతృభాషల మౌనపోరాటం.
- తెలుగు రాష్ట్రాల్లో తెలుగుకు కొరివి పెట్టడమే మిగిలింది!
- కవితాపయోనిధి దాశరథి
- రామాలయ నిర్మాణం సయోధ్యను కలిగిస్తుందా?

మాతృభాషలకు పెద్దపీట వేసిన జాతీయ నూతన విద్యావిధానం

శ్రద్ధాంజలి

తనకుతానే సాటి: సి. రాఘవాచారి



కనువెలుగు : 10-9-1939
కనుమరుగు : 28-10-2019

మన కాలపు గొప్ప వ్యక్తుల్లో ఒకరు; ఏ విషయంలోనూ మరొకరితో పోల్చి చెప్పడానికి ఇమడని ప్రత్యేక పురుషుడు; మంచితనానికీ స్నేహానికీ మారుపేరు - సి.రాఘవాచారిగారు 81 ఏళ్ళ జీవితాన్నుండి కన్నుమూశారు. ఆయన బాగా చదువుకున్నారు. పట్టాలున్న చదువుల వల్ల వచ్చే ఉద్యోగాలను, ఆశించని, లాభదాయక వృత్తులను చేపట్టని, ఒక అరుదైన జ్ఞాన, కర్మయోగాల సమ్మేళనం రాఘవాచారిగారు. 1985కు ముందే ఆయనతో నాకు పరిచయం వున్నా, ఆ తర్వాతే - వాకాటి పాండురంగారావుగారితో కలిసి పలుమార్లు మాట్లాడుకోవడంతో కొంత సాన్నిహిత్యం కలిగింది. 1994 నుండీ 'నడుస్తున్న చరిత్ర' పత్రిక వల్లా, తర్వాత తరచుగా నేను నిర్వహించిన పలు కార్యక్రమాలవల్లా మా మధ్య సాన్నిహిత్యం పెరిగి, తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉద్యమకృషితో పెంపొంది, తాపీధర్మారావుగారి పేర పురస్కారాన్ని జర్నలిస్టులకు అందించిన క్రమంలో బలపడింది. తొలి పురస్కారాన్ని 2009 లో డా॥ నాగసూరి వేణుగోపాల్‌కు రాఘవాచారిగారు తన చేతులతో అందించారు. అప్పటి నుండీ ప్రతి ఏడాదీ ఆ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటూ ఉండేవారు. చివరిగా 2018 సెప్టెంబరు 16న ఏటుకూరి ప్రసాద్‌గార్కి జీవన సాఫల్య పురస్కారం ఇచ్చిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

ఆయన తన పాండిత్యాన్ని, జ్ఞానాన్ని పేరుకోసం, ఆధిపత్యం కోసం ఎన్నడూ ప్రదర్శించలేదు. సందర్భ పడినప్పుడల్లా ఉపయోగించారు. అదీ సమాజ జ్ఞానవికాసంకోసం, అవసర మైతేనే. కొన్నిసార్లు మాతృభాష, సంస్కృతం, ఇంగ్లీష్ భాషల గురించి, వాటి అవసరాల గురించి, ఆయన అభిప్రాయాలు విని నేనెంతో నేర్చుకొన్నాను. గిడుగు గురించీ, భాషోద్యమం గురించీ ఆయన చేసిన విశ్లేషణలు ఎంతో ఉపయోగపడ్డాయి. తాపీ ధర్మారావుగారి పేర పురస్కారాలను ఇవ్వడం ఆయనకెంతో నచ్చిన సంగతి.

చక్రవర్తుల రాఘవాచారిగారివంటి నిగర్వులు, పండితులు, జర్నలిస్టులు, 'ఉపన్యాస కులు, మేధావులు రాజకీయ సిద్ధాంతకర్తలు విడిగా ఎందరో సమాజంలో మనకు కన్పించ వచ్చు. కానీ ఈ గొప్పదనాలను అన్నిటినీ మూర్తీభవింపజేసుకొని, గంభీరంగా తనదైన శైలిలో జీవితాన్ని నిండుగా గడిపిన వ్యక్తి మరొకరున్నారేమో నాకైతే ఎవరూ తోచడం లేదు.

మరపురాని ఆ మహోన్నత వ్యక్తికి శ్రద్ధాంజలి ఘటిద్దాం.

- సామల రమేష్‌బాబు



2018 తాపీధర్మారావు జీవనసాఫల్య పురస్కారసభలో పాల్గొన్న సి.రాఘవాచారిగారు (కుడివైపు చివరన నిలబడినవారు)

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...

◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...

◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



నవంబరు 2019

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

లోపలి పుటలలో....

రేఖాచిత్రాలు, **పావులూరి చిదంబరేశ్వరరావు**

కార్టూన్లు **'సరసి'**

కంప్యూటరీకరణ **లంకె జనార్దన్**

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్ట్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా	:	రూ.5000	రూ.7500	--
5 సం॥	:	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥	:	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥	:	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

AMMA NUDI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **915020010550189**

IFSC Code : UTIB0000556

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంప గలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1.

హెచ్చరిక

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకు నేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- దయచేసి 3వ పుటలోని 'రచయితలకు సూచనలు' చూడండి

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com

సంపుటి : 5 సంచిక : 9
అమ్మనుడి
నవంబరు 2019

సంపాదకీయం

మాతృభాషలకు పెద్దపీట వేసిన జాతీయ నూతన విద్యావిధానం

ఎదుగుతున్న దేశాలను అన్ని విధాలా నిర్వీర్యం చేయడానికి, ఆయా జాతుల భాష, సాంస్కృతిక ప్రత్యేకతనూ సృజనాత్మకతనూ పరాయీకరించడానికి ప్రపంచ ఆధిపత్య శక్తులు ఒక పథకం ప్రకారం పనిచేస్తున్నాయి. దీనికి బలి అవుతున్నవారిలో భారతదేశం కూడా ఉంది. స్వతంత్రతాస్ఫూర్తిని కోల్పోయి, తమ బలాన్ని తామే గుర్తించలేని, వినియోగించలేని స్థితికి ఇప్పుడు మనం చేరుకుంటున్నాం. ఇందుకు ప్రధాన బాధ్యత మన పాలక వర్గాలదే. జాతికి ఆయువు పట్టయిన విద్యారంగాన్ని పూర్తిగా పరాయీకరిస్తున్న ప్రభుత్వ విధానాలను తెలివిగల ప్రజలు, కొందరు మేధావులు ప్రశ్నిస్తూనే ఉన్నారు. అయితే, ప్రపంచీకరణ సాలెగూడులో ఇరుక్కొన్న మన ప్రభుత్వాలు, పాలక పార్టీలు, నేతలు దేశాన్ని సరైన మార్గంలో నడిపించడంలో విఫలమవుతున్నారు.

ఇలాంటి దశలో నేటి భారతదేశ పాలకుల్లోని జాతీయతాస్ఫూర్తి కొంతైనా పనిచేసిందో ఏమో, విద్యారంగానికి సంబంధించి ఇటీవల కొన్ని మంచి ఆలోచనలను అమలులోకి తేవడానికి ప్రయత్నిస్తున్నారు. కస్తూరిరంగన్ కమిటీ నివేదిక ఆధారంగా ఎన్‌డిఏ ప్రభుత్వం కొద్ది రోజుల్లో ఆమోదించబోతున్న 'జాతీయ నూతన విద్యావిధానం' కొన్ని హేతుబద్ధమైన, శాస్త్రీయమైన చర్యలను చేపట్టబోతున్నది. ప్రభుత్వం విడుదల చేసిన 'జాతీయ నూతన విద్యావిధానం తుది నివేదిక' ప్రకారం – ప్రజలంతా స్వాగతించ వలసిన అంశం – 8వ తరగతి వరకు అన్ని పాఠాలను మాతృభాషలోనే బోధించాలన్నది. తొలుత బయటకు వచ్చిన రెండు నివేదికల్లో కంటే ఈ తుది నివేదికలో ఈ అంశంపై స్పష్టత వచ్చింది. 8వ తరగతి వరకు మాతృభాషే బోధనామాధ్యమంగా ఉండాలని తేల్చి చెప్పడం మాత్రమేగాక, ఆ పై తరగతుల్లో కూడా మాతృభాషను ఒక సబ్జెక్టుగా కొనసాగించాలని నిర్దేశించింది. ఇంగ్లీషును ఒక భాషగా బోధించడానికి, మాధ్యమంగా వినియోగించడానికి హేతుబద్ధంగా నియంత్రించింది. మొత్తమ్మీద విద్యాబోధనలో మాతృభాషలకు పెద్దపీటవేసి, ఇంగ్లీషు దూకుడుకి కళ్లెం వేయనున్నారని ఇంతవరకు అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది.

ఈ పరిణామాన్ని స్వాగతిద్దాం. అయితే ఈ సందర్భంగా కొన్ని అంశాలను ఇక్కడ మనం ప్రస్తావించుకోవలసివుంది.

మన రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాలోని అంశాలలో విద్య కూడా ఉంది కనుక – విద్యకు సంబంధించి కేంద్రానికీ, రాష్ట్రాలకూ కలిపి ఉమ్మడిగా పాలనాధికారాలుంటాయి. కనుక రాష్ట్రాలను కూడా కలుపుకొని అందరి సమ్మతితో సాధించవలసిన అంశం ఇది. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో దీన్ని సాధ్యం చేయగల నేర్పును కేంద్రం ప్రదర్శించ వలసి ఉంటుంది.

మన రెండు తెలుగు రాష్ట్రాల్లో – మాధ్యమంగా తెలుగును పూర్తిగా తొలగించి, కేవలం ఒక సబ్జెక్టుగా మాత్రమే తెలుగును నేర్పితే చాలునని నేటి ప్రభుత్వాలు నిర్ణయించాయి. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలకోసం తెలుగు రాష్ట్రాల పాలక వర్గాలు చేపట్టిన ఈ విధానం వల్ల ఒక జాతిగా తెలుగు ప్రజలు ఎంత తీవ్రంగా నష్టపోతారో అనే స్పృహేలేని ప్రభుత్వాలు ఇవి. మరి, నూతన జాతీయ విద్యావిధానంలోని మాతృభాషామాధ్యమ అంశాన్ని తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలు ఆమోదిస్తాయా?

జాతీయ నూతన విద్యావిధానాన్ని అన్ని రాష్ట్రాలూ ఆమోదించి అధికారికంగా అమలులోకొచ్చినా,

ఏ భాషా మాధ్యమంలో చదువుకోవాలో ప్రభుత్వం నిర్దేశించడం పౌరుల ప్రాథమిక హక్కులకు భంగకరం అని కోర్టులు ఈ అంశాన్ని కొట్టివేయగల అవకాశం ఉంది. మూడేళ్ల క్రితం ఈ విధమైన తీర్పును భారత సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిందని మనం ఇక్కడ గుర్తు చేసుకోవాలి. అందువల్ల ఈ సమస్యను ఎదుర్కొనడానికి అవసరమైతే రాజ్యాంగంలో తగు సవరణలను చేయడానికి కేంద్రప్రభుత్వం పూనుకోవాలి.

మరో ముఖ్యమైన సంగతి : మనకున్నవి భాషా ప్రయుక్త రాష్ట్రాలు. ఒకే భాష అధికారభాషగా ఉన్న రాష్ట్రాలు ఒకటి కంటె ఎక్కువగా ఎన్నయినా ఉండవచ్చు. మరి ఆయా రాష్ట్రాల్లోని ఇతర భాషీయుల మాతృభాషలు కూడా బోధనా మాధ్యమాలుగా గుర్తింపబడతాయా? ఉదాహరణకు తమిళనాడులో 42శాతంకు పైగా ఉన్న తెలుగువారి భాష విద్యారంగంలో దాదాపు అణచివేయబడింది. జాతీయ నూతన విద్యావిధానంలో ఈ విషయాన్ని కూడా స్పష్టం చేయవలసి ఉంది. రాజ్యాంగంలో ఈ అంశం కూడా స్పష్టంగా ఉండేలా తగు విధంగా సవరించవలసి వుంది.

మాతృభాషలకు సంబంధించి ప్రత్యక్షంగా ఎదురయ్యే సమస్యలనే పైన పేర్కొన్నాము. అయితే దీనికి ప్రత్యక్షంగానో పరోక్షంగానో కష్టనష్టాలకు కారణం కాగల అంశాలు కూడా ఉన్నాయి. మత స్వేచ్ఛ పేరిట, ధార్మికత పేరునా విద్యారంగంలో చాలాకాలంగా పాదుకుపోయిన అంశాలున్నాయి. ఈ సంస్థలవల్ల సమాజానికి ఒనగూడుతున్న మేలుకంటే కీడే ఎక్కువగా ఉంది. ప్రచ్ఛన్నంగా సమాజానికి హాని జరిగిపోతూనే ఉంది. వీటితోపాటు ప్రభుత్వేతరంగా వ్యక్తులు, సంస్థలు నడుపుతున్న పాఠశాలలన్నింటినీ స్వాధీనపరచుకొని, ప్రభుత్వమే నిర్వహించాలి. ఇది జరుగనంతకాలం మతం పేరుతో, స్వేచ్ఛపేరుతో మాతృభాషలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు సాగుతూనే ఉంటాయి. కనీసం పాఠశాల చదువులనైనా అందరికీ ఉచితంగా అందించడంకోసమేగాక, జాతీయ విలువలను కాపాడడంకోసం ఆ రంగాన్ని ప్రభుత్వం ఒక జాతీయ విధానంగా చేపట్టాలి.

జాతీయ నూతన భాషావిధానంలో అనేక మంచి విషయాలున్నాయి. అయితే, వివిధ భారతీయ భాషాజాతులు ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ భాషా సంస్కృతులను కాపాడుకొంటూ సమకాలీన అవసరాలకు తగ్గట్టు ఎదగడానికీ, సవాళ్లను అధిగమించడానికీ అవకాశాలనివ్వాలి. వాటిని అడ్డుకోవడానికిగాని నియంత్రించడానికిగాని కేంద్రం పూనుకొంటున్నదనే అనుమానాలకు తావు ఇవ్వరాదు. ఇటీవల జాతీయభాషగా హిందీ అనే ప్రతిపాదన వల్ల ఇలాంటి అనుమానాలకు ఆస్కారం కలిగింది. జాతీయ విద్యా విధానంలోగాని, దానితోపాటు వెల్లడయ్యే భాషకు సంబంధించిన విషయాల్లోగాని ఈ అనుమానాలు తలెత్తకుండా చూసుకోవలసిన బాధ్యత పాలక ఎన్‌డిఎ మీదా, తక్కిన అన్ని పాలక వర్గాల మీదా, ఉంది.

విద్యారంగంపై కేంద్రప్రభుత్వ పర్యవేక్షణ అనే అంశం ఈ కొత్త విధానంలో ముందుకు రానున్నది. ఘర్షణకు దారితీయని విధంగా సమన్వయంతో ఎంతవరకు మన నేతలు దీనిని సాధించగలరో చూడాలి.

ఇదే సందర్భంలో మరో రెండు విషయాలను మనం ఆలోచించాలి. భాషల అభివృద్ధి, వినిమయానికి సంబంధించి – అన్ని రంగాల్లోనూ ఎంతో ప్రగతిని సాధిస్తున్నాము. సాంకేతికత తోడుగా భారతీయ భాషలు బలోపేతమవుతున్నాయి. అందువల్ల ఇప్పుడు మనకు ఒకే జాతీయ భాష ఉండాలన్న అవసరమే లేదు. అన్ని భారతీయ భాషలనూ జాతీయభాషలుగా గుర్తించి గౌరవిస్తే ఈ సమస్య పరిష్కారమైనట్లే.

ఇక త్రిభాషాసూత్రం సంగతి. ఆచరణలో లేని, పనికిమాలిన ఈ ఆదర్శం ఇక మనకు అక్కర్లేదు. తన మాతృభాషతోపాటు ఏ ఇతర భారతీయ భాషనైనా, ఆమాటకువస్తే భారతీయేతర భాషనైనా నేర్చుకొనే స్వేచ్ఛ, అవకాశం అందరికీ ఉంది. అందుకు తగు సౌకర్యాలను కలిగించడం మాత్రమే ప్రభుత్వాలు చేయవలసిన పని. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశం ప్రగతి పథంలోకి వేగంగా అడుగులు వేస్తున్న సమయంలో వస్తున్న జాతీయ నూతన విద్యావిధానం – ముఖ్యంగా మాతృభాషలను తలపైకెత్తుకొంటున్నదని తెలిసి సంతోషపడుతున్నాం. ఇప్పటికి స్థూలంగా దీనిని స్వాగతిద్దాం.

తేదీ : 31-10-2019

సామల రమేష్‌బాబు

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

మాతృభాషల మౌనపోరాటం

భారతదేశం నిజంగా యువభారతమే. ఇందులో 25 ఏళ్లు దాటనివారు 46% కాగా 50 ఏళ్లు దాటనివారు 88%. సమాజంలో ప్రతివారి హక్కులను గుర్తించి మెలగడం, పెద్దలపట్ల తల్లిదండ్రులూ గురువుల పట్ల గౌరవం; స్త్రీలూ, పేదలూ, పిన్నలపట్ల ఆదరణా ఉండటం మానవీయ విలువలలో అన్నిటికంటే ప్రధానమైనది. వీటికి చిన్నప్పటినుంచీ తల్లి ఒడిలో మొదలై, బడిలోనూ ఆ పైవరకూ మాతృభాషలో నేర్చుకున్న సాహిత్యమే ఆధారం.

భారతదేశంలో 2.3 లక్షలమందికి ఇంగ్లీషు ప్రాధమిక భాష. ఐతే షుమారు 8.5 కోట్లమందికి రెండవ భాషగానూ ఇంకొక 4 కోట్ల మందికి మూడవ భాషగానూ ఉంది. ఈ వివరాలు మన జనాభా లెక్కలలో ఎవరికివారు చెప్పుకున్నవే. వీటికి ఎలాంటి సాధికారత లేదు. ఇలా ఇంగ్లీషు తెలుసని చెప్పుకున్నవారు ప్రధానంగా నగరాలకే పరిమితం. ఐతే, మన జనాభాలో 65% మంది భారతీయులు గ్రామాలలోనే నివసిస్తున్నారనేది నిజం. భారతీయ అంతర్జాల వాడుకరులలో 70% మంది నగరాలలో ఉండగా, 30 % మంది మాత్రమే గ్రామీణ భారతానికి చెందినవారు. వీరిలో సగంమందిపైగా చరవాణిలో అంతర్జాలాన్ని వాడేవారే. 75% అంతర్జాల వినియోగదారులు భారతదేశంలో వారి స్థానిక భాషల్లో అంతర్జాలాన్ని చూడటానికి ఇష్టపడుతున్నారని అంతర్జాల వినియోగదారుల సంస్థ సర్వేక్షణలో తేలింది. భారతీయ భాషల మాధ్యమం అవసరాన్ని ఇప్పుడు ఎక్కువగా గుర్తించాల్సిన సమయం వచ్చింది.

దేశంలో అంతర్జాల వినియోగం పట్టు బిగుస్తున్నా, యువత మాతృభాషల నుండి దూరం కావడంలేదు అని అనేక నివేదికల ద్వారా తెలుస్తోంది. దాదాపు 42% మందివరకూ స్థానిక భాషల్లో అంతర్జాలాన్ని శోధించడానికి ఇష్టపడతున్నారని ఒక సర్వేక్షణలో తేలింది. స్థానిక భాషల్లో విషయాలు మరింత అందుబాటులోకి వస్తే, మరింతమంది వినియోగదారులు అంతర్జాలాన్ని ఉపయోగించడం మొదలు పెడతారు.

అంతర్జాల చరవాణి వాడుకరుల సంఘంవారి ప్రకారం–అంతర్జాల సర్వేలో కనుగొన్న విషయం ఏమంటే,–గ్రామీణ జనాభాకు ఆంగ్ల మాధ్యమంలో అంతర్జాల సమాచారప్రాప్తి చాలా అసౌకర్యంగా ఉంది. ఈ అశక్తత, అసమర్థత వలన అంతర్జాలాన్ని వినోదం కోసం కాక, ఇతర ప్రయోజనాల కోసం పూర్తిగా ఉపయోగించలేక పోతున్నామని పేర్కొన్నారు.

భారతీయ భాషలకు పెరుగుతున్న ఆదరణ:

డిజిటల్ మాధ్యమ సంస్థలు ఎక్కువగా హిందీ ఇంకా ఇతర భారతీయ భాషలలో వారి సాంఖ్యిక విషయాలను అందించడం ప్రారంభించాయి. గత కొద్ది ఏండ్లుగా, అంతర్జాల, డిజిటల్, వినోద మాధ్యమాలలో భారతీయ భాషా వినియోగదారుల పెరుగుదల ఆకర్షణీయంగా ఉంది. ఈ మధ్యనే అనేక సంస్థలు జరిపిన సర్వేక్షణల

ఇక తెలుగురాష్ట్రాల సంగతి సరేసరి. ప్రభుత్వాలు మాత్రం తెలుగును పట్టించుకోవడం మానివేశాయి. తెలుగు మాధ్యమం స్థానే ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టేశాయి. తెలుగు మాధ్యమాన్ని తొలగించి ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెడితే వచ్చే అనర్థాలు ఎన్నో. స్థానిక భాషాధార పరిశ్రమలన్నీ ఎన్నో వచ్చే రెండు దశాబ్దాలలో మూలబడటం ఖాయం. ఈ సర్వేల గణాంకాలను చూసైనా ప్రభుత్వాలు భాషా విషయంలో పునరాలోచనలో పడాలి.

ఆధారంగా, భారతీయ భాషల వినియోగం అన్ని అంతర్జాలమాధ్యమ రంగాలలోనూ పెరుగుతోందనీ, ప్రభుత్వాలు మాత్రం భాషలకు సంబంధించి ఈ సర్వేలను పట్టించుకోవడంలేదనీ తెలుస్తోంది.

ఇక తెలుగురాష్ట్రాల సంగతి సరేసరి. ప్రభుత్వాలు మాత్రం తెలుగును పట్టించుకోవడం మానివేశాయి. తెలుగు మాధ్యమం స్థానే ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టేశాయి. తెలుగు మాధ్యమాన్ని తొలగించి ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెడితే వచ్చే అనర్థాలు ఎన్నో. స్థానిక భాషాధార పరిశ్రమలన్నీ ఎన్నో వచ్చే రెండు దశాబ్దాలలో మూలబడటం ఖాయం. ఈ సర్వేల గణాంకాలను చూసైనా ప్రభుత్వాలు భాషా విషయంలో పునరాలోచనలో పడాలి.

వినోద మాధ్యమాల పరిశ్రమ:

అతిచౌకగా వాడుకలోకి వస్తున్న స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా పెరుగుతున్న డిజిటల్ వినియోగ రంగంలో ఉరకలేస్తున్న భారతదేశంలో వినోద మాధ్యమాల పరిశ్రమ 2024 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 3.77 లక్షల కోట్లకు చేరుకుంటుందని ఓ సరికొత్త నివేదిక తెలుపుతోంది. 'భారతదేశంలో డిజిటల్ భవిష్యత్తు' అనే నివేదిక (కేపీఎంజీ) ప్రకారం, 2019 ఆర్థిక సంవత్సరంలో వినోద మాధ్యమాల పరిశ్రమ 13 శాతం ఘన వృద్ధిని సాధించి, 11.5 శాతం వార్షిక చక్రవృద్ధి రేటు (సిఎజిఆర్) తో రూ.1.6 లక్షల కోట్లకు చేరుకుంది. పెద్ద నిర్బంధాలు ఏమీ లేనందున, డిజిటల్ ఆధార పరిశ్రమలు ఆధిపత్య శక్తులుగా ముందుకు సాగుతాయని భావిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో, టీవీ తరువాత రెండవ అతిపెద్ద విభాగంగా అవతరిస్తుందనీ ఇంకా అన్నిరకాల మాధ్యమ రూపకాలతో అత్యధిక మార్కెటింగ్ వ్యయాన్ని ఆకర్షిస్తుందని భారతదేశంలోని వినోద మాధ్యమాల సాంవత్సరిక నివేదిక తన ప్రకటనలో తెలిపింది.

ప్రాంతీయ భాషలలో డిజిటల్ సమాచారంలో పెట్టుబడులు:

డిజిటల్ సమాచార తయారీలోనూ పంపిణీలోనూ ఇంకా ఆ సమాచార వాడకంలోనూ అన్నిటికీ అనుకూలమైన అంశాలే ఉన్నాయి. ఇవన్నీ కలిసి ప్రాంతీయభాషలలో అంతర్జాల ఆధారిత సమాచార వినియోగాన్ని పెంచుతున్నాయి. ప్రాంతీయ భాషలలో సమాచార

మరి ఇన్ని రకాలుగా ఆధునికతను అందిపుచ్చుకొని, లక్షల కోట్ల రూపాయల వ్యాపారానికి ఆధారమై, లక్షలాది మందికి ఉపాధి ఉద్యోగావకాశాలను కల్పిస్తున్న భారతీయ భాషలను విద్యా మాధ్యమం నుండి తొలగించాలనుకునేవారి తాత్విక చింతన మనకు అర్థం కాకపోవచ్చుగానీ మన కళ్లముందే కోట్లాది ప్రజల జీవితాలకు ఎసరు పెట్టే ఆంగ్లమాధ్యమ ధోరణులను ఎలా అర్థం చేసుకోవాలి?!.

విషయాల సృష్టిలో పెట్టుబడులు పెరగడం భారతదేశంలో ప్రాంతీయ భాషా మార్కెట్లకు ప్రజలనుంచి పెరుగుతున్న ఆదరణ ఫలితమే. ఇంగ్లీష్ మాట్లాడే వాడుకరుల డిజిటల్ వలసలు దాదాపుగా పూర్తి కావడంతో, చాలా మంది కొత్త వినియోగదారులు స్థానిక భాషలతో అంతర్జాలంలోకి వస్తున్నారు - ఇక 2030 నాటికి వారిసంఖ్య 50 కోట్లు దాటవచ్చని భావిస్తున్నట్లు ఆ నివేదిక తెలిపింది. ఈ 50 కోట్లమంది కొత్త వినియోగదారులతో కూడిన డిజిటల్ వ్యాపారాలను అసమానమైన మార్కెట్ అవకాశాలతో అందించటానికి స్థానికభాషల వాడకంలో శిక్షణపొందిన వేలాదిమందికి ఉపాధిని ఇవ్వగల అవకాశాలు ఉంటాయి.

2030 నాటికి, భారతదేశంలో ఇంటర్నెట్‌కు అనుసంధానించబడి దాదాపు ఒక వంద కోట్ల మంది ప్రజలు ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ ప్రారంభ అంచనాల ప్రకారం, ఈ వినియోగదారులు అందరూ ప్రధానంగా ఆంగ్లేతర భాషలలో మాట్లాడుతూ, మొబైల్ ఫోనులలో స్థానిక భాషలను వినియోగిస్తూ, అభివృద్ధి చెందిన గ్రామీణ ప్రాంతాలకూ / మెట్రోయేతర పట్టణ నేపథ్యం నుండి అంతర్జాలంలో సమాచారం కోసం ఎక్కువ చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు అని భారతీయ (కేపీఎంజీ) టెక్నాలజీ, మీడియా అండ్ టెలికాం సంస్థ నివేదిక తెలియజెపుతోంది.

ఇప్పటివరకూ వ్యాపారం నుండి పంపిణీదారుకూ ఆపైన వినియోగదారునికీ మధ్య నడిచే వ్యాపారం అనేదే ఈ - వాణిజ్యంగా ఉండేది. ఈ వ్యాపారం పంపిణీదారులచే నిర్దేశించబడేది. అయితే, డిజిటల్ వాణిజ్య రంగంలో ఈ రోజు వ్యాపారం భిన్నంగా ఉంది. ఇది ఉత్పాదకులకు చెందినది. మధ్యదళారీలైన పంపిణీదారులు లేకుండా వస్తుసేవల ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించేవారుగా, వారి స్వంత పంపిణీదారులతో నడిచే వ్యాపారం. అంటే వినియోగదారులకు నచ్చిన వారి సొంత భాషలలో పంపిణీదారుల ప్రమేయం లేకుండా నడిచే వ్యాపారం. ఈ కొత్త ఈ - వాణిజ్యం స్థానిక భాషల వాడకాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది ప్రపంచీకరణ స్థానికీకరణం కావడానికి చేయూతనందిస్తుంది.

టెలివిజన్ విభాగానికి 2019 ఆర్థిక సంవత్సరంలో మొదటి మూడు త్రైమాసికాలకు అనువుగా ఉంది. కానీ కొత్త పన్నుల విధానం అమలులో సవాళ్లు, వీక్షకుల సంఖ్య ఇంకా చందా పునరుద్ధరణల చుట్టూ ఉన్న అనిశ్చితి-గత మూడు నెలల్లో ప్రకటనలూ చందాలనుండీ వచ్చే ఆదాయాలు రెండింటినీ ప్రభావితం చేశాయి. ఈ 2019 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ పరిమాణంలో భారతీయ భాషలలో టీవీలలో రూ. 25,100 కోట్ల ప్రకటనలనుండీ ఆదాయమూ రూ. 46,300 కోట్ల చందాదారులనుంచీ వచ్చే ఆదాయాలూ ఉన్నాయి. కొత్త వస్తుసేవల సుంక విధాన (జీఎస్టీ) నియమాలూ, రెరా నిబంధనలూ ఇంకా నోట్లరద్దు (డీమోనిటైజేషన్) అమలులో ఏర్పడిన అంతర్జాయాల కారణంగా ముద్రణా మాధ్యమ పరిశ్రమ 2018 ఆర్థిక సంవత్సరంలో కొంత ఎగుడుదిగుళ్లను ఎదుర్కొంది. ఐనా, ఒక దశాబ్దంలో 3.4 శాతం కనిష్ట వృద్ధిని సాధించింది.

భారతీయ ముద్రణ పరిశ్రమ:

ఈ రంగంలో వచ్చిన కొత్త నివేదిక ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా ముద్రణా పరిశ్రమ క్షీణించింది, కానీ భారతీయ భాషల ముద్రణా పరిశ్రమ దానికి ఎదురొడ్డి పెరుగుదలను కొనసాగించటమేకాక ఇంకా 5.6 శాతం చక్రవృద్ధి రేటును సాధించి, 2015 ఆర్థిక సంవత్సరం నుండి 2019 ఆర్థిక సంవత్సరం వరకు పెరుగుదలను నమోదు చేసింది. భారతీయ వాణిజ్య - పరిశ్రమల సమాఖ్య ముద్రణా వినోద మాధ్యమాల నివేదిక (2017) ప్రకారం, టీవీ పరిశ్రమ 2016 లో 8.5 శాతం వృద్ధిని సాధించి 58,840 కోట్ల రూపాయలకు చేరుకుంది. రాబోయే ఐదేళ్లలో టీవీ పరిశ్రమ 14.7% చక్రవృద్ధిని పొందుతుందని, 2021 నాటికి ఇది రూ.1,16,560 కోట్లకు చేరుకుంటుందని చెబుతోంది. భారతీయ వాణిజ్యమూ- పరిశ్రమల సమాఖ్య, 2017 నివేదిక ప్రకారం. అధిక-నాణ్యతగల సమాచారంతో ప్రాంతీయ మార్కెట్ల గిరాకీ మెరుగు కావడం స్పష్టంగా కనబడుతోంది, కాబట్టి మేము అంచనాల ఆకాంక్షలకు ప్రతిస్పందిస్తున్నామనీ ప్రాంతీయ మార్కెట్లు శక్తివంతంగా ఉన్నాయని నివేదిక పేర్కొంటోంది. 2020 నాటికి 14.3 శాతం చక్రవృద్ధి రేటుతో రూ. 2,26,000 కోట్లకు వృద్ధి పొందనున్నదని భారతీయ వినోదమాధ్యమ (ఎం అండ్ ఇ) పరిశ్రమ, భారతీయ వాణిజ్య - పరిశ్రమల సమాఖ్య, వినోద మాధ్యమ పరిశ్రమ నివేదిక (2016) తెలుపుతోంది.

ప్రాంతీయ భాషా ఛానెళ్లు దేశవ్యాప్తంగా తమ ఉనికిని విస్తృతంగా చాటుతున్నాయి. వీటిలో హిందీతో పాటు తెలుగూ తమిళంతో కలుపుకొని అగ్రస్థానంలో ఉన్న 10 ఛానెళ్లతోపాటు ఇతర ప్రాంతీయ ఛానెళ్లు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. గత ఏప్రిల్ 15 తో ముగిసిన సర్వేలో తమిళ వినోద ఛానెల్ సన్ టీవీ దేశంలోనే వీక్షకుల సంఖ్యలో అగ్రస్థానంలో నిలవగా, హిందీ ఛానెళ్లు స్టార్ ప్లస్, కలర్స్ ఇంకా జీటీవీ, జీ - తెలుగు భారతీయ టీవీ ప్రసార వీక్షకుల సంఖ్యలో ముందున్నట్లు పరిశోధనా సంఘం వెబ్‌సైట్‌లోని గణాంకాలు తెలుపుతున్నాయి.

సామాజిక మాధ్యమాలు:

ఫేస్‌బుక్ తన ఆండ్రాయిడ్ యాప్‌లో ఎన్నో స్థానిక భాషలను తన పాఠ్య ఎడిటర్ ఉపకరణాలకు జోడించింది. మొబైల్ అనువర్తనంలోని లిప్యంతరీకరణ లక్షణాన్ని వాడుకర్లు తెలుగు, మరాఠీ, గుజరాతీ, బెంగాలీతో సహా మరో 12 స్థానిక భారతీయ భాషలలో వాడుకొనేందుకు ఇది వీలు కల్పిస్తుంది.

భారతీయ భాషలపై ఎందుకు దృష్టి పెట్టాలి:

ఫేస్‌బుక్ మరియు గూగుల్ వంటి సామాజిక మాధ్యమ దిగ్గజాలు ప్రాంతీయ భాషలపై దృష్టి పెట్టడం ద్వారా భారతీయ మార్కెట్లపై పట్టుకోసం తమ ప్రయత్నాలను పెంచుతున్నాయి. ఎందుకంటే ఈ వ్యాపారాలు అంతర్జాల వినియోగంలో దేశ జనాభాలో అతి

కొద్దిమందికి మాత్రమే పరిచయం ఉన్న ఇంగ్లీషు వినియోగదారులకు మాత్రమే పరిమితం కావాలని కోరుకోవటంలేదు.

ఇటీవలే, గూగుల్ తెలుగు, మరాఠీ, తమిళం, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం ఇంకా ఉర్దూతో కలిపి 8 భారతీయ భాషలలో నోటిమాటతో అంతర్జాలంలో సమాచారాన్ని వెదికే సామర్థ్యాన్ని ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో, గూగుల్ సంస్థ అస్సామీ, బెంగాలీ, బోడో, డోగ్రి, గుజరాతీ, హిందీ, కన్నడ, కాశ్మీరీ, కొంకణి, మైథిలి, మలయాళం, మణిపురి, మరాఠీ, నేపాలీ, ఒడియా, పంజాబీ, సంస్కృతం, సంతాలి, సింధి, తమిళం, తెలుగు, ఉర్దూ వంటి 22 భారతీయ భాషలలో చదవనూ రాయనూ వీలుకలిగించే జి-బోర్డ్ ఉపకరణాన్ని విడుదల చేసింది. ఇదే సంస్థ, వివిధ శోధనా సమాచారాన్ని హిందీలో ప్రదర్శించడం కూడా ప్రారంభించింది. అంతేకాకుండా, బుక్‌మైషో, అమెజాన్ కిండిల్, క్వికర్, స్నాప్‌డీల్ మొదలైన సంస్థలు తమ మొబైల్ అనువర్తనాల్లో కనీసంగా హిందీతో మొదలుపెట్టి తమిళం, తెలుగు మొదలైన అదనపు భాషలకు ఇంటర్‌ఫేస్‌లను జోడించేందుకు చాలా వరకు ప్రయత్నిస్తున్నాయి. వీటికి తోడుగా దేశంలో తయారయ్యే లేదా అమ్ముడయ్యే అన్ని చరవాణులూ బహు భాషాసామర్థ్య లక్షణంతో ఉండటాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పని సరి చేసింది.

మరి ఇన్ని రకాలుగా ఆధునికతను అందిపుచ్చుకొని, లక్షల కోట్ల రూపాయల వ్యాపారానికి ఆధారమై, లక్షలాది మందికి ఉపాధి ఉద్యోగావకాశాలను కల్పిస్తున్న భారతీయ భాషలను విద్యా మాధ్యమం నుండి తొలగించాలనుకునేవారి తాత్విక చింతన మనకు అర్థం కాకపోవచ్చుగానీ మన కళ్లముందే కోట్లాది ప్రజల జీవితాలకు ఎసరు పెట్టే ఆంగ్లమాధ్యమ ధోరణులను ఎలా అర్థం చేసుకోవాలి?!.


తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యామాధ్యమంగా తెలుగువాడకాన్ని అడ్డుకోవడంతో మరో రెండు దశాబ్దాలలో తెలుగు ప్రచురణా రంగంలో నేరుగా సంబంధం ఉన్న తెలుగు రచయితలూ, గ్రంథ ప్రచురణకర్తలూ, ముద్రణా వ్యాపారంలోనూ, పత్రికారంగంలోనూ పనిచేసేవారూ, విలేఖరులూ, వ్యాపారస్తులూ, వాణిజ్యరంగంలోనూ, ప్రకటనారంగంలోనూ పనిచేస్తున్నవారూ మొట్టమొదటగా నిరుద్యోగులవుతారు. ఈ రంగాలకు సంబంధించిన విద్యావేత్తలూ, విద్యార్థులూ మొదలైనవారిపై ప్రభావం పడుతుంది.

తెలుగు చిత్రసీమ:

నటీనటులూ, కళాకారులూ, సినిమా రచయితలూ, సినిమా గాయనీ గాయకులూ, దర్శకులూ, నిర్మాతలూ, సినిమా నిర్మాణరంగ నిపుణులూ, థియేటర్లవ్యవస్థ, పంపిణీ రంగ కార్మికులూ శ్రామికులూ మొదలైనవారు నిరుద్యోగులవుతారు. తెలుగు చిత్ర పరిశ్రమను ఆశ్రయించివున్న తెలుగు బుల్లితెర తల్లకిందులవుతుంది. వీరితోబాటే తెలుగు టీవీ కార్యక్రమాల నిర్మాతలూ, దర్శకులూ, నటీనటులూ, రచయితలూ, గాయనీ గాయకులు, యాంకర్లూ, తదితర అనుబంధ కార్మికులూ శ్రామికులూను.

ప్రజలలో భావప్రసార నైపుణ్య నాశనం:

తెలుగు మాతృభాషగా ఉండికూడా సగంపైగా జనాభా పేదరికం, నిరక్షరాస్యతా, ఉద్యోగలేమి, సామాజిక నిరాదరణా వివక్షతల వలనా, ఆర్థిక ఇబ్బందులతోనూ, అవిద్యతోనూ తల్లడిల్లుతున్న సమాజం మనది. అమ్మదగ్గర నేర్చుకున్న తెలుగుతో గుడ్డిలో మెల్ల మేలన్నట్లు జీవనం సాగిస్తున్న తెలుగువారికి ఇది చావుపిలుపే. ఒకసారి ఆంగ్లమాధ్యమం మొదలైతే ప్రతిచోటా ఇంగ్లీషే రాజ్యమేలుతుంది. ప్రజలందరూ ఇంగ్లీషునే ఆశ్రయించాలి. ఇంగ్లీషులో మాట్లాడినవాడికే పనిజరుగుతుంది. మనం చేసే ఉత్తరప్రత్యుత్తరాలు అన్నీ ఇంగ్లీషులోనే ఉండాలి, దీనితో 90% ప్రజలకుపైగా తమకు



డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
9441427977

విద్య, వైద్యం, ఉపాధి, మీడియా మాయలు

"పెరుగుట విరుగుట కొరకే -
పరిపూర్ణ సుఖంబు లధిక బాధల కొరకే".

తెల్లవాళ్ళ పెత్తనానికి ముందు శిష్ట, మాండలిక భాషలు ఒకటి కొకటి సన్నిహితంగా చలామణి అవుతుండేవి. అచ్చుయంత్రం, పత్రికలు, సార్వత్రిక విద్యలతో ప్రామాణిక భాష బలపడసాగింది. ఈ చదువులు ఉద్యోగాలు కలిసి సంప్రదాయ వృత్తులను తొక్కేసి, విదేశీ ఉత్పత్తులను దిగుమతి చేయసాగాయి. ఆట పాటలు, కథలు వినడం మానేసి, నవలలు చదువుకోటం వాదోపవాదాలతో పత్రికలు హోరెత్తించటం అలవాటైంది.

ఒక 'జాతీయ' సేవాసంస్థ తెలంగాణా విద్య, వైద్య, ఉపాధి రంగాలలో జరుగుతున్న కృషిని ప్రదర్శించింది.

ప్రభుత్వ పాఠశాలలలో విద్యాప్రమాణాలను పెంచే కృషిలో తాము కనిపెట్టిన కొత్తబాటలను కొందరు చాటుకొన్నారు. పిల్లలు లెక్కలలో 'వీక్' గా ఉన్నారు, వారికి తాము బోధించే తీరు మంచి ఫలితాలు సాధించటమే కాదు, పరిశోధకుల మన్ననలు పొందింది అని చెప్పుకొచ్చారు.

గ్రామంలో వృత్తి పనివాళ్ళు అనేక పరికరాలు, సారామట్టం, వడంబం, టేప్, గజం బద్ద, వంటి పరికరాలను వాడుతూ లెక్కలు కడుతూ, తూస్తూ - కొలుస్తూ ఉంటారు... ఒకప్పుడు వీధిబడిలో చదవటం, రాయటం, లెక్కలు, అమరం, ఆంధ్ర నామసంగ్రహం, తిథి వార నక్షత్రాలు సార్వత్రిక విద్య కాగా, ఆయా వృత్తులకు కావలసిన 'లెక్కాచారం' కుటుంబంలోనో, గురువు దగ్గరో నేర్చుకునే వారు. కుటుంబంలో నవశేష్ అనే లెక్కించే పద్ధతి నేర్చుకున్న ఒక మార్వాడి విద్యార్థి, బడిలో రాణించినట్లు చెన్నై ఐ.ఐ.టి లో లెక్కల ఆచార్యుడు (అశోక్ ఝున్ ఝున్ వాలా) స్వయంగా చాటుకున్నాడు. ఇటువంటి పద్ధతితో అన్ని వర్గాలను కలుపుకు పోవాలి. కానీ మా పరిశోధనలు, రాంకులు తెచ్చాయని దబాయింపులు. ఈ 'మెరిటోక్రసి' తోముడులో కొంతమందికి రాంక్ రావచ్చుకాని, బడి మానేసేవారి సంఖ్య పెరుగుతుంది.. సంప్రదాయ పద్ధతి ఏదో మూల, అదికూడా ఉంది అని చెప్పుకోటానికి, నామమాత్రంగా నడుస్తుంది... ఈవేళ లెక్క చేయాలంటే కాలికులేటర్ కావాలి. అర్థాలు కావాలంటే నిఘంటువు వెతకాలి. ధారణశక్తి క్షీణిస్తుంది.

ఇటీవలవరకు మంత్రసాని వ్యవస్థ బలంగా ఉండేది. కానీ ఆస్పత్రి కాన్పు ప్రభుత్వ విధానమయింది. ఉచిత మెడికల్ కాంపుల పేరిట సేవ చేస్తున్నారు.. ఈ ముట్టుకుని మాయమయ్యే (టచ్, వానిష్) సేవల ఫలితాలమీద అంచనాలు ఏమీలేవు. ఉద్యోగాలూ అంతే. ఎంతమందికి శిక్షణ ఇస్తే, ఎంతమంది పనిలో చేరారు, ఎంతమంది కొనసాగు తున్నారు?.

ఎందుకు, ఏ వర్గం వారు మానేసారు. వారికి పునశ్చరణ తరగతులు నిర్వహించాలా? ఈ వివరాలు ఎవరిదగ్గరా లేవు.

దేశీయ సంప్రదాయాన్ని పక్కకు నెట్టటంతోపాటు, సంస్కృతం, హిందీ నేర్చుకోండి అని ప్రత్యక్షంగా పరోక్షంగా వత్తిడి పెంచుతున్నారు. చాత్రవాస్ (హాస్టల్) లలో శ్లోకాలు, జయ జగదీశ హరే హారతులు, హనుమాన్ చాలీసాలు వల్లె వేయిస్తారు. 'అమ్మల గన్న యమ్మ, ఎవ్వనిచే జనించు, తొండము నేకదంతమును - బ్రహ్మ మొక్కటే పరబ్రహ్మ మొక్కటే' వంటి పద్యాలు, కీర్తనలు వినిపించవు. లెజిమ్స్ (యోగచాప్) కు తప్ప కోలాటానికి చోటులేదు. ఒకప్పుడు ఇతిహాస సంకలన సమితి ద్వారా 1935 నుండి వెనుకకు చరిత్ర పునర్నిర్మిద్దాం అని పిలుపు నిచ్చారు. ఇప్పుడు అటునుండి అంటే వెనుకనుండి వెతుకుదాం అంటున్నారు. 'యోగ', వేద గణితం (మాథమాటిక్స్) సంస్కారం, ఇలా పాఠాలు కార్పోరేట్ లెవెల్లో మార్మోగుతున్నాయి..

మీడియా విషయానికొస్తే తెల్లవాడి చదువుకు ఉద్యోగం పరమావధి. అక్కడ గొడ్డులా పనిచేయటం తప్ప, కలలు గనే, ప్రశ్నించే అవకాశం లేని మధ్య తరగతి, సాహిత్యం ద్వారా కుతి తీర్చుకోసాగింది. సమష్టి సృజనాత్మకత బదులు వ్యక్తి, ఆధిపత్య ధోరణులు పెరిగినాయి. ఈ ధోరణులవల్ల వచ్చే నష్టాలను, ఆ అవకాశం ఇంకోడికివ్వటం ఎందుకు, అని ఒక పక్క ఏకరువు పెడుతూనే, కుక్కతోక వంకర అంటూ ఆ దారినే పోతుంటారు, కార్పోరేట్ సేవ చేస్తుంటారు. జాతీయతకు కొత్త భాష్యాలు చెపుతుంటారు. ఈ మిడిసిపాటు అట్టే రోజులు సాగదు. అంతవరకు, సంప్రదాయంలో సమష్టి జ్ఞానాన్ని ముందుతరాలకు అందించే దేశ భాషలను కాపాడుకోవటమే ప్రస్తుత కర్తవ్యం.

తెలియని భాషలో ఏమీ చెప్పలేక చేయలేక ఇంగ్లీషు వచ్చినవారికి డబ్బిచ్చి ఇంగ్లీషులో మాట్లాడించడం రాయించడం చేయించు కోవలసిన అగత్యం ఏర్పడుతుంది.

మానవీయ విలువలకు హాని:

తెలుగులో మానవీయ విలువలు గురించి చదవడం, రాయడం, పునశ్చరణ, చర్చించడం నశించడంతో విద్యార్థులూ, ఉపాధ్యాయులూ, తల్లిదండ్రులూ మిగిలిన సమాజం మొత్తంపై దీని ప్రభావం పడుతుంది. ఇది మనలో సహనం నశించడానికి దారి తీస్తుంది, ఇంకా ఎంతకాలం ఈ ఓర్పు? భరించలేని కష్టకాలపుటంచులకు చేరిన జీవితాలు!. రాజకీయుల శుష్కవచనాలు ఖాళీ పొట్టలను నింపలేవు గదా!.

ఉన్నవాటినికూడా పీకెయ్యడం దారుణం. అడుక్కు తినేందుకు కూడా వీలులేకుండా చేస్తుంది ఈ ఇంగ్లీషు మీడియం. అన్ని రకాలుగా వంచితులై, బ్రతుకే భారమై, బ్రతక లేక చావలేక, ఏమి చేయాలో పాలుపోక ఆశా నిరాశల మధ్య అలిసిపోయి నిస్పృహతో ఆత్మ హత్యలూ, హత్యలే శరణ్యం ఇక.

ఆచార్య పులికొండ సుబ్బాచారి
9440493604

తెలుగుభాషా.. నీకు కుండబద్దలు కొట్టారు, ఇక కొరివి పెట్టడమే మిగిలింది

ఏలినవారు తెలుగుపట్ల తీసుకోవలసిన నిర్ణయాలపైన దోబు చులాడుతూ వస్తున్నారు. ఏదో మేలు జరుగుతుందని రెండు రాష్ట్రాలు ఏర్పడిన దగ్గరనుండీ తెలుగు ప్రజలు ఎదురు చూస్తున్నారు. తెలుగు భాషకు మంచి రోజులు వస్తాయని ప్రజలు ఆశపడుతున్నారు. ఈ దోబూచులాట అంతమైంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుండ బద్దలుకొట్టింది. ఇక పైన అన్నీ ఇంగ్లీషు మీడియం పాఠశాలలే ఉంటాయని వాటిలో తెలుగు ఒక భాషగా ఉంటుందని ఇక పైన పాఠశాలలలో తెలుగులో చెప్పే వారికి ఇంగ్లీషులో చెప్పడంలో ఆరు నెలల పాటు శిక్షణ ఇప్పిస్తామని ప్రభుత్వం స్పష్టంగా కుండ బద్దలుకొట్టింది. ఇక్కడ నేను కుండబద్దలు కొట్టిందని సరైన ఉద్దేశం తోనే అన్నాను. మన ఆచారాల ప్రకారం ఒక వ్యక్తిని కాష్టం మీద పెట్టి, వారసుడు కొరివి పెట్టే ముందే, కుండబద్దలు కొట్టిస్తారు. తర్వాత కొరివి పెడతాడు. తెలుగును కాష్టం మీద పెట్టారు. కుండబద్దలు కొట్టారు. ఇక మిగిలి ఉన్నది కొరివి పెట్టి పూర్తిగా తగులబెట్టడమే. వారు చెప్పిన ఇంగ్లీషు మీడియం పాఠశాలలు వస్తే కొరివిపెట్టి కాల్చడం పూర్తి అవుతుంది.

తెలంగాణ రాష్ట్రంలో కూడా తెలుగు పరిస్థితి పైన తొలి రోజుల్లో చాలా ఆశ కలిగింది. పాఠశాల స్థాయి వరకు తెలుగు తప్పని సరిగా ఉంటుంది అని చెప్పారు. బోధనభాషగా ఉంటుందని నాలాంటి వారు చాలా మంది ఆశపడిన మాట వాస్తవం. ఇక ప్రపంచ తెలుగు మహాసభలు నాలుగేండ్ల క్రితం హైదరాబాదులో జరిగినప్పుడు తెలుగుకు మంచి రోజులు వస్తాయని ఆశ పడిన రోజులు ఇంకా బాగా గుర్తున్నాయి. వీరు కూడ కొత్త జీవోలు తెచ్చారు.

తెలుగు తప్పనిసరిగా ఒక భాషగా అన్ని పాఠశాలల్లో ఉండాలి అని కృషి చేశారు. కొత్త పాఠ్య గ్రంథాలు వేరు వేరు ప్రథమ భాషల వారికి చేయించారు. కేంద్రీయ విద్యాలయాల వారితో కూడా తెలుగును తప్పనిసరిగా పెట్టేవిషయంలో మంచిచర్చ చేశారు. కొన్ని సమస్యలను అధిగమించడానికి కూడా పనిచేశారు. ఇంతవరకు మెచ్చదగిన విషయమే.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాలలను ప్రైవేటు వారు పెట్టడా నికి అనుమతించడం దాదాపు నాలుగు దశాబ్దాల క్రితమే మొదలైంది. కాని అప్పుడు ధార్మిక సంస్థలు, ట్రస్టులు ఒక పవిత్ర ఆశయంతో విద్యావ్యాప్తికి కృషి చేయాలని పెట్టారు.

విశాలమైన స్థలంలో మంచి వసరులతో వీటిని మొదలు పెట్టారు. అలాంటి కొన్ని పాఠశాలలకు ప్రభుత్వం గ్రాంటులు కూడా ఇచ్చి, ఎయిడెడ్ విద్యాసంస్థలుగా చేసింది. ఇక రెండున్నర దశాబ్దాల క్రితం వ్యాపారవర్గాలు చదువు వైపు దృష్టి పెట్టాయి.

> తెలుగు మీడియంలో చదువుకుంటే ఉద్యోగాలు రావు అనే మాట కేవలం విద్యావ్యాపారులు ప్రచారం చేసిన ఒక తప్పుడు వ్యాపార నినాదం. ఇది నిజం కాదు. తెలుగు రాష్ట్రాలలో 13,00,000 అక్షరాలా పదమూడు లక్షల ఉద్యోగాలు ఉన్నాయి. ఈ పదమూడు లక్షల మంది ఉద్యోగులు తొమ్మిది కోట్ల తెలుగువారికి సేవలు చేయాలి అంటే ఉద్యోగంలో వారు రాసేది తెలుగులో ఉంటే సరి పోతుంది. పదమూడు లక్షలమంది తొమ్మదికోట్ల తెలుగు వారికి తెలుగులోనే సేవచేయడానికి పరిపాలన అంతా తెలుగులోనే ఉంటే ఈ ఉద్యోగులు తెలుగులోనే పనిచేస్తారు. దీనికి తెలుగు మీడియంలో చదువుకున్నవారే అవసరం అవుతారు.

రిస్కులు లేకుండా వ్యాపారానికి పనికి వచ్చేవి, పాడి కుండ లాగా ఆదాయాన్ని తెచ్చేవి విద్యాసంస్థలే, అనే రహస్యాన్ని వారు గ్రహించిన తర్వాత, ఆ రంగంలో బాగా పెట్టుబడి పెట్టి, ఇబ్బడి ముబ్బడిగా ఆదాయం సాధించే సులువు కనిపెట్టారు. ఈ క్రమంలోనే ఇంగ్లీషు మీడియం మీ భవిష్యత్తును బంగారం చేస్తుంది అనే నినాదంతో వారి వ్యాపారం మూడు పూవులు ఆరు కాయలు అవుతుందని గ్రహిం చారు. ఇక వెనక్కు తిరిగి చూడలేదు.

తొలిరోజుల్లో ఒక ప్రైవేటు పాఠశాలకు అనుమతిని ఇవ్వాలంటే కనీసం ఐదు ఎకరాల సొంత భూమి ఉండాలి. మంచి భవనాలు ఉండాలి. అవి బడి పెట్టే సొసైటీ వారి సొంతానివి అని పత్రాలు చూపించాలి. ఇక కళాశాల పెట్టాలి అంటే కనీసం 25 ఎకరాల స్థలం ఉండాలి ఇన్ని వనరులూ ఉండాలి అనే నియమాలు ఉండేవి. అవి తప్పనిసరి నియమాలుగా ఉండేవి.

ఈ రంగంలో వ్యాపారస్తులు పెరిగి వారిలో రాజకీయ నాయ కులు, ప్రభుత్వంలో పలుకుబడి పెరిగిన నాయకులు చేరడంతో– ఈ నియమాలు సడలి పోయాయి. ఇక డిగ్రీ, పిజీ కాలేజి కూడా రోడ్డు పక్కన అపార్ట్‌మెంటు గదుల్లో ట్రాఫిక్ రణగొణ ధ్వనుల మధ్య నేడు నడుస్తున్నాయి. అలా పెట్టుకోవడానికి కూడా ఏలినవారు ఉదారహృదయంతో అనుమతులు ఇస్తూ, విద్యాసేవ చేస్తున్నారు. నేడు పాఠశాల పెట్టాలన్నా, కళాశాల పెట్టాలన్నా ఎంత తేలికగా ఎక్కడైనా పెట్టడానికి వీలవుతుందో – నేడున్న పాఠశాలలను చూస్తే

తెలుస్తుంది.

ప్రభుత్వాలు విద్యారంగాన్ని మొత్తం ప్రైవేటు వారి చేతికి అప్పజెప్పి చేతులు కడుక్కున్నాయి. విద్యార్థులు రావడం లేదు అని అంటూ, రేషనలైజేషన్ అనే పేరు చెప్పి ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం లేదా నాలుగు ఐదు కలిపి ఒకటి చేయడం చేస్తు న్నాయి. దీనికి కారణం ప్రైవేటు చేసే వ్యాపారంలో ఇంగ్లీషు మీడియం అనేది మంచి వ్యాపార సూత్రంగా మార్చుకున్న తర్వాత మీ పిల్లల భవిష్యత్తు కేవలం ఇంగ్లీషు మీడియంలోనే ఉంది అని ప్రజలు నమ్మ బలికేలా చేయగలిగింది ప్రైవేటు వ్యాపార రంగం. ఈ ధోరణిని ఖండించాలని ప్రభుత్వ వర్గాలు ఏనాడూ ప్రయత్నించలేదు. వెనక్కు తిరిగి చూచుకుంటే జరగవలసిన నష్టం అంతా జరిగిపోయింది. తమ పిల్లలకు ఇంగ్లీషు మీడియం చదువు చదివితేనే ఉద్యోగాలు వస్తాయనే స్థిరమైన భావనకు వచ్చారు ప్రజలు. ఒక రిక్షాకార్మికుడు, ఒక రోజు వారీ పనులు కూలీ చేసుకునేవారు సైతం తమ బిడ్డలను ఇంగ్లీషు మీడియంలో చదివించుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందనే స్థిరమైన భావనకు వచ్చారు. ఈ స్థితి రావడానికి మూడు దశాబ్దాలు పట్టింది. ఈ మూడు దశాబ్దాలలో విద్యారంగాన్ని పటిష్ఠ పరచడానికి కాని, ప్రభుత్వ పాఠశాలలను బలీయం చేయడానికి కాని, బోధన మాధ్యమంగా తెలుగును గట్టిపరచడానికి కాని ప్రభుత్వాలు పూను కోలేదు. అధికారభాషగా తెలుగు అమలు చేయడానికి కాని ప్రభుత్వాలు చేసిన ప్రయత్నం నామమాత్రమే. ప్రభుత్వాలు చేసిన ఈ పాపం కారణంగానే ప్రభుత్వ పాఠశాలలు ఈ రోజున బతికున్న భౌతికకాయాలుగా మారా యి. బోధనభాషగా పాఠశాలలో తెలుగు అంతం కావడానికి కారణం ఇలా స్లోపాయిజన్ (కనపడని విషయం లాగా) లా వచ్చిన ప్రైవేటు వ్యాపారమే. దీనిపట్ల ప్రభుత్వాలు అనుస రించిన అనర్థ విధానాలు, ఉదాసీన వైఖరే కారణాలు. ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకొని కొందరు స్వయంప్రకటిత మేధావులు-దళితులకు వెనుక బడిన తరగతుల విద్యార్థులకు ఇంగ్లీషు మీడియం చదువే కావాలని, అగ్రకులాల వారు అందరూ ఇంగ్లీషుమీడియం చదువులతో విదేశాలకు పోతున్నారు. బహుజనులకు మాత్రం తెలుగు మీడియం చదవాలా అని వాదిస్తున్నారు. పరోక్షంగా తెలుగు అంతానికి ఈ మేధావులు పాటు పడుతున్నారు.


పోయిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఒక మంత్రి ప్రైవేటు విద్యావ్యాపారంలో శిఖరం లాంటి వాడు మున్సిపాలిటీ పాఠశాలలు అన్నింటిలో ఇంగ్లీషు మీడియం అమలు చేస్తాము అని ప్రకటించగానే తెలుగు భాష ఉద్యమకారులు భాషాప్రేమికులు పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఫలితంగా వారి నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపారు. కాని నేటి ప్రభుత్వం పాఠశాలలు అన్నింటిలో ఇంగ్లీషు మీడియం అమలు చేస్తామని, తెలుగును ఒక భాషగా మాత్రమే ఉంచుతామని స్పష్టమైన ప్రకటలను చేశారు. ఇది తెలుగు భాష అభివృద్ధికి ఉరితాడు తగిలిం చడమే. పాఠశాల స్థాయిలోను కళాశాల స్థాయిలోను తెలుగు మాధ్యమ భాషగా అంటే బోధన భాషగా లేకుంటే తెలుగు భవిష్యత్తు ఇక్కడ ఆగిపోవడం ఒక ప్రమాదం అయితే, రెండు మూడు దశాబ్దాల లోనే అంతంకావడానికి ఇది యమునిమహిషపు ప్రమాదఘంటికలే.

> మనకున్న ఇద్దరు ముఖ్యమంత్రులూ మంచి అభిరుచి కలిగిన వారు. విద్యావంతులు. తెలుగు భాషకు జరగబోతున్న తీవ్రమైన నష్టాన్ని వీరిద్దరి దృష్టికి తీసుకుపోవలసిన బాధ్యత భాషావేత్తలందరి పైన ఉంది, ప్రజలందరిపైనా ఉంది. తెలుగు అధికారభాషగా పూర్తి స్థాయిలో అమలు కావడం, పాఠశాలలు అన్నింటిలో ప్రైవేటు పాఠ శాలల్లో కూడా తెలుగు బోధన భాషగా పూర్తిగా అమలు చేయించడం - ఇందుకు మన ముఖ్యమంత్రులను ఒప్పింప జేయడం- మనందరి తక్షణ కర్తవ్యం.

విద్యాబోధనలో లేని ఏభాష అయినా అంతం కావడానికి నలభై సంవత్సరాలు చాలునని అంతర్జాతీయ సంఘం యునెస్కో ఎప్పుడో చెప్పింది. ఏ శాస్త్రమైనా ఏ వ్యక్తికి అయినా అతని మాతృ భాషలోనే నేర్చుకోవడం సులభం అనే మాట ఇక్కడ కొత్తగా చెప్ప వలసిన అవసరం లేదు. చాలా శాస్త్రీయంగా ఇప్పటి దాకా భాషా వేత్తలు వాదిస్తూ వస్తూనే ఉన్నారు. పాఠ్యపుస్తకాలు తెలుగులో ఉంటే వివిధ శాస్త్రాలను విద్యార్థి చాలా సులువుగా బోధపరచుకొని చదువుకోవచ్చు, విజ్ఞానాన్ని పెంచు కోవచ్చు. ఇంగ్లీషు ఒక భాషగా తప్పక చదవవలసి ఉంది కనుక ఇక్కడ ఇంగ్లీషును నేర్పడం శాస్త్రీయంగా బలంగా చేస్తే ఏ విద్యార్థి అయినా ఆ ఇంగ్లీషు పటిమతో ఎక్కడైనా ఉద్యోగం చేయ వచ్చు. ఇప్పుడు చెప్పే ఇంగ్లీషు మీడియంలోని ఇంగ్లీషు ఏ విధంగానూ ఉపయోగకారి కాదు. ఇతర దేశాలకు పోయి ఉద్యోగం చేయాలంటే తిరిగి ఇంగ్లీషు భాషా పటిమకు సంబంధించిన పరీక్షలు GRE, TOFEL, ఇలాంటి పరీక్షలు పాసయితే తప్ప అక్కడికి పోవడానికి అనుమతిని ఇవ్వరు. కాని ఈ పరీక్షలలో తెలుగు మీడియం విద్యార్థులుకూడా బాగానే పాస్ కావడానికి అవకాశం ఉంది. రష్యా, చైనా పోయి అక్కడ MBBS చదువుకునే విద్యార్థులు అక్కడ రష్యన్ భాష, చైనీస్ భాష తప్పక నేర్చుకోవలసిన పరిస్థితి వచ్చింది. దీన్ని చూసి అయినా మన తెలుగు ప్రభుత్వాలు తెలివిడి తెచ్చుకోలేక పోతున్నాయి. అంతేకాదు, అక్కడ నుండి మెడిసిన్ పట్టా పుచ్చుకొని ఇక్కడికి వచ్చిన వారికి అనాటమీలోకాని, ఇతర విభాగాలల్లో కాని- ఇక్కడ ఇంగ్లీషు పదాలు ఏమి వాడుతున్నారో తెలియదు. కారణం అక్కడ వారు రష్యన్ చైనీస్ భాషలో నేర్చుకొని వచ్చారు. ఇలా వచ్చిన వారికి ఇక్కడ భారత ప్రభుత్వం తిరిగి ఒక పరీక్ష పెట్టి - అందులో ఉత్తీర్ణత పొందితేనే - వైద్య వృత్తి చేయడానికి అనుమతిని ఇస్తున్నారు. ఇదే విద్యను ఇక్కడి వారికి ఇక్కడి భాషలలో చెబితే ఇక్కడి వ్యక్తులు అందరికీ వైద్యం అందించడానికి ఎంతో బాగుండేది కదా.

తెలుగు మీడియంలో చదువుకుంటే ఉద్యోగాలు రావు అనే మాట కేవలం విద్యావ్యాపారులు ప్రచారం చేసిన ఒక తప్పుడు వ్యాపార నినాదం. ఇది నిజం కాదు. తెలుగు రాష్ట్రాలలో

ఓట్లు అడిగేది తెలుగులో...పరిపాలించేది ఉత్వర్వులిచ్చేది ఇంగ్లీషులోనా?



13,00,000 అక్షరాలా పదమూడు లక్షల ఉద్యోగాలు ఉన్నాయి. ఈ పదమూడు లక్షల మంది ఉద్యోగులు తొమ్మిది కోట్ల తెలుగువారికి సేవలు చేయాలి అంటే ఉద్యోగంలో వారు రాసేది తెలుగులో ఉంటే సరి పోతుంది. పదమూడు లక్షలమంది తొమ్మదికోట్ల తెలుగు వారికి తెలుగులోనే సేవచేయడానికి పరిపాలన అంతా తెలుగులోనే ఉంటే ఈ ఉద్యోగులు తెలుగులోనే పనిచేస్తారు. దీనికి తెలుగు మీడియంలో చదువుకున్నవారే అవసరం అవుతారు. ఈ లక్ష్యంతోనే మన పక్కనున్న సోదర ద్రావిడ భాషారాష్ట్రాలు బోధన భాషగా తమ భాషనే పెట్టుకున్నాయి. కన్నడం వారు అయితే విశ్వవిద్యాలయాలలో కన్నడంలో పిజి కోర్సులు అందిస్తున్నారు. తమిళం వారు హైకోర్టు కూడా పూర్తిగా తమిళంలో పనిచేయాలని ఉద్యమం చేస్తున్నారు. వారి పాలన భాష పూర్తిగా మాతృభాష. క్లాసికల్ తమిళ సంస్థని వారి నట్టింట్లోకి తెచ్చుకొని వందల కోట్ల నిధులు కేంద్రం నుండి పొందుతున్నారు. మనం వారిని చూచి సిగ్గుపడవద్దా.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 1971 నాటికే అన్ని పాఠ్యపుస్తకాలు పిజి వరకు తెలుగులో రాయించారు. తెలుగు అకాడమీని 1965లో నాటి ముఖ్యమంత్రి పివి నరసింహారావుగారి నేతృత్వంలో పెట్టిన తర్వాత ఇది సాధ్యం అయింది. చాలాకాలం డిగ్రీవరకు తెలుగు మాధ్యమం బాగా అమలైంది. నేను కూడా డిగ్రీని తెలుగు మీడియంలో చదువు కున్నాను. 1980 దశకం వరకు బాగానే సాగింది. ప్రైవేటు వ్యాపారం ఎప్పుడు బలపడుతూ వచ్చిందో క్రమంగా ఇంగ్లీషు మీడియం వ్యాపార సూత్రంగా గట్టిపడుతూ వచ్చింది. నేటికి ఒక దారుణమైన పరిస్థితి – చావో రేవో అనే పరిస్థితి తెలుగుకు వచ్చింది.

పాఠశాలలన్నీ ఇంగ్లీషు మీడియంలోనికి పోతే తెలుగు మన కళ్ళ ముందే కేవలం మౌఖిక భాషగా మిగిలిపోతుంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వాతంత్ర్యం పొందిన ప్రజలు అందరూ వారి మాతృభాషలో పరిపాలన పొందడం తన ఇంటి పక్కనున్న ప్రభుత్వ కార్యాలయానికి పోయి తన మాతృభాషలో అతని పనులు అన్నీ చేసుకోగలగడం అతనికి ప్రజాస్వామ్యం ద్వారా సంక్రమించిన హక్కు. భాషాహక్కు అనేది ఇది ప్రాథమిక హక్కే అవుతుంది. తనకు తెలియని భాషలో ప్రభుత్వ కార్యకలాపాలు జరుపుకోవడం తనకున్న హక్కుకు వ్యతిరేకం. అలా జరిగితే ఆ పౌరులకు స్వాతంత్ర్యం వచ్చినట్లే కాదు.

తమకున్న ఈ హక్కును ప్రజలందరూ గ్రహించాలి. ప్రభుత్వ పాలన అంతా తెలుగులో ఉండాలని వారి హక్కుగా ఉద్యమం చేయాలి. ప్రభుత్వ పాలనలో అన్ని స్థాయిలలో తెలుగు అధికారభాషగా అమలు అయితే పదమూడు లక్షలమంది ఉద్యోగులు తెలుగులోనే పనిచేయవలసి ఉంటుంది. అప్పుడు ప్రభుత్వఉద్యోగాలు అన్నీ తెలుగు మీడియంలో చదువుకున్న వారికే అని ధైర్యంగా ప్రకటించవచ్చు. అప్పుడు పాఠశాలలు అన్నీ జూనియర్ కళాశాలలు తెలుగు మాధ్యమంతోనే పనిచేస్తాయి. ఈ విద్యావ్యాపారులు కూడా విధిగా తెలుగు మీడియం వైపునకు వస్తారు. ఈ మాత్రం తెలివిడి నాలుగు దశాబ్దాలుగా మన పాలకులకు కలగలేదు. నేటికైనా ఈ ఆలోచన ప్రభుత్వం వారికి కలగ జేయడం ప్రజల బాధ్యత తెలుగు భాషోద్యమకారులు

హైదరాబాదు పాతబస్తీలో తెలుగు పాఠాలు నేర్చుకుంటున్న ముస్లిం యువత

గత రెండు దశాబ్దాలుగా హైదరాబాదు నగరంలో పెరిగిన నగరీకరణ, అభివృద్ధి వలన- పాతబస్తీ ప్రజలు తెలుగు నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఈ విష యాన్ని గమనించిన జమాత్-ఎ -ఇస్లామి హింద్ సంస్థ-పాతబస్తీలోని పిల్లలు, పెద్దలు, యువతకు తెలుగు భాషలో మాట్లాడేందుకు తర్ఫీదునిస్తున్నది.

హైదరాబాదు పాతబస్తీ, కొందరికి ఈ ప్రాంతంలో తెలుగు అసలే వినపడదు అన్న అపోహ ఉంది. హైదరాబాదు లోని చార్మినార్ కేంద్రంగా ఆనుకొని, ఆ చుట్టూ ఒక ఆరేడు కిలోమీటర్ల వ్యాసార్థమున్న వృత్తం గీసుకుంటే వచ్చే ప్రాంతమే పాతబస్తీ అంటే. ఇందులో చార్మినార్, షాలిబండ, అలియాబాద్, ఫలక్నుమా, చాంద్రాయణగుట్ట, బార్కాస్, డబీర్‌పుర, యాకుత్ పుర, పాత మలక్‌పేట, సైదాబాద్, చంచల్‌గూడా, ఈదీబజార్, పురానీహవేలీ, ఖిల్వత్, ముగల్‌పురా, దూధ్‌బౌలీ, మూసాబౌలీ, పత్థర్‌ఘట్టీ, కుల్సుంపురా, జియాగూడా, టోలీచౌకీ, మెహ్దీపట్నం, నాంపల్లి, మల్లెపల్లి, దారుస్సలాం మొదలగు ప్రాంతాలు వస్తాయి. ఈ ప్రాంతాలన్నీ ముస్లిం జనాభా ఎక్కువగా నివసించే ప్రాంతాలు.

మిగతా తెలుగు రాష్ట్రాలలో మహమ్మదీయులకు తోటి తెలుగువారితో కలిసి మాట్లాడే సందర్భాలు అనేకం. అయితే ఈ పాతబస్తీలో మహమ్మదీయులకు తోటి తెలుగువారితో కలిసి మెలిసి ఉండే పరిస్థితులు తక్కువగా ఉండటం వలన-వారికి తెలుగు నేర్చుకోవాల్సిన అవసరం ఉండేది కాదు.

అయితే మారుతున్న పరిస్థితులలో ఉద్యోగపరంగా, వ్యాపార పరంగా తెలుగు నేర్చుకోవాల్సిన అవసరం పుట్టుకొచ్చింది.

ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని జమాత్-ఎ-ఇస్లామి హింద్ సంస్థ హైదరాబాద్ పాతబస్తీలోని ఖిల్వత్ ప్రాంతంలో తెలుగు తరగతులను నిర్వహిస్తోంది. సాఫ్టువేర్ ఉద్యోగులు, విద్యార్థులు, యువత ఎక్కువగా పాల్గొంటున్న ఈ తరగతులకు అన్ని వయసుల వారి నుండి మంచి ఆదరణ లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

ఈ తరగతులను ఎం.ఎ. సమద్ అనే తెలుగు పండితుడు నిర్వహిస్తున్నారు.

మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయ ఆచార్యుడు - ఫహీముద్దీన్ మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం 19,20 శతా బ్దాలలో నిజాం ప్రభుత్వం కింద ఉర్దూ అన్ని

(...తరువాయి 17 వ పుటలో)

తెలుగు భాషకు అత్యయిక పరిస్థితి వచ్చిందని ఒక సంక్షోభంలో పడిందని ప్రజలందరికీ అర్థమయ్యేలా గొంతెత్తి పెద్ద ఎత్తున ఉద్యమం కొన సాగించాలి.

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి స్వయంగా భాషా ప్రేమికుడు, సాహితీ వేత్త, కావ్యాలు ప్రబంధాలు క్షుణ్ణంగా చదువుకున్న పండితుడు. భాషకు కొంత వెలుగు తేవాలని తపన పడ్డాడు. ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి తన భాషా ప్రేమికతను వెల్లడించాడు. తెలుగును తప్పనిసరి సబ్జక్టుగా అమలుచెయ్యడానికి తొలి అడుగులు వేయించాడు. కనీసం పాఠశాల స్థాయి వరకైనా బోధనభాషగా తప్పనిసరిగా చేయాలని సరైన నిర్ణయం తీసుకోవాలి. భాషా వేత్తలు ఇందుకు ఆయనను ఒప్పించడం అంత కష్టం కాదు. దీనికోసం కృషి చేయాలి. ఆంధ్రప్రదేశ్ లో వచ్చిన యవ ముఖ్యమంత్రి పాలనలో కొన్ని చాలా మంచి నిర్ణయాలు తీసుకుంటున్నారు. మద్య నిషేధం, ఉద్యోగ కల్పన ఇంకా పాలన పరమైన కొన్ని నిర్ణయాలు ప్రజల్లో కొత్త ఆశలు కలిగించాయి. తెలుగు మీడియం తొలగిస్తే భాషకు వచ్చే అపారమైన నష్టం ఏమిటో భాషా వేత్తలు తప్పనిసరిగా ఆయన దృష్టికి తీసుకుపోవాలి. ఇంగ్లీషు మీడియం అమలు వెనుక ప్రైవేటు విద్యావ్యాపారుల ప్రభావం ఉండవచ్చు. తెలుగు మీడియం చదువు ప్రేవేటు వ్యాపారానికి అడ్డుకాదని ప్రభుత్వ పాలన ద్వారా చెప్పించ గలగాలి.


పాఠశాల విద్య అంతా ఇంగ్లీషు మీడియం అయితే ప్రైవేటు వ్యాపార సంస్థల పోటీలో ప్రభుత్వ పాఠశాలలు నిలవలేవు. నిజానికి చాలా ప్రతిభావంతులైన ఉన్నత డిగ్రీలు అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉంటారు. వ్యాపార సంస్థలలో గతిలేక వారు ఇచ్చే కొద్దిపాటి జీతానికి పనిచేసే అధ్యాపకులు ఎలా పనిచేస్తారో వారి యాజమాన్యం గీసే గీతలు చెబుతాయి. మార్కులు ర్యాంకుల యుద్ధంలో బాల్య జీవితాన్ని బలిపెట్టే యంత్రాలుగా ఆ పాఠశాలలు, అక్కడి అధ్యాపకులు పనిచేస్తున్నారు. ఇదే కొనసాగుతున్నది. క్రమంగా విద్యారంగం అంతా ప్రైవేటుపరం అవుతుంది. ఇది జాతికే తీరని నష్టం. వ్యాపారస్తులను విద్యారంగం వైపునకు రాకుండా కట్టడి చేయడం ప్రభుత్వానికి అంత కష్టమైన పనికాదు. కాని దురదృష్టవశాత్తు ప్రభుత్వాలపైన అత్యంత ప్రభావం వేసే పదవులలో ప్రైవేటు విద్యా వ్యాపారులు రావడం మనం చూస్తున్నాం.

మనకున్న ఇద్దరు ముఖ్యమంత్రులూ మంచి అభిరుచి కలిగిన వారు. విద్యావంతులు. తెలుగు భాషకు జరగబోతున్న తీవ్రమైన నష్టాన్ని వీరిద్దరి దృష్టికి తీసుకుపోవలసిన బాధ్యత భాషావేత్తలందరిపైన ఉంది, ప్రజలందరిపైనా ఉంది. తెలుగు అధికారభాషగా పూర్తిస్థాయిలో అమలు కావడం, పాఠశాలలు అన్నింటిలో ప్రైవేటు పాఠశాలల్లో కూడా తెలుగు బోధన భాషగా పూర్తిగా అమలు చేయించడం - ఇందుకు మన ముఖ్యమంత్రులను ఒప్పింపజేయడం- మనందరి తక్షణ కర్తవ్యం.

నేడు దీన్ని మనం విస్మరిస్తే, తెలుగు భాష రెండు మూడు దశాబ్దాలలో నోటిభాషగా మిగిలిపోయే స్థితి వస్తే, శాస్త్రాలు ఏవీ మనభాషలో లేని దౌర్భాగ్యం వస్తే, రాబోయే తరాలు మనలను క్షమించ లేని పాపం చేసినవాళ్ళం అవుతాము. తస్మాత్ జాగ్రత్త!!!.

సన్నిధానం నరసింహశర్మ
9292055531

నాణేల సేకరణ తపస్సులో జీవితాన్ని పునీతం చేసుకున్న కీర్తిశేషుడు
పేరిచర్ల సూర్యనారాయణరాజు గారు



కనువెలుగు : 11-11-1933 కనుమరుగు : 6-10-2019

చాలానాళ్ళ క్రింద - కాదు, చాలా ఏళ్ళ క్రిందట ఓ రోజున శ్రీ గౌతమీ గ్రంథాలయానికి ఓ ఫారెస్టు చెకింగ్ ఆఫీసరు వచ్చారు. గ్రంథాలయం అంటే సాంస్కృతిక మానవుల జ్ఞాన సంచలనాలుగా ఉండే రోజులవి. పరిచయాల పరిమళాలు, పలకరింపులు, జ్ఞానాం శాల పంపకాల్లో పులకరింపులూ వుండేవి. గ్రంథాలయ కార్యదర్శి, రచయిత మహీధర జగన్మోహనరావుగారికి తపాలా బిళ్ళల సేకరణ వ్యసనంగా ఉండేది. ఆయన తీసుకురాగా ఆ అటవీ శాఖాధికారి వచ్చారు. నాకూ, కవి కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణకు, బౌద్ధ గ్రంథాలను మథించే దినచర్య వుండే ఇమంది రామకృష్ణదాస్‌కు, వోయిస్ ఆఫ్ అమెరికా కార్యక్రమాలు వినడంలో అమెరికా రాయబార కార్యాలయంచే గౌరవింపబడిన విరలా రాఘవరావుకు (తరువాత కాలంలో ఈయన స్పెయిన్ రాయబారి కార్యాలయంలో ఉద్యోగించారు) ఆ కాకీ దుస్తుల్లో ఉన్న ఆ అధికారిని చూపిస్తూ 'ఈయన పేరు పేరిచర్ల సూర్యనారాయణరాజు, ఈయన మన ప్రాచీన కాలం నాటి నాణేలను ఎన్నో సేకరించారు. ఉత్త సత్తెకాలపు మనిషి.' అంటూ చెప్పబోతూండగానే రాజుగారు ఆపుదల లేకుండా నా దగ్గర ఇవి వున్నాయి, అవి వున్నాయి. నేనిలా కష్టపడ్డాను అలా కష్టపడ్డాను. నాకు వాళ్లు తెలుసు, వీళ్లు తెలుసు అని ఏకరువు పెడుతూంటే అతిశయోక్తులు చెబుతున్నారేమో అనిపించింది. తీరా ఆయన ఇంటికి వెళ్ళి ఆయన నాణేల సేకరణలు చూసేటప్పటికి కళ్లు తిరిగి పోయాయి. ఆయన తన గురించి డబ్బాలు కొట్టలేదు, చాలా తక్కు వగా చెప్పుకున్నారనిపించింది. ఆయన ఇల్లే ఓ పురావస్తు ప్రదర్శన శాలగా అనుభూతి చెందింపజేసింది.

చిన్న బోషాణం వంటి పెద్ద పెట్టె, ఆ పెట్టెలో తెలుగువారి చరిత్రతో కలగలిపి భారతదేశ చరిత్ర ఆధునిక పద్ధతుల్లో భద్రపరచ బడింది. నాణేలు చూపెట్టే చరిత్ర ఆ పెట్టెలో పట్టి వుంది.

"ఇందులో ఇది శాలంకాయనుల అపురూపనాణెం. ఇది సిరిముకుని అంటే శ్రీముఖుని నాణెం. ఇది శాతవాహనుల నాణేలు. ఇవి చాలుక్యులవి, ఇవి కాకతీయులవి, ఇవి విష్ణు కుండినులవి, ఇలా చూడండి ఇది తెలుగక్షరాలున్న నాణెం. ఇది రాజరాజనరేంద్రుడు వేసిన బంగారు నాణెం. ఇవి ముస్లిమ్ పరిపాలకులు వేసినవి. ఇవి స్వాతంత్ర్యం వచ్చాక వేసుకున్న నాణేలు, ఇవి కమ్మెమొరేటివ్ కాయిన్స్ - అంటే స్మారక నాణేలు, అదిగో అవి బ్రిటిషు వారు వేసిన నాణేలు...", అంటూ మధ్యలో మనం వేసే ప్రశ్నల్ని పట్టించు కోకుండా...కాశీపట్నం చూడరబాబూ అన్న చందాన నాణేల చరితం చూడరబాబూ అన్నట్లు ఏకబిగిన తన నాణేల చారిత్రక పూర్వా పరాలను విప్పి చెప్పేవారు. అప్ప చెప్పేవారు.

దేనినైనా ఉద్యమంగా భావిస్తే పత్రికలు, రచనలు, ప్రచారం అన్నీ చాలా ముఖ్యం. కందుకూరి, గురజాడ, గిడుగుల సంస్కరణ, సాహిత్య భాషా భావజాలాన్ని ప్రజలకు దగ్గర చేయడంలో కమ్యూనిష్టు ఉద్యమాల పాత్ర మరచిపోగలమా?

కొమ్మదాటడం (శాఖాచంక్రమణం) అవుతోందేమో! రాజుగారి నాణేల సేవకు కొంత ప్రచారం అవసరమనిపించింది. తొట్ట తొలుతగా రాజమండ్రి పత్రికల్లో కాలనాళిక వంటి సమాచారం దినపత్రికలో 'అనగా అనగా ఒక రాజు కథ' అనే వ్యాసం రాశాను. తరువాత ఇలా ఇలా కొన్ని పత్రికల్లో పేరుతో, కలం పేర్లతో ఆయన సేకరణల గురించి, రాశాననే వాస్తవాన్ని దాచుకోలేకపోతున్నాను. చిత్రమైన అంశం ఏమిటంటే నాణేల రాజాగారి దగ్గర కేవలం నాణేలే కాకుండా నాణ్యావాఙ్మయ గ్రంథాలుండేవి.

ఒక్కొక్కప్పుడు నాణేలపై ఆయన ఆంగ్ల గ్రంథాలు కొనడం; నేను చదువుకొనడం జరిగేది. అమెరికన్ నాణేలపై ఇంతింతలావుపాటి గ్రంథాలు సైతం ఆయన కొని దాచేవారు.

నాణ్యశాస్త్రం. ఒక గొప్ప శాస్త్రం ఆ శాస్త్రంపై పట్టు సాధించాలంటే చరిత్ర, భూగోళం, భాష, లిపిజ్ఞానం, చిత్రకళ, లోహ శాస్త్రంవంటివాని పరిజ్ఞానఅధ్యయనం తప్పనిసరి. తెలుగుభాష ప్రాచీన తను గ్రహించడంలో నాణేలు, శాసనాలు పాత్ర మామూలుది కాదు.

రాజుగారి నాణేల సేకరణ దొడ్డది. ఒకే రకమైన నాణేలు





ఎన్నో ఉండడం గొప్పకాదు. ఎక్కువ రకాలవి వుండడం విశేషం. 2,500 రకాల నాణేలు ఆయన ఇల్లు అనే టంకశాలలో ఉండేవి.

ఆధునిక శాస్త్రీయ పద్ధతుల్లో నాణేల్ని ఆయన తన కళ్లని రక్షించుకున్నట్లు రక్షించడం వల్ల ఇవి జాతీయ సంపద, ప్రభుత్వ పరం చేయండి అని ఏ దొరతనపుపెద్దలూ ఆయన్ని ఒత్తిడి చేయలేదు.

నాణ్యశాస్త్రంలో ఆయన పట్ల నాకు గురుభావం కుదురుకుంది. కేవల సేకరణ కర్తగానే మీరుండి పోవడంతో తగిన గుర్తింపులు – మీరు కోరుకునేవి రావడం లేదు. పుస్తకాలు రాయండి. అని పోరగా పోరగా 'నాణేలు – తెలుగులిపి' – 'నాణేలు – దేవుళ్లూ' అనే రెండు పుస్తకాలు రాశారు.

చేతిచమురు వదల్చుకుని ఆ రెండు పుస్తకాలూ వేశాకా 'ఆసక్తి పరులు కొనుక్కునేలా పొత్తపుటమ్మకపు దుకాణాల్లో పెట్టుబడి' అంటే ఆసక్తిపరులకు చాలా మందికి ఉచితంగానే పంచిన – నాణ్యజ్ఞాని పంపిణీదారుడాయన.

ఆనాటి మల్లంపల్లి సోమశేఖరశర్మగారి నుండి ఈనాటి ఈమని శివనాగిరెడ్డిగారి వరకు సూర్యనారాయణరాజు గారి చరిత్ర సేవల్ని మౌఖికంగానో, తమ రచనల్లోనో శ్లాఘించినవారే.

రాజమండ్రిలో రాళ్ళబండి సుబ్బారావుగారిని పెద్ద పిచ్చివాడని, నాణేలరాజుగారిని చిన్న పిచ్చివాడని అనేవారట. (పిచ్చివాడంటే సంబంధిత జ్ఞానం ఎక్కువగా ఉండి ప్రచారం చేసేవాడన్నమాట) మారేమండ, రాయప్రోలు సుబ్రహ్మణ్యం, సరోజనీ రేగాని, పి.వి. పరబ్రహ్మశాస్త్రి, ఇంగువ కార్తికేయ శర్మ, దాశరథి (ఆం.సా.పరిషత్తు క్యూరేటరు, కాకినాడ), ఇటువంటి చరిత్ర శిఖరాలు రాజుగారి నాణేల సేకరణను చరిత్ర సేవలుగా ఎంతగానో మెచ్చుకున్నారు.

పిఠాపురం వాస్తవ్యులు బుద్ధాల వరహాల రాజుగారు ఆంధ్ర క్షత్రియ వంశరత్నాకరం అనే ఎంతో పెద్ద పొత్తం ఓ విజ్ఞాన సర్వస్వ సమానంగా రాశారు. అందులో రాజుగారి జీవితంపై, ఆయన నాణేలపైనే కాకుండా క్రీడాకారునిగా ఎంతపేరు సంపాదించినదీ వివరాలతో రాయడం ఒక తీపి గురుతుగా మిగిలిపోయింది.

రాజుగారిది వ్యాయామం బాగా చేసిన శరీరం. ఎన్నో ఆటల్లో పోటీల్లో గణనీయ బహుమతులు పొందారు.

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు తమ ఆంధ్ర పురాణ చారిత్రక కావ్యాన్ని నాణేల రాజుగారికి బహూకరిస్తూ **"క్రీడా రంగ ధనంజయుడు, పురావస్తు సంగ్రహణ తపస్వి"** అని పేర్కొంటూ సంతకం చేసి, నరసింహశర్మా! ఈ కాగితం క్రింద సాక్షి అని వ్రాసి సంతకం చెయ్యి అన్నారు. రాజుగారి క్రీడారంగ ప్రశస్తిని ఉగ్గడిస్తూ, పురావస్తు సంగ్రహణ 'తపస్వి' అని పేర్కొనడంలోని తలపు బలిమిని మనం గ్రహించాలి.

ఆంధ్రేతిహాస పరిశోధక మండలి (ఇండియన్ హిస్టారికల్ రీసెర్చి సొసైటీ) ఆంగ్లంలో చరిత్ర పత్రిక నడిపేది. ఆ పత్రికలోని వ్యాసాల్లో రాజాగారి సేకరణలు, ఆయన పురావస్తు శాలలకు ప్రదానం చేసినవి పేర్కొన బడేవి అంటే ఆయన సేవాస్థాయి ఎటు వంటిదో గ్రహించవచ్చు.

చరిత్రకారులతో ఆయనకు మంచి ఆత్మీయ ప్రోత్సాహక సంబంధాలుండేవి. గౌహతి వంటి ప్రాంతాల చారిత్రక సదస్సులందు ఆయన ప్రతినిధిగా పాల్గొన్న చిత్రాలు జె.ఎ.హెచ్.ఆర్.ఎస్. పత్రికల పాత సంచికల్లో ఉన్నాయి.

ఆయన నాణేల ప్రదర్శనలు పుంఖానుపుంఖాలుగా సాగాయి. ఉత్తర అమెరికాలోని డెట్రాయిట్ తెలుగు సభలో ఆయన నాణేల ఛాయాచిత్రాల ప్రదర్శన జరిగింది.

రాజమండ్రిలో సమాచారమ్ పత్రికా కార్యాలయంలో ఈనాడు సంపాదకుడు గౌరవనీయులు శ్రీ రామోజీరావుగారు రాజుగారి నాణ్య ప్రదర్శనను తిలకించారు. రాజుగారి వద్ద సందర్శకుల పుస్తకం తెరిస్తే నాయకులు, చరిత్రకారులు వివిధ రంగాల పెద్దలు ఆయనను ఎటువంటి సమున్నత స్థానంలో మెచ్చుకున్నారో తెలుస్తుంది. వావిలాల, ఎన్టీరామారావు, ఇలా ఎంతనుకుందో ఏ తేదీన ఏ సందర్భాన మెచ్చుకున్నారో అంతా రికార్డుగా వుండేది.

ఆరుద్ర 'మీ సేకరణ దొడ్డది. మీవల్ల చరిత్ర శ్రీమంతమైంది. చరిత్రను తిరగరాసుకునేందుకు పనికి వచ్చే నాణేలు ఎన్నో మీ సేకరణల్లో ఉన్నాయి' అని రాశారు. ఆయన వద్ద వారి వంశ చరిత్ర కొన్ని శతాబ్దాలది వుండేది. వంశవృక్షం రాసి వుండేది. పేరిచర్లవారు కొంతమంది శ్రీకృష్ణదేవరాయల కాలంలో తమిళ ప్రాంతానికి వలస వెళ్లారు. వారిలో చాలా మంది మంచి ధనికులై ఉన్నత స్థానాల్లో వెలిగారు. ఆ పేరిచర్లవారిలో కొందరు తాముండే తమిళ ప్రాంతానికి రాజుగారిని తీసుకువెళ్లి ఆయన చరిత్ర సేవల్ని గుర్తిస్తూ సన్మానించారు. తమిళభాషలో సన్మాన పత్రాన్ని ఇచ్చారు. తమిళంలో కూడా సన్మాన పత్రాన్ని పొందానని తమ వారిచే గౌరవించబడ్డానని ఎంతో పొంగిపోయేవారు.

రాజమహేంద్రవరంలో ఎన్నో సంస్థలు ఆయన నాణ్య ప్రదర్శనల్ని నిర్వహించాయి.

ఏదైనా రికార్డుగా దాచడం అనే పాతతరం మంచి అలవాటు ఆయనకుండేది.

పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం – రెండూ తప్పే

వైజ్ఞానిక పద్ధతిలో ఆయన నాణేలు దాచేవారు. దానికి పాశ్చాత్య గ్రంథాన్ని మార్గదర్శకంగా తీసుకునేవారు.

ఒక నాణెం కాలం, కొలత, లోహం, లిపి, బరువు, గుండ్రని నాణెమూ చతురస్రాకార నాణెమా ఇన్ని విశేషాలు ఆయన తన నాణేల కేటలాగులో భద్రపరిచేవారు. వారి దగ్గర వున్న నాణేల టైపు కేటలాగే కొన్ని పుటల పుస్తకంలా వుండేది.

ఆయన ఇంటి గడప నిండైన పసుపుతో ఉండడం కాదు; ఆ గడపదాటి ఈవలకు వచ్చే ఆడువారి పాదాలూ పసుపుతో సంస్కృతిని మెరిపించేవి. 1933 నవంబరు 11న పిఠాపురంలో లక్ష్మీనరసమాంబ, చంద్రరాజు దంపతులకు రాజు జన్మించారు.

భార్య కృష్ణవేణి. రాజుగారి నలుగురి సంతానంలో ఇద్దరు మగపిల్లలు; ఇద్దరు ఆడపిల్లలు. ఈ ఇద్దరిలో 'ఊహల పల్లకి' రాసిన కవయిత్రి శ్రీమతి వి.నాగమణి ఒకరు. ఆమె తన తండ్రికి తన పుస్తకాన్ని అంకితం చేసింది. అటవీశాఖ క్షేత్రాధికారిగా పనిచేసిన కాలంలో అధికారుల చేత, సహోద్యోగుల చేత మంచికి మారుపేరని పించుకుంటూ హాయిగా జీవించారు. ఎప్పుడో తణుకులో విద్యాభ్యాస కాలంలోని ఆటల పోటీల విజయ చిత్రాలు వంటివి వందల ఛాయా చిత్రాలు ఆయన జీవితకాలం భద్రపరుచుకున్నారు.

పంచప్రాణాలూ నాణేలుగా భావించి, నాణ్యశాస్త్రజ్ఞానాన్ని ప్రేమించి ఎనభై ఆరు ఏళ్ల వయస్సులో 2019 అక్టోబరు 6న, కాకినాడలో కాలధర్మం చెందారు. శరీరాన్నే కాదు, నాణేలనూ వదిలేసి రాజుగారు ఎక్కడికో వెళ్లిపోయారు.

నాణేల సేకరణలో ఆయన తపస్సు చేసి జీవితాన్ని పునీతం చేసుకున్నారు.

కాలధర్మమైనా, ఆప్తుణ్ణి పోగొట్టుకోవడంలో కళ్ళధర్మం చెమర్చడమే ఔతుంది కదా!

కవిత

నిరూపణ

బలమైన సర్పాలై భయపెడితే...
చలిచీమలమై చుట్టుముడతాం!
మొనదేలిన ముళ్ళ పొదలై గాయపరిస్తే...
అనల జ్వాలలమై దహించి వేస్తాం!
ఊడలు దిగిన వృక్షాలై విర్రవీగితే
ప్రచండ గాలులమై పెకలించి వేస్తాం!
ఉప్పొంగే సముద్రాలై ముంచేస్తే -
తెప్పలమై తేలి అద్దరికి చేరుతాం!
తక్కువ వాళ్లమని తేలిక పరిస్తే-
ఎక్కువేనని ఎదిగి మరీ చూపిస్తాం!
తొక్కిపెట్టి విలువనెంత తగ్గించినా-
ఎక్కుపెట్టిన బాణాలమై మింటికెగుస్తాం!
తరతరాల ఆధిక్యంతో తలబిరుసు చూపిస్తే...
నరనరాల శక్తి నింపుకుని ఉనికి చాటుతాం!
విస్తరించిన మంచు కొండలై నిలిస్తే...
అస్తమించని సూర్యులమై కరిగిస్తాం!
వర్గాధినేతలమని హుంకరిస్తే...
దుర్గ పునాదులనే కదిలిస్తాం!
ఎన్ని సంఘర్షణలకైనా ఓర్చి...
అన్ని జాతులొకటేనని నిరూపిస్తాం!

శ్రీమతి ఎస్. కాశింబి
9052216044

(14వ పుట తరువాయి)

అవసరాలకు కావాల్సిన భాషగా వెలుగొందిందన్నారు. ఉర్దూ భాష ఆ రోజుల్లో అధికార భాషగా, సామాన్యుడి భాషగా, ఉండింది. అప్పటి నిజాం ప్రభుత్వం ఉర్దూ భాష వ్యాప్తికి, అభివృద్ధికి, అనేకానేక కార్యక్రమాలు చేపట్టిందని, ఉర్దూ అమలుకు చేసిన ప్రయాసల వలన ఇటు అగ్రవర్గం వారు, అటు సామాన్యుడు ఉర్దూ భాషను అక్కున చేర్చుకున్నారని, స్వాతంత్ర్యం తరువాత కూడా ఇదే పంథా కొనసాగి, తెలుగు ఇక్కడివారికి ఒక అనవసరపు భాషగా పరిగణించబడిందని ఆయన పేర్కొన్నాడు. 1918 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నెలకొల్పినపుడు కూడా ఉర్దూ భాషకు పెద్దపీట వేశారు. వృత్తివిద్యా బోధనతో సహా, అన్ని స్నాతకోత్తర స్థాయి కోర్సులకు ఉర్దూ మాధ్యమం ప్రవేశపెట్టారు.

ఇది ఏ స్థాయిలో ఉందంటే, పాతబస్తీలో నివసించే ఎన్నో హిందూ కుటుంబాలు సైతం తెలుగును మరిచి ఉర్దూలోనే సంభాషణలు జరుపుతున్నాయి.

పర్యవసానంగా తెలుగంటే ఒక చిన్న చూపు మొదలయింది. తెలుగు మాట్లాడేవారిపట్ల చులకన భావన కూడా నేటికీ చాలా మందిలో కనిపించడానికి ఇదే కారణం.

అయితే అవసరం రావటం, వ్యాపారం మొదలు వివిధ రూపాల్లో తెలుగువారితో మసలటం వలన తెలుగు నేర్చుకోవటం ఇప్పుడొక నైపుణ్యంగా మారింది.

హాస్పిటళ్లలో, ప్రభుత్వ కచేరీల్లో, పోలీసు స్టేషన్ లాంటి ప్రదేశాల్లో తెలుగు అధికంగా వినియోగమవుతుంది. అక్కడ ఎలాంటి ఇబ్బందీ లేకుండా పనులు జరుగుతున్నాయని, తెలుగులో కాస్త మాట్లాడితే అంతకు ముందున్న సంభాషణాంతరం (Communication gap) ఇప్పుడు లేదని-తర్ఫీదు పూర్తి చేసుకున్న ఒక వ్యక్తి తెలిపారు.

సమద్ మాస్టారు రూపొందించిన 45 రోజుల తెలుగు సంభాషణా కోర్సు మరింత మంది ఉర్దూ మాతృభాషీయులకు మేలు చేకూరుస్తుందని ఆశిద్దాం.

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

స్మృతి

డా. పాపినేని శివశంకర్
8978012323

కవితాపయోనిధి దాశరథి



దాశరథి కృష్ణమాచార్య
కనువెలుగు : 2 జులై 1925
కనుమరుగు : 5 నవంబర్ 1987

'మనిషి మనసును గెలుచు మాట నారాధింతు
మాట లోపలి వజ్ర మర్యాద నెంతు'

ఒక సాహిత్య సభ. గుంటూరులో. నేను అధ్యక్షుడిని. సభ ప్రారంభంలో ఖమ్మం నుంచి వచ్చిన గొప్ప గాయని బేగం ఒక గేయం ఆలపించింది.

'ఆ చల్లని సముద్రగర్భం దాచిన బడబానలమెంతో
ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో'

గేయం చివర 'గాయపడిన కవి గుండెలలో రాయబడని కావ్యాలెన్నో' అనేటప్పటికి నా గుండె చిక్కబట్టినట్టయ్యింది. ఇది గదా కవిత్వం అంటే! ఇది గదా గాఢమైన భావం యొక్క సాంద్రమైన వ్యక్తీకరణ అంటే!

ప్రకృతిని ఊతంగా చేసుకొని మొదలు పెట్టి ప్రపంచ పరిణామాలెన్నో అభ్యుదయ దృక్పథంతో వ్యాఖ్యానించిన గేయం కదా అది. రాజుల కీర్తనలతోనే ప్రాచీన కావ్యాలు, చరిత్రలు నిండిపోయాయి. అది చూసి వెగటు పుట్టటం చేతనే సామ్రాజ్యపు దండయాత్రలో సామాన్యుల సాహసమెట్టిది? అని ప్రశ్నించాడు శ్రీశ్రీ. ఆ భావాన్ని మరింతగా చిక్కబరుస్తూ 'ఒక రాజును గెలిపించుటలో ఒరిగిన నర కంఠాలెన్నో' అన్నాడు దాశరథి. (ఒరిగిన నర దేహాలెన్నో అంటే బాగుండేదేమో. కంఠం ఒరగదు, దేహమే ఒరుగుతుంది.)

'ఆ నల్లని ఆకాశంలో కానరాని భానువులెందరో' అని తొలి పాఠం. మెరుగు పెట్టిన మలి పాఠంలో 'భాస్కరులెందరో' అయింది. ఇదే బాగుంది సరళంగా.

గుంటూరులో చదువుకొనే రోజుల్లో నవోదయలో దొరికిన పుస్తకం 'కవితా పుష్పకం'. భావస్ఫోరకమైన బాపు రేఖా చిత్రాలతో అలంకరింపబడిన కవితలు. ఆ బొమ్మలు చూసి గీస్తూ, ఆ కవితలు మననం చేసుకుంటూ గడిపిన రోజులు. మీరు చదివారో లేదో, అందులో 'స్నేహగీతి' ఒక్కసారి వినండి.

'తైలాలు లేకుండ వెలిగేటి దీపం
విద్యుత్తు లేకుండ వెలిసేటి దీపం
హృదయాలలో ఎపుడు నిలిచేటి దీపం
నిజమైన దీపం మా స్నేహ దీపం
మనసులో దీపం మలిపితే పాపం'

ఇలా చెపుతున్నపుడు దీపం అనేది కాంతికే గాక అంతః చైతన్యానికి సంకేతమని అర్థమవుతుంది. ఆ చెలిమి దివ్వెను ఎంత భద్రంగా కాపాడుకోవాలో అర్థమవుతుంది.

'మిత్రుడే కావాలి సుఖమున శోకాన
అతడు లేకున్నచో నగరమే కాన'

గేయానికే మకుటాయమానమైన వాక్యాలివి. స్నేహ పరిమళం గురించి ఇంత చిక్కగా రాసిన మరో గేయం-ఏదీ నాకిప్పటికి తగలేదు.

'కవితా పుష్పకం' లోని కవితల శీర్షికల్ని 'తలకట్లు' అన్నాడు కవి. పేజీలను 'పొరటలు' అన్నాడు. ఇదీ బాగుంది.

భారత చైనా యుద్ధం ముగిసింది. మన దేశం గెలిచిందా, ఓడిందా అనేది వేరే సంగతి. యుద్ధం అన్ని అందాల భీకర సందర్భం. అది మనుషుల్లో దాగి ఉన్న వీరత్వంతో-పాటు క్రూరత్వాన్ని కూడా నిద్ర లేపుతుంది. రక్తంలో సూర్యోదయం చూస్తుంది. నేల మీద ఎనభై నాలుగు లక్షల జీవరాశులలో మనుషులు మాత్రమే యుద్ధాలు చెయ్యగలరు. శతఘ్నులపై ప్రేమగీతాలు అల్లగలరు. ఆ యుద్ధ సందర్భంలో ఎంతో మంది ప్రసిద్ధ కవులు దేశభక్తితో ఆవేశం పొర్లిన కవితలు రాసిన సంగతి మనకు తెలుసు. అయితే యుద్ధానంతర దృశ్యాన్ని దాశరథి సంతోషంగా వర్ణించాడు, ఇదుగో ఇలా -

'సైనికుని శిరస్త్రాణంలో
సాలీడల్లిన గూడు
శుభం చెబుతున్నది
మరఫిరంగిలో

మందు దట్టించే చోట

పిచ్చుక పెంటి నీళ్ళాడింది' (అమావాస్య దీపాలు)

ఎక్కడా వాచ్యత లేకుండా ఎంతో వ్యంగ్యంగా శాంతి వెల్లివిరిసిన కాలాన్ని స్ఫురింపజేశాడు కవి.

ఒక జీవితకాలంలో ఒక మహాకవి ఎన్ని రచనలు చెయ్యగలడో అంత విస్తృతంగా రాశాడు దాశరథి. 1. అగ్నిధార (1949), 2. రుద్రవీణ (1950), 3. మహాబోధి (1953), 4. మహాంద్రోదయం (1955), 5. పునర్నవం (1956), 6. అమృతాభిషేకము (1959), 7. బాలల గేయాలు (1960) 8. కవితాపుష్పకం (1966), 9. తిమిరంతో సమరం (1973), 10. గాలిబ్ గీతాలు (1974), 11. ఆలోచనాలోచనాలు (1975), 12. అమృతవల్లి–తెలుగుతల్లి (1979), 13. ధ్వజమెత్తిన ప్రజ (1981), 14. జ్వాలా లేఖిని (1984), 15. అభినవ దాశరథీ శతకము (1985), 16. నేత్రపర్వం (1088), 17. యాత్రాస్మృతి. ఇవి గాక మరెన్నో రచనలు. ఆంగ్లంలోని 'మేజర్ పొయట్' అనే మాటని సార్థకం చేసే విస్తృతి ఇది.

అగ్నిధారలో :

'పోరాటంలో నుండి కళ పుడుతుందని నమ్ముతున్నాను. నా జీవితమే పోరాటం. ఎన్నో ప్రతీప శక్తులతో పోరాడాను. పోరాడుతున్నాను. పోరాడగలను. నేను ఆశావాదిని. దురాశావాదులు నిరాశ పడతారు. ఆశావాదికి నిరాశ లేదు. నమ్రతతో నా దారిన నేను పయనిస్తాను. నా గమ్యం ప్రపంచ శాంతి. నా ధ్యేయం ప్రజాస్వామ్య సామ్యవాదం.' – ఇది 'దాశరథి కవిత' కు ఆయనదే ముందుమాట.

పోరాటం, ఆశావాదం, నమ్రత, ప్రజాస్వామ్య సామ్యవాదం – ఇవి ఈ వాక్యాల్లో గుర్తించదగినవి. మనకు తెలుసు, తెలంగాణా విమోచన కోసం నైజాం నిరంకుశత్వానికి ఎదురొడ్డి నిలిచిన గుండె ధైర్యం దాశరథిది అని. తెలంగాణాలో ఆయన విన్పించినట్టుగా తీవ్ర స్థాయిలో ధిక్కార స్వరం విన్పించిన కవులు కూడా తక్కువే. 'ప్రజాకవి' అనే మాట మనం చాలా విస్తృతార్థంలో విశాల హృదయంతో వాడేస్తుంటాం. ఆ మాటకి అసలైన నిదర్శనంగా దాశరథిని చూప వచ్చు. ప్రజల పక్షాన నిలబడి, త్యాగం చేసి, జైళ్ళ పాలై, కవిత్వం తప్ప ఎన్నో కోల్పోయినవాడు గాక మరెవరు ప్రజాకవి అవుతారు? ఆయన తమ్ముడు దాశరథి రంగాచార్య అన్నట్టు దాశరథిని 'నిజాం జైల్లో పెట్టగలిగాడు. కానీ బంధించలేకపోయాడు.' జైలు సయితం అతని స్వేచ్ఛాగానానికి పల్లవి నిచ్చింది, ప్రాణధాతువులిచ్చింది కవిత్వమే గదా! పూల తావుల మధ్య కవిత్వం రాయటం చాలా సులువే. కాని ఊళ్లకు ఊళ్లు తగలబడుతూ, ఆస్తులు దోపిడులకు, స్త్రీలు అత్యాచారాలకు గురి అవుతున్న రజాకార్ల కాలంలో– 'అగ్నిధార' నడుమ కవితా శంఖం పూరించటం ఏ మాత్రం సులువు కాదు. భద్రం కాదు.

'నిప్పు పిండితే
వెలువడే నీళ్ళు
జైళ్లు పిండితే
జాలువారే కన్నీళ్లు'

అగ్ని జ్వాలల మధ్యే వందల గ్రామాలు తిరిగి తన మాటలతో, పాటలతో ప్రజల్ని చైతన్యపరిచాడు దాశరధి. 'దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడి' ఎదురు నిలిచి తెగింపుతో ఏమన్నాడు?

'దిగిపోవోయ్ తెగిపోవోయ్
తెగిపోవోయ్ దిగిపోవోయ్
ఇదే మాట ఇదే మాట
పదే పదే అనేస్తాను'

1947 ప్రాంతాన పదిహేడు మాసాల కఠిన కారాగారవాసం – యౌవనోద్రేకంలో ఉన్న దాశరథిని కవిగా ఇంకా పదునెక్కించిందే గాని మొక్కబోనివ్వలేదు, మొద్దుబార్చలేదు. నిజామాబాదు జైలు గోడలపై వట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి రక్తం చిలికింది. అటువంటి 'జైల్లో ఆయన పాడిన పాట ఏమిటి?'

'ఇది నిదాఘము; ఇందు సహింపరాని
వేడి యేద్పించుచున్నది; పాడువడిన
గోడలందున జైలులో పాడినాడ
వాడిపోనున్న పూమొగ్గ పైన పాట'

ఇట్లా తన గానాన్ని మండుటెండల్లో సైతం చిగిరింపజేశాడు.

ఏ కవి రైతుల గురించి రాసినా రైతుబిడ్డగా నాకెంతో పరవశం.

పంట పొలాలలోన తెలవారులు నిద్దుర కాచి, వేకువన్
ఇంటికి వచ్చి చల్ది మెతుకెంగిలి చేసియొ చేయకో పనుల్
వెంటబడంగ కాననము వీధుల బోయెడి కాపుబిడ్డ! నీ
వంటి స్వయంప్రపోషణ విభావము రాజుల కబ్బజాలునే!

(రైతు)

అన్నాడు దాశరథి.

రైతుది స్వయం ప్రపోషణ వైభవం. పరాన్న భుక్కులైన రాజులకు ఆ వైభవం లేదు. అందుకే 'హాలికా! వేనవేల దండాలు నీకు' అన్నాడు వినయంతో ఆ కవి. 'తెలంగాణము రైతుదే' అని నిర్ధారించాడు. అతని లోలోపలి అగ్నిధారకు ఛందస్సులు సర్ప పరిష్వంగాలు కాలేదు. కాలేదనటానికి ఈ పద్యం ఒకానొక ఉదాహరణ.

'కొండలు కొండలే అడవి కోనల భగ్గున మండిపోవ, నా
గుండెలు గుండెలే అరుణగోళములై ప్రళయాగ్నిమాలలై
మండుట చోద్యమా? మధుర మంజుల మామక లేఖినీ ముఖం
బెండకు మాడిపోయి రచియించును గ్రీష్మ మహాప్రబంధముల్'

(మహాలేఖిని).

ఇదీ అతని ధారాళమైన పద్యశైలి. ఆ శైలి గంభీర పదావళితో 'అంగుళికా నఖాంకుర మహాపరికంపిత తంత్రికాస్వరాలింగిత రుద్ర వీణ' పలికించగలదు. తేటతేట మాటల్లో 'వెన్నెల కాగడాలకు ద్రవించెడి చీకటికొండ పైన కూర్చున్న అనంత తారకల'నూ చూపించగలదు.

మార్క్సిస్టు ప్రభావం దాశరధిపై దట్టంగా ఉంది. అభ్యుదయ రచయితల సంఘంలో చేరిన దాశరథి 'రానున్నది యేది నిజం? అది ఒకటే సోషలిజం' అని గట్టిగా నమ్మాడు. ప్రజాస్వామ్య పంథాలో సోషలిజం సాధించవచ్చని భావించాడు. సాయుధ పోరాట పంథాకి

దూరంగా జరిగాడు. అహింసా తత్త్వం ఒంటబట్టకపోతే 'మహాబోధి' ఎలా రచించగలడు?

దయకు సాగరమ్ము, ధర్మమునకు గని
సత్యమునకు తావు, శాంతమునకు
పుట్టినిల్లు, సత్త్వమున కాలవాలమ్ము
జ్ఞానమునకు తాన కాణయాచి'

అనే పద్యం ఒకేసారి బుద్ధుని ఆత్మని, దాశరథి కవితాత్మని ప్రకటిస్తుంది. అదే సమయంలో అతని పద్యరచనా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంది. అనేక సద్గుణాలకు బుద్ధుడు 'నిలయం' అని చెప్పటానికి పునరుక్తి లేకుండా 'సాగరమ్ము, గని, పుట్టినిల్లు, రావు, ఆలవాలము, కాణాచి' అనే ఆరు మాటలు వాడాడు. అదే ఉత్తమ కవి కౌశలం.

తెలంగాణ బిడ్డగా :

'తెలంగాణాలో దేశాభిమాన ప్రబోధగీతము లాలపించిన కవికుమారులలో దాశరథిదే అగ్రస్థానము. ఇతడు తెలంగాణా సాహిత్యసీమలో క్రొత్త పుంతలు తొక్కి, క్రొత్త పొలాలు నిర్మించిన ఉత్తమ సాహిత్య కర్షకుడు. కడు ప్రతిభావంతుడు. ఇతని కవిత్వము లలిత పద చమత్కార సంపన్నమై చదివిన కొద్దీ చవులూరించు చుండును.'

ఇది 'మహేంద్రోదయం' సంపుటికి ముందుమాటలో సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖరశర్మ ప్రశంస.

'నను గని పెంచినట్టి కరుణామయి నా తెలగాణ' అని తన ఆత్మీయత ప్రకటించిన కవి. తన పురుటి గడ్డను కేవలం ఒక్క విశేషణంతో వర్ణించి తనివి చెందుతాడా? 'నా తెలంగాణ తల్లి కంజాత వల్లి' అన్నాడు. 'నా తెలంగాణ కోటి అందాల జాణః అన్నాడు. 'నా తెలంగాణ సౌందర్య సీమ' అన్నాడు. ఆ పైన 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అన్నాడు.

తెలంగాణ వైభవాన్ని, వారసత్వాన్ని తలకెత్తుకోవటంలో భాగంగానే 'యశోరాశి' వంటి సురవరం ప్రతాపరెడ్డి మొదలైన పెద్దల్ని నుతించాడు. 'అతడు లేని తెలంగాణ-అలంకరణ లేని జాణ.'

ముష్కరులు వికలం చేసిన ఓరుగల్లు కోటలోని శిల్పాలను చూసినప్పుడు 'తంఁడ్రి తాతల నాటి ధనము' కనుగొన్నాడు. 'తంత్రిపై వినరాని స్వరము' విన్నాడు.

'రాతి పూవుల పైన మమత
చేతమ్ములో నింపి కవిత.' –

తన సీమలో వర్ధిల్లిన నదుల్నీ, కొండల్నీ, గుట్టల్నీ, మట్టినీ అమితంగా ప్రేమించాడు దాశరథి. అవన్నీ అతనికి ప్రాణ వంతాలు ప్రాణ సమానాలు. అన్నిటిలో మంజీరను ఎంత అద్భుత పద విన్యాసంతో వర్ణించాడు!

'ఎవరి గజ్జెల రవళివే నీవు మంజీర!
ఎవరి కజ్జల బాష్పధారవే మంజీర!
నీవు పారిన దారిలో ఇక్షు దండాలు
నీవు జారిన జాడలో అమృతభాండాలు'

ప్రాస సహితమైన ఈ వర్ణనలో కవి భావనా శక్తి తాండవించింది. నదీ తరంగ నాదాన్ని గజ్జెల రవళిగా రూపకం చేసిన కవి వెనువెంటనే ఆ జలధారని కల బాష్పధారగా రూపిస్తున్నాడు. ఒకటి ఆనందం కలిగించేది. రెండోది విషాదం గుమ్మరించేది. అదీ అతని ఊహాశక్తి. ఖండగతిలో సాగిన ఈ చరణంలో ధ్వని సంపుటుల విరుపు (ఎవరిగ / జ్జెల రవళి / వే నీవు / మంజీర) అద్భుతంగా ఉంటుంది. గేయ రచనలో చెయ్యి తిరిగిన కవి మాత్రమే అట్లా కూర్చగలడు పదాలను.

'లోకంలో తల దాచుకోవటానికి చోటు లేని కాలం కవిత్వంలో తన కల్పలతా హస్తాలు చాచి నాకో ఇంత నీడ నిచ్చింది.' అన్న దాశరథిని-కవిత్వం ఒక మహావృక్షమై ఆదరించింది.

క్షోభతో, ఉద్వేగంతో 'జైల్లో, రైల్లో, తోటలో, బాటలో, కత్తుల్లో, మెత్తని పూ గుత్తుల్లో, అశలో, ఓటమిలో రాశాను' అన్నాడు దాశరథి.

'కవిత్వం అమృతం వంటిది.' 'అమృతానికి ఆమ్రేడితం కవిత్వం.' 'పునర్నవం' ముందు మాటలో దాశరథి రాసిన ఈ వాక్యాలు చదవగానే 'కాలం కాటేసినప్పుడు కవిత్వమే నా కమృత స్పర్శయ్యింది' అని నేను రాసిన వాక్యం గుర్తొచ్చింది. ఆ అమృతమే లేకుంటే ఎందరో కవులు ఏనాడో అంతర్ధానమై పోయేవాళ్లు.

'రోజూ కనబడే నక్షత్రాల్లోనే
రోజూ కనబడని కొత్తదనం చూచి
రోజూ పొందని ఆనందానుభూతి
పొందడం అంటేనే కవిత్వం' (పునర్నవం)

'పునర్నవం' లో 'నా పేరు ప్రజాకోటి' కవితలో తన అంతరంగం అచ్చంగా ఆవిష్కరించుకొన్నాడు దాశంథి.

'తెలంగాణలోని కోటి
ధీరుల గళధ్వనినె కాక
ఇలాగోళమందుండెడి
ఎల్లరి శబ్దాన్ని నేను
నా పేరు ప్రజా కోటి
నా పేరు ప్రజా వాటి'

అని ప్రకటించాడు. గతమే జీవితమనుకొని వర్తమానమే వద్దనుకొని వెనక్కి నడిచేవారిని వెక్కిరించే కోరిక లేదన్నాడు. అదే సమయంలో 'గతమంతా బూది కుప్ప' అని దానిపై తిరగబడండని అరిచే 'బిరుసు వారిని' నిందించనన్నాడు. మరి ఆయన చూపేమిటి?

'గతాన్ని కాదనలేను
వర్తమానం వద్దనబోను
భవిష్యత్తు వదులుకోను
కాలం నా కంఠమాల'

ఇక్కడ 'మంచి గతమున కొంచెమేనోయ్' అనే గురజాడ భావనకు కాస్త 'దిద్దుబాటు' చేశాడేమో అన్పిస్తుంది. ఇది సమన్వయ దృక్పథం. ఒకవైపు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడుతూనే వెనకటి తన జాతి సంస్కృతిని ఆర్ద్రంగా గుండెలకు హత్తుకొనే మనస్సు. ఈ దృక్పథం సినారె వంటి సహకవుల్లో కూడ ఉన్నదే. తర్వాత కాలంలో దిగంబర, విప్లవ కవుల చేత నిరసింపబడిందీ ఈ దృక్పథమే. అది

నా మట్టుకు నాకు సమ్మతమే.

'కత్తి పట్టి గెలిచినట్టి
ఘనుడగు వీరుండెవ్వడు?'

అన్న దాశరథి ప్రశ్నకు సమాధానం చెప్పటం అంత తేలికేమీ కాదు.

ఇక గజల్ ని తెలుగువారికి పరిచయం చెయ్యటంలో దాశరథి కృషి అపూర్వం. 'గాలిబ్ గీతాల' లోతు తెలిసి, మనకందించాడు ఆయన.

'ఏల కాళ్లు నొచ్చె బాలామణికి?
రాత్రి ఎవని స్వప్నసీమ కేగి వచ్చె?'

అనటంలో కొద్ది మాటల్లో ఎంత ఊహ దాగి ఉంది! మూల కవితో పాటు అనువాద కవి సామర్థ్యం అది. గాలిబ్ వి ప్రధానంగా ప్రణయ విరహాలు లేదా విరహ ప్రణయాలు. ప్రణయశీలం గల దాశరథి హృదయం గాలిబ్ హృదయాన్ని అలవోకగా అందుకొన్నది. అదే సమయంలో తాత్త్విక గాఢత గల గజల్లను కూడా లలితంగా మనకందించాడు దాశరథి. అందుకు తేటదనం, క్లుప్తత గల తేటగీతి, ఆటవెలది, ద్విపద వంటి సరళమైన ఛందస్సుల్ని తీసుకొన్నాడు. చూడండి.

'ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము
నరుడు నరుడౌట యెంతొ దుష్కరము సుమ్ము'

దీని మూలం చూసినప్పుడు గాని దాశరథి అనువాద పటిమ, క్లుప్తత తెలియరావు.

'బస్కె దుష్వార్ హై హర్ కాం కా ఆసాఁ హెనా
ఆద్మీకోభి మయస్సర్ నహీఁ ఇన్సాం నా'

గాలిబ్ గీతాల్లో తేలియాడేటప్పుడు వాటికి బాపు వేసిన బొమ్మలతో పాటు 'స్వీయ లోపమ్ములెరుగుట పెద్ద విద్య', 'మృతియె లేకున్న రుచి యేది బ్రతుకులోన' – ఇటువంటి వాక్యాలు కూడా మనల్ని వెన్నాడక మానవు.

చిత్రసీమలో :

1960లో 'వాగ్దానం' చిత్రంలోని

'నా కంటిపాపలో నిలిచిపోరా
నీ వెంట లోకాలు గెలువనీరా'

అనే లలిత ప్రణయభావనతో చిత్రరంగ ప్రవేశం చేశాడు దాశరథి. కంటిపాపలో నిలిచిపోవటం అంటే ఎల్లప్పుడూ ఎదటనే ఉండిపోవటం, ఆమెలో కలిసిపోవటం. ఆ భావాన్ని ఏ మాత్రం వాచ్యం చెయ్యకుండా ధ్వనింపజెయ్యటంలోనే కవి ప్రతిభ దాగి ఉంది. ఆయన రాసిన పాటల గురించి ఎవరిని కదిలించినా 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ' వంటి వాటిల్లో అన్యదేశ్యాల సొగసునో, 'ఏ దివిలో విరిసిన పారిజాతమో' లో ప్రణయభావననో, 'నడిరేయి ఏ జాములో' లోని ఆర భక్తిభావననో ఉటంకించటం పరిపాటి. నాకైతే 'పూలరంగడు' చిత్రంలోని విరహగీతం తెలుగు సినీ గీతాల్లోనే ఆణిముత్యం వంటిది.

'నీవు రావు నిదుర రాదు – నిలిచిపోయె ఈ రేయి ॥నీవు॥
తారా జాబిలి ఒకటై – సరసమాడె ఆ రేయి
చింతా చీకటి ఒకటై – చిన్నబోయె ఈ రేయి
ఆశలు మదిలో విరిసె – దోసిట విరులై కురిసె
ఆలయాన తేరి చూడ – స్వామి కానరాడాయె
కౌగిలిలో ఒదిగిపోయి – కలలు గనే వేళాయె
ఎదురు చూచి ఎదురు చూచి – కన్నుదోయి అలసిపోయె
॥నీవు॥'

వేచి చూసే ప్రియురాలికి నిదుర రాకపోవటమే గాక రేయి రేయంతా స్తంభించినట్టే తోస్తుంది. 'నిలిచిపోయె ఈ రేయి' అనటమే ఆ భావనకు అందమైన పరాకాష్ఠ. తార, జాబిలి ఒకటైన ఆ రాత్రికి, చింత, చీకటి ఒకటైన ఈ రాత్రికి ఎంత ఆలోచనాత్మకంగా భేదం చూపించాడు కవి!

పాటలో ఎక్కడా మెత్తమెత్తని పలుకులే తప్ప కఠిన శబ్దాలే లేవు. మహా ప్రాణాలు (ఒత్తు అక్షరాలు) అసలే లేవు. మృదు విషాదభావనలో కాఠిన్యానికి చోటుండదు గదా!

'మంచి మనసులు' సినిమాలో ఒక ప్రేమ గీతం వినండి.

'నన్ను వదలి నీవు పోలేవులే – అది నిజములే
పూవు లేని తావి నిలువలేదులే' (అతడు)
'తావి లేని పూవు విలువ లేనిదే – ఇది నిజములే
నేను లేని నీవు లేనే లేవులే' (ఆమె)

ఆమె పూవు. అతడు తావి. అవి విడదీయరానివి. ఒకటి లేనిదే మరొకటి లేకపోవటమే ఆ అన్యోన్యత. దానిని పూవు–తావి అనే ద్వంద్వం ద్వారా వ్యక్తీకరించటమే పాటలో సొగసు. ఇట్లా కవ్వించుకొన్న ప్రేయసీ ప్రియులు యుగళగీతం చివరికి 'నిన్ను వదలి నేను పోలేనులే / నీవు లేక నేను లేనే లేనులే' అనుకోవటం చక్కని ముగింపు. ఆద్యంతాల సమన్వయం గల, అపురూపమైన అల్లిక గల ఇటువంటి లలిత గీతాల నుంచి ఇప్పటి నేలబారు గీత రచయితలు ఓనమాలు నేర్చుకోవచ్చు.

ప్రేమభావనని ఎంత సున్నితంగా వ్యక్తం చెయ్యాలో అతని సినిమా పాటలు కూడా మనకి తెలియపరుస్తాయి.

'వినిపించని రాగాలే
కనిపించని అందాలే
అలలై మదినే కలచే
కలలో ఎవరో పిలిచే' (చదువుకున్న అమ్మాయిలు)


ప్రేమికుడి ఆప్యాయత తెలిసిన అమ్మాయి...

'అందెను నేడే అందని జాబిల్లి' (ఆత్మ గౌరవం) అనుకొంటుంది.

'ఒక పూలబాణం తగిలింది మదిలో
తొలి ప్రేమదీపం వెలిగిందిలే'

అని పాడుకొంటారు ప్రేమికులు. ఎక్కడా నువ్వు – నేను, ప్రేమ అనే మాటలే లేవు. అంతా ఆలోచనాత్మకమే. ఎంతైనా ఊహించుకోవచ్చు.

ఇక వీణ పాటలు రాస్తే దాశరథే రాయాలి అనిపిస్తాయి –



99 ఏళ్ల 'యోగా గురువు' తెలుగుమహిళ నానమ్మాళ్

నారీశక్తి పురస్కార గ్రహీత, 'యోగరత్న' 'పద్మశ్రీ' నీరుకొండ నానమ్మాళ్ 99వ ఏట - అక్టోబరు 24న తమిళ నాడులోని కోయంబత్తూరులో మరణించారు. ఈమె 'యోగ టీచర్'గా ప్రసిద్ధురాలు. 45 ఏళ్లుగా, ఇప్పటికీ పది లక్షల మందికి యోగాభ్యాసాన్ని నేర్పించారు. వారిలో ఆరు వందల మంది శిష్యులు ఇప్పుడు ప్రపంచం నలుమూలలా 'యోగా భ్యాసాన్ని' నేర్పుతున్నారు.

ఇంతకూ - అందరూ తెలుసుకోవలసిన మరొక విశేషం ఉంది. కోయం బత్తూరుకు చెందిన నానమ్మాళ్ అచ్చంగా తెలుగు మహిళ. ఇంటిపేరు 'నీరుకొండ'. కోయంబత్తూరులోని 'కమ్మ' సామాజిక వర్గానికి చెందిన భారతదేశంలోనే పేరుగాంచిన 99 ఏళ్ల తెలుగుబిడ్డ. అన్ని పత్రికలూ ఈమె గురించి ప్రకటించాయి. 'యు ట్యూబ్' లోనూ గూగుల్ సమాచారంలోనూ వివరాలు న్నాయి. అయితే ఆమె తెలుగువారన్న సంగతి ఎవ్వరూ పేర్కొన లేక పోయారు! అందుకే ఇంటి పేరునూ, కులాన్నీ తెలుపవలసి వచ్చింది.

మదిలో వీణలు మ్రోగె, మనసే అందాల బృందావనం, పాడెద నీ నామమే గోపాలా, నేనే రాధనోయీ మొదలైన పాటలు.

భక్తి గీతాల్లో మరుపు రానిది 'నడిరేయి ఏ జాములో / స్వామి నిను జేర దిగి వచ్చునో' (రంగుల రాట్నం). బహుశ కృష్ణశాస్త్రి తర్వాత ప్రకృతిని పాటల్లోకి మనోహరంగా మళ్లించినవాడు దాశరథి.

గ్రాంథిక భాషా సుందరమైన పద్యాలెన్నో అల్లాడు దాశరథి. మలిదశలో గేయాన్ని, వచన కవితను అందుకొన్నాడు. ఏ ప్రక్రియలో నైనా అదే స్వచ్ఛంద లక్షణం కనిపిస్తుంది. వచనకవిత్వంలో 'మస్తిష్కంలో లేబొరేటరీ' వంటి కవితల్లో విరివిగా ఆంగ్ల పదాలు గుప్పించాడు. భాషకు సంబంధించి 'మడి' లేని రచన దాశరథిది. ఃఒంటరిగా వింటర్ లో వెళ్లబోకు భాయీ!! అంటూ ఎంతో హాయిగా ఇతర భాషా పదాల్ని కవిత్వంలో కలగలిపాడు.

కవిత్వంలో ఏది చెప్పాలో దాన్ని చెప్పకపోవటంలోనే సొగ సంతా దాగి ఉంటుంది. అదే వ్యంగ్యం, ధ్వని. పైకి చెప్పనిదాన్ని అందంగా స్ఫురింపజెయ్యటంలోనే కవి శక్తి నిరూపితమవుతుంది. 'ఎవరి పాద చిహ్నాములివి?' అనే కవిత చదవండి. అవి ఎవరి పాద చిహ్నాలో ఎక్కడా కవి చెప్పడు. సూచిస్తాడంతే. 'కత్తికి కన్నీరు గూర్చు కరుణాకరుడెవ్వడు?', 'హిమాలయము కన్న నెత్తు, ఎవడా తండెవ్వడు? అనే ప్రశ్నలకి కవితలో ఎక్కడా సమాధానం దొరకదు. 'రాటంతో రణశూరుల ఈటెల నెదిరించె నతడు' అనగానే ఆ పాద చిహ్నాలు మహాత్మ గాంధీవని అర్థమవుతుంది. ఇటువంటి వ్యంగ్య వైభవమే ఉత్తమ కవిత్వానికి ఒక ప్రమాణం.

అవరోహణలో :

యౌవనంలో నిరంకుశ రాజరికానికి ఎదురొడ్డి పోరాడిన ఒక కవి-తర్వాత కాలంలో నిరంకుశ ప్రభువుల్ని కీర్తిస్తూ ఎందుకు పద్యాలు రాశాడు? తనలాగే జాతి విముక్తి కోసం పోరాడిన వందలమంది యువకుల్ని హతమార్చిన ప్రభువుకు 'ఆలోచనా లోచనాలు' ఎందుకు సమర్పించాడు? అది కేవలం మిత్రత్వమేనా? తన స్వభావంలో వచ్చిన మార్పా? ప్రజల వైపు ఉంటానంటూనే ప్రభువులవైపు ఎందుకు మొగ్గాడు? ఆస్థాన కవి పదవి కోసం ఎందుకు ఆరాటపడ్డాడు? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పటానికి - ఆ కవి మన ముందు లేడు. కనుక ఎవరి విమర్శలు వారికుంటాయి.

'ప్రజల వద్ద ప్రజల పాట, ప్రభువు వద్ద ప్రభువు పాట - అది నాలికా? తాటాకు చీలికా?' అని కె.వి.రమణారెడ్డి తీవ్రంగా అధిక్షేపించాడు (చూ: కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు). శ్రీశ్రీ కూడా ఈ విషయంలో తక్కువేం తినలేదు.

తొలి దశలో ఒక ఆశయానికి, సిద్ధాంతానికి కట్టుబడిన కవులు కాలక్రమాన జావగారిపోయిన దాఖలాలు సాహిత్య చరిత్రలో చాలా కనపడతాయి. అయితే ఆ కారణంతో వారి కృషిని మొత్తంగా తూల నాడటం సరైన పద్ధతి కాదు. అదట్లా ఉంచితే, మలి రచనల్లో దాశరథి వచన కవిత్వ పటుత్వం తగ్గిందనేది నిజం. వచనకవిత్వంలో కన్న పద్య, గేయ రచనలోనే దాశరథి పట్టు, నట్టు పడని నడక ఉంటాయి.

'నలిపివేతును, ఎంతకని వ్రాతు, కృత్రిమాల కుడ్యాలు' - ఇటువంటి చోట్ల దాశరథి కవితల్లో వ్యాకరణ భాషా దోషాలు కనబడి ఆయన ప్రౌఢకవి కాడన్న చిన్న అనుమానం కలిగిస్తాయి. ఎన్నో చోట్ల పద్యరచనలో విసంధిని పాటిస్తాడు కూడా. అయితే వ్యాకరణ ప్రౌఢిమ ఉన్నంత మాత్రాన కవిత్వం మనల్ని కరిగించగలదా? గుండెను కాక మెదడును తడితే సరిపోతుందా? దాశరథి మహా పండితుడు కాకపోవచ్చు. అంత మాత్రాన వారి కవిత్వానికి ముప్పు లేదు. ఎందరో కవి పండిత సామాన్యుల మెప్పు పొందిన రచనలవి. వాటిని వ్యాకరణంతో తూకం వెయ్యలేం.

పువ్వు వలె మృదువైన కవిత్వం రాశాడు. నిప్పురవ్వల వంటి కవితలనీ వెదజల్లాడు. కవోష్ణ కవిత్వమూ చెప్పాడు. అటు శృంగారం ఇటు అంగారం. ఈ రెండిటి చక్కని సమ్మేళనమే దాశరథి కవిత్వం. మహా భావుకకవి దాశరథి.

తిరగమోత

సడ్లపల్లె చిదంబరరెడ్డి
9440073636

కాలజ్ఞానం అందేదెన్నడు....??

కాలజ్ఞానం అంటే అదేదో పోతులూరి వీరబ్రహ్మం చెప్పిన ఎప్పుడో జరగబోయే ఊహాతీత సంఘటనల గురించికాదు. ఒక కాలంలో బతుకుతున్న..... బతకాల్సిన కొత్త తరానికి ఆ కాలం గురించిన ఆధునిక జ్ఞానం ఎంతవరకు అందుతున్నది?? అన్నదే నా సందేహం!!

ఒక ఉదాహరణ తీసుకొందాం. నేను డెబ్బయ్యవ దశకంలో కళాశాల విద్యార్థిని. తెలుగు నాకు ముఖ్యమైన విషయం అను కొంటే....సంబంధిత ఉపన్యాసకులు పాఠాలు చెబుతూ, వారు ఇష్టపడే పద జాలాన్ని, కవులను, గ్రంథాలను గురించే చెప్పే వారు. ఆ పుస్తకాలూ భావజాలం వారికెలా నచ్చాయి??? అంటే అంతకు ఇరవై యేళ్లకు ముందు వారు చదివే రోజుల్లో వారి గురువులు తాము మెచ్చిన, తాము ఆరాధించే వాటినే వీరికి బోధించి ఉంటారు. అప్పటి వారుకూడా తాము నివసిస్తూ అనుభవించే సమాజం గురించి ఏ మాత్రం స్పృహలేక వారి పూర్వ గురువులు బోధించిన దాన్నే అనుసరించి ఉంటారు.

ఈ అనుమానం నాకు ఎందుకు వచ్చిందంటే...డెబ్బయ్యవ దశకంలో నా కళాశాల చదువులో రామాయణము, మహా భారతము, ప్రబంధాలు, శతకాలు, వేదాలు, ఉపనిషత్తులు వాటి గొప్ప తనము ఆ మహాగ్రంథాలను రాసిన వారి గురించే గురువుల నుంచి విన్నాను కానీ......అప్పటి కాలంలో విరివిగా వస్తున్న కథానికలు, నవలలు, భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం వంటి పేర్లే విని ఉండలేదంటే నమ్మండి!! విరామ సమయంలో లైబ్రరీకి వెళితే, వారపత్రికల్లో ఏవో సీరియళ్ళు, కథలు, శ్రీ శ్రీ, సి.నారె, గుంటూరు శేషేంద్ర శర్మ వంటి పేర్లతో అచ్చయిన వాటిని అవి నాకెందుకూ పనికిరావన్న భావంతో దినపత్రికల్లోని వార్తల్లా మాత్రమే తిరగేసేవాడిని.

తెలుగుభాషా పదజాలానికి సంబంధించికూడా నేను రోజూ సమాజంలో వ్యవహరించే పదాలకూ, పుస్తకాలు చదివి గుర్తుపెట్టుకొని రాయాల్సిన పదాలకూ చాలా చాలా తేడా ఉండేది!! ఈ అంతరం ఎందుకుందో? ఉండాల్సిన అవసరం ఏమిటో కనీసం సూచాయగా అయినా చెప్పేవారు లేరు.

నేను మూడో తరగతి చదివే సమయంలో (1963) తంజావూరు, సామర్లకోట అనే పేర్లతో పాఠాలుండేవి. అవి కూడా నేనున్న సమాజంలో నిత్యజీవితంలో వ్యవహరించే పదజాలం కాకుండా మరో రకంగా ఉండేవి. సినిమాలు చూసినా, కథలు చదివినా రోజువారీ వ్యవహారాల పదాలు కాకుండా అసహజమైన భాషా వంగడాలు. నా చుట్టూ కనిపించే పాత్రలు కానీ, నా ప్రాంతపు జన సమూహ నివాసాల పేర్లు కానీ కనిపించక వినిపించక పోవడం పెద్ద వెలితిగా అనిపించేది.

ఈ వెలితిని పూడ్చుకోవటానికి నాకు మరో యాభై యేళ్లు పట్టింది. కారణం ఊపిరి సలపనీయని, మరో ఆలోచనకు తావివ్వని అనారోగ్యంతో సతమతం కావడమే!!

1994 ఆ ప్రాంతంలో కోగిర జై సీతారాం అనే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయున్ని కలిసిన సందర్భంలో అతను తాను నివసించే ప్రాంతపు పదజాలంతో పిల్లలకు రాసిన పాటలు, చేసిన కృషీ తెలుసుకొనడం జరిగింది.

అప్పటి నుంచి నా విద్యార్థులకు నేను నా గురువుల నుంచీ నేర్చుకొన్నది కాకుండా పిల్లల నిత్యవ్యవహారాల పదజాలము, అక్కడి జీవితాలవల్ల వచ్చే సమస్యలను గురించిన వాటితోనే బోధించడం మొదలు చేశాను. దానివల్ల పిల్లల్లో చాలా మార్పును గమనించాను.

కాలానుగుణ మైన మార్పును దృష్టిలో పెట్టుకొని పాఠశాల యాజమాన్యం తరచూ ఉపాధ్యాయులకు పునశ్చరణ తరగతుల్ని నిర్వహిస్తున్నదని మీరు అనవచ్చు. కానీ అవి శాస్త్ర, సాంకేతిక, గణిత వగైరా వాటిలోనే జరుగుతున్నదికానీ - 80 శాతానికి పైగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు, వారి పిల్లల భాషా పదజాలం గురించి కాదని ఉపాధ్యాయుడిగా నా అనుభవం.

అదే విధంగా మన ఆలోచనల్నీ, ఆధునిక మైన వ్యవహారిక భాషా యాసల్నీ(వేరు పోయాక తెలంగాణా ప్రజల సహజ ఉచ్చారణా రీతులు గమనించండి) మార్చుకొందామని ఎందుకు అనుకోకూడదు? శాస్త్రవేత్తలు ఆధునిక భాషకు ఇచ్చిన నిర్వచనం ఏమిటంటే "నిత్యం వ్యవహరించేదీ....రాసేదీ ఒకటే కావడం" అని. కాబట్టి ఈ ద్విపాత్రాభినయాల రెండు ఉచ్చారణల తెలుగునూ భావజాలాన్నీ కాకుండా, ఇప్పటికిప్పుడు వ్యవహారంలో ఉన్న అమ్మనుడుల్నీ, సహజత్వాన్నీ ఈ తరం పిల్లలకు అందిస్తూ, తాజాగా ఎదగడానికి బతకడానికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇది ప్రపంచంలోని అన్ని భాషలకూ వర్తిస్తుంది. (వ్యాసకర్త విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు. ప్రముఖ కథా రచయిత, కవి)

నవల

డి.పి. అనూరాధ
9010016555



(జరిగిన కథ)

ఆస్ట్రేలియాలో స్థిరపడాలని కోటి ఆశలతో విమానమెక్కుతాడు సూర్యవర్మ. ఓ అపరిచితుడితో పరిచయం అతడి గమ్యాన్ని మారుస్తుంది. కాలచక్రంలో వేల ఏళ్ల వెనక్కి వెళతాడు. ఓడల్లో సువర్ణభూమిని చేరుకుంటాడు. అనూహ్యంగా అలనాటి తెలుగు సంతతివారిని కలుసుకుంటాడు. ఆ తరవాత అతడి ప్రయాణం ఏ మలుపు తిరిగింది?

ఎప్పుడెప్పుడు కమావత్ గ్రామం వెళదామా అని ఉబలాట పడుతోన్న నాకు రావు వాలకం అర్థం కాలేదు. మౌల్మీన్లో వీధులన్నీ తిప్పుతున్నాడు.

'తెలుగు వీధి' అన్న అచ్చు తెలుగు అక్షరాలు ఉన్న బోర్డు వీధిలోకి కారుని తిప్పాడు. మళ్లీ ఎవరింటికో తీసుకువెళుతున్నాడు అని అర్థం అయింది నాకు. ఓ ఇంటి ముందు కారు ఆపాడు.

ఓ ముప్ఫై ఏళ్ల లోపు వయసున్న జంట నవ్వుతూ బయటకి వచ్చారు. ఆ వ్యక్తి నన్ను చూస్తూ నమస్కరిస్తూ..

'అన్నా, నా పేరు గణేష్. నా భార్య పుష్పవేణి ...'

నేనూ ప్రతి నమస్కారం చేశాను.

ఆమె మాడ్రన్ మహాలక్ష్మిలా ఉంది. తెల్లని షర్టు, స్కర్టూ వేసుకుంది. ఎన్నో బంగారు హారాలు, ఉంగరాలు ధరించింది. గణేష్ ది చామనఛాయ రంగు.

ఆమెది మాత్రం పసిమి తెలుపు. కొత్తగా పెళ్ళైన జంటలా ఉన్నారు.

'దుబాసీగా సహాయపడతారని గణేషన్నని వెంట తీసుకువెళ్లమని మా పెద్దాయన చెప్పాడు' రావు వివరించాడు.

రావు పక్కనే ముందు సీట్లో గణేష్ కూర్చున్నాడు. ఇంటి లోపలి నుంచి ఓ యువకుడు వచ్చి మాకు నమస్కారం చేశాడు. గణేష్ వాళ్ల తమ్ముడయ్యుంటాడని అనుకున్నా.

'మా అబ్బాయి శివకుమార్, ఇక్కడే ఎగుమతి వ్యాపారం చేస్తున్నాడు'.

గణేష్ మాటలు నన్ను ఎంతో ఆశ్చర్యానికి గురిచేశాయి.

వాళ్లకి పాతికేళ్ల కొడుకున్నాడంటే అసలు నమ్మశక్యంగా లేదు. అదే మాటని ఆయనతో అన్నా. తనూ, రావూ పెద్దగా నవ్వారు. రావు కారు స్టార్ట్ చేశాడు.

భార్యా కొడుకులకి చేయి ఊపుతూ వీడ్కోలు చెబుతున్నాడు గణేశ్.

మా కారు అదే 'తెలుగు వీధి' బోర్డు దాటుకొని మెయిన్ రోడ్డు మీదకి వచ్చేసింది.

'అన్నా, నేనూ వినాయక చవితి రోజు పుట్టానని గణేశ్ అని మా అమ్మ పేరుపెట్టింది. విచిత్రంగా మా అబ్బాయి కూడా ఆ రోజే పుట్టాడు. అందుకే వాడికి శివకుమార్ అని పేరు పెట్టా. మయన్మార్లో తెలుగువాళ్లకి ఎంతో ప్రసిద్ధి చెందిన ప్రాంతం ఈ నగరం. మా మౌల్మీన్ను 'మినీ ఆంధ్రా'గా పిలుస్తారు. తెలుగు వాళ్లు ఎక్కువగా ఉండేది మా వీధి. అందుకే ఈ ప్రాంతానికి తెలుగు పేర్లే స్థిరపడి పోయాయి. బర్మాలో ఇళ్లల్లో పనివాళ్ళు ఉండరు. అన్ని పనులూ మేమే చేసుకుంటాం. మాకు సైకిళ్లు, బండ్లు కూడా తక్కువ. ఊర్లకెళ్లినప్పుడు కార్లు, బస్సులు, పడవలు వాడతాం. ఈ దేశంలో ఎప్పుడూ వేడినీళ్లే తాగుతాం. అలాగే గ్రీన్ టీ ఎక్కువ. మరోలా చెప్పాలంటే నీళ్లలాగే గ్రీన్ టీ. ప్రతి ఇంట్లో ఫ్లాస్క్ ఉంటుంది. అందులో వేడి నీళ్లు, ఎండిన గ్రీన్ టీ ఆకులు వేసి పెడతారు. మామూలు నీళ్లకి బదులుగా ఆ టీనే తాగుతుంటాం. కాస్త వగరుగా ఉంటాయి కానీ ఆ నీళ్లు ఆరోగ్యానికి చాలా మంచిది. పాలు కలిపిన టీ చాలా తక్కువ. హోటళ్లలో కూడా మంచినీళ్లకి బదులుగా ఈ గ్రీన్ టీనే



పెడతారు ఉచితంగా. ఎన్ని కప్పులైనా తాగొచ్చు. అలాగే భోజన హోటళ్లలో అయితే.. ఈ గ్రీన్ టీతో పాటు ఉడికించిన పెసరపప్పును కూడా పెడతారు. జోరుగా ఉంటుంది. కాస్త ఉప్పు, మిరియాల పొడి కలుపుకుని తింటే భలే రుచి. ఎన్ని కప్పులైనా తినొచ్చు. దీనికి డబ్బు తీసుకోరు.

పప్పులు పండించడంలో బర్మా ముందుంది.' అంటూ గణేష్ తమ ఆరోగ్య రహస్యం వివరిస్తున్నాడు.

'ఈదేశం పద్ధతులు భలేగా ఉన్నాయి. మీరేం చేస్తుంటారు అన్నా ...'

'ప్రింటింగ్ ప్రెస్ పెట్టుకున్నా. తెలుగు క్యాలెండర్లు, మన వాళ్ల శుభలేఖలు అచ్చువేస్తుంటాను. ఇవి కాక కుటుంబ వ్యాపారాలున్నాయి' బదులిచ్చాడు.

'పరాయి గడ్డ మీద తెలుగు భాషను, మన సంస్కృతినీ బతికిస్తున్నారన్న మాట. మీరు చేస్తున్నది గొప్ప పని అన్నా..' మెచ్చుకోలుగా చెప్పా.

తను మొహమాటంగా నవ్వాడు.

కిటికీలోంచి బయటకి చూస్తే...

పచ్చని వరిపొలాలు.. దూరంగా కొండలు.. మా ప్రయాణం ఎంతో అహ్లాదకరంగా సాగుతోంది.

చిమ్మయి ఎప్పటిలానే పుస్తకంలో మునిగిపోయింది. ఏమిటో ఈ అమ్మాయి...

అన్నిటికీ వెంట వస్తా అంటుంది. కానీ వేరే ఏదీ మాట్లాడదు. ఏ విషయాన్నీ పట్టించుకోదు.

ఇంతలో 'కమావెత్' గ్రామం రానే వచ్చింది. పచ్చని చెట్లతో కళకళలాడుతోంది. అప్పారావుగారి కోడలు ఊరు ఇదే. వాళ్ల నాన్న పేరు నైపాన్ అంగ్. కొంత మంది ఆడపిల్లలు సైకిళ్లపై స్కూళ్లకు వెళుతున్నారు. ఈ గ్రామమంలో అంతా మన్ వారే నివసిస్తున్నారట. అన్నీ కలపతో నిర్మించిన ఇళ్ళు. చిన్న చిన్న దుకాణాలున్నాయి. బర్మాలో మగవారందరూ చొక్కాలు, లుంగీలు ధరిస్తారు.

ఎక్కువగా తెల్ల చొక్కాలు ఉంటాయి. ఆడవాళ్లేమో చొక్కాతో పాటు పరికిణి ధరిస్తున్నారు. పరికిణి అనడం కంటే ఒకలాంటి లుంగీ అంటే సరిపోతుందేమో.

పశుపక్ష్యాదులకు కొదవలేదు. మేకలూ కోళ్లూ గేదెలూ కన్పిస్తున్నాయి అక్కడక్కడా.

మేము నై పాన్ అంగ్ గారింటికి వెళ్ళాం. నేల మీద నుంచి పది అడుగుల ఎత్తు మీద ఇళ్లు నిర్మించుకున్నారు. కిందంతా పశువులు, మగ్గాలు, ధాన్యం నిలువ ఉంచుకోవడానికి వేరువేరుగా వసతి ఏర్పాటు చేసుకున్నారు. మెట్లెక్కి ఇంట్లోకి వెళితే ముందుగా వసారా.. ఓ పొడవాటి హాలు, ఓ మూల దేవుడి గూడు, వెనుక వంట గది. అక్కడి నుంచి మెట్లు దిగి కిందకి వెళ్లొచ్చు. కొబ్బరి, అరటి, దానిమ్మ తదితర చెట్లతో చక్కటి తోట. గణేషన్న కలివిడిగా ఇల్లంతా మాకు చూపిస్తున్నాడు.

నైపాన్ అంగ్ గారు తెల్ల చొక్కా, ఎర్ర లుంగీ కట్టుకుని సోఫాలో కూర్చుని ఉన్నారు.

ఎనభై ఏళ్ల వయసుంటుంది. ఆయన మన్ నేషనల్ పార్టీ ఉపాధ్యక్షుడిగా చేసి పదవీ విరమణ చేశారట. ఆయన భార్య, కొడుకూ కోడలూ మనవళ్లూ అందరూ కలిసే ఉంటున్నారు ఆ ఇంట్లో.

గణేష్ బర్మీస్ లో నా గురించి, నేను వచ్చిన పని గురించి చెప్పారు. ఇండియా నుంచి వచ్చానని తెలియజేశారు.

ఆయన కాసేపు దీర్ఘంగా ఆలోచించి.. 'మేం చైనా నుంచి వలస వచ్చామని భావిస్తాం. బ్రిటీష్ వాళ్లు మా చరిత్ర గురించి ఏదేదో రాశారు. కానీ మాలో కొంత మందిమి దానిని నమ్ముతాం. కొంత మందిమి నమ్మం.' కాస్త కటువుగా అన్పించింది ఆయన స్వరం.

నా ముఖం నిరాశతో పాలిపోయింది. గణేష్ ఇదంతా గమనించినట్టున్నాడు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంటూ ఆయనకి వివరిస్తున్నాడు. వాళ్లిద్దరూ కాసేపు ఏదో చర్చించుకున్నారు.

నేను, చిమ్మయి ఒకరి ముఖం ఒకరం చూసుకుంటున్నాం.

ఆ పెద్దాయన అల్మారా దగ్గరికి వెళ్లారు. దాన్నిండా పుస్తకాలు.. ఓ పుస్తకం తీసుకుని వచ్చారు. మా ముందు కూర్చుని పేజీలు చూస్తున్నారు. ఓ పేజీ దగ్గర ఆగారు.

కాసేపటికి ఏదో చదవడం మొదలుపెట్టారు.

'ఓ కూన్ సమయ్యా తిలంగాణ దేసటోన్ మొన్ సమొన్ కొ సా ఉన్ చకమున్ దౌం తరౌం దెహ్ పొబ్బ త్వై వాగెదోం టోం తరింపర్వా న్వా సువణ్ణ మించెలా సుద్ధ పలతరె య్ కొ చొకలొం రూం కూన్'.

నాకు అందులో తిలంగాణ తప్పిస్తే ఏదీ అర్థం కాలేదు. కానీ ఏదో దొరికింది అన్న ఆశతో గణేషన్న వంక చూశా.

'సూర్యా.. ఈయన చదివి విన్పించింది 'మోన్యా తఛ్'. అంటే మన్ జోల పాట. ఈ పాటను తెలుగులోకి అనువదించి చెప్పాలంటే..

'ఓ కొడుకా మన నేల తెలంగాణ, మన రాజుకు అదృష్టం బాగాలేక యుద్ధంలో ఓడిపోతే పడవల్లో ఎర్రరాళ్లున్న ఈ సువర్ణభూమికి

వచ్చాం..”

అది వినగానే ఎంతో సంతోషంగా అన్పించింది. ఆనాడు ఒక్కలప్పు కాలంలో ఉయ్యాలలో పిల్లల్ని జోకొడుతూ ఓ తల్లి ఈ పాటని ఆలపిస్తుంటే విన్నాను. 1500 వందల ఏళ్లయినా ఇంకా ఆ పాట సజీవంగా ఉంది. మట్టిలో కలిసిపోలేదు.

గణేషన్న ఆయనతో ఏదో మాట్లాడుతూ ఉన్నారు.

‘ఈ పాట ఎవరు.. ఏ కాలంలో రాశారు అన్నది వీరికి తెలియదు. ఆ తెలంగాణ ఎక్కడుందో కూడా వీరికి తెలియదట. ఆ దశలో పరిశోధించలేదని పాన్ అంగ్ గారు చెబుతున్నారు. బర్మీస్ భాషలో రాసిన మన్ శాసనాలకు సంబంధించిన పుస్తకం అట ఇది' విపులీకరించాడు.

నేను ఎంతో సంతోషంతో .. ‘ఆ తెలంగాణ మరెక్కడో లేదు. ఇండియాలోనే ఉంది. ఇటీవలే మరో రాష్ట్రంలా ఏర్పడింది. మేం కూడా తెలంగాణ వాళ్లమే..

మరో ప్రత్యక్ష ఆధారం కూడా ఉంది. చక్రవర్తి వరారో అసలు పేరు మగాడు. పూర్తి తెలుగు పేరది. తెలంగాణ, మగాడు ఈ రెండు పదాల ఆధారంగా ఒకప్పుడు మనమంతా ఒకటే ” సంతోషంతో గట్టిగా అరచినంత పనిచేశాను.

గణేషన్న నా మాటల్ని అనువదిస్తూ ఆయనకి చెబుతున్నారు.

పాన్ అంగ్ గారి ముఖంలో కూడా ఆశ్చర్యం, ఆనందం కన్పించింది. కాసేపు నన్ను అలాగే చూస్తూ ఉండిపోయారు. దగ్గరగా వచ్చి హత్తుకున్నారు. మా ఇద్దరి కళ్లలో ఏదో తెలియని సంతోషం.. నా కళ్లలో అయితే ఆనంద భాష్పాలు జలజలా రాలిపోతున్నాయి.

గణేషన్న మా ఇద్దరి చేతులూ పట్టుకుని మమ్మల్ని కూర్చోపెట్టి కాస్త నెమ్మదిచేశాడు.

నిజానికి ఆయన పరిస్థితి కూడా అలాగే ఉంది.

‘బర్మాలో మీ పూర్తి కథ ను తెలుసుకోవాలని ఉంది’ అంటూ ఆంగ్ గారిని కోరాను.

ఆయన కాస్త కుదుట పడి... ‘బర్మీస్ కంటే భిన్నమైన జాతి మాది. మా మన్ అక్షరాలు దక్షిణ భారతావనికి చెందిన పల్లవ లిపి నుంచి ఏర్పడ్డాయి. దక్షిణ బర్మాలో తొలి వలస రాజ్యాలు స్థాపించింది మేమే. 5వ శతాబ్ది నుంచి 11 వ శతాబ్ది వరకూ ఓ వెలుగు వెలిగిన జాతి మాది. బౌద్ధాన్ని ఈ నేలకు తీసుకువచ్చింది, వ్యవసాయం, నేత పనినీ ఈ నేలకు పరిచయం చేసిందీ మేమే.

తర్వాతి కాలంలో బర్మీస్ రాజుల చేతుల్లో ఓడిపోవడం వల్ల అణచివేతకు గురయ్యాం.’ అదంతా ఒకప్పటి ఘన చరిత్ర.

ఇంకా కొనసాగిస్తూ... ‘బర్మా రాజులు మా కట్టడాలను, కోటలను ధ్వంసం చేశారు. మా చరిత్రను ఆధారాలు లేకుండా రూపు మాపారు. లక్షలాది మా జనాభా ఊచకోతకు గురైంది. బ్రిటిష్ కాలంలోనూ మాకు న్యాయం జరగలేదు.

మిలిటరీ పాలనలో మరింత అన్యాయానికి గురయ్యాం. ప్రత్యేక దేశం కోసం సాయుధ పోరాటం చేసి అలసిపోయాం.



మిమ్మల్ని కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది’ అంటూ అభినందించారు.

చిమ్మయి మా ముగ్గురిని వింతవింతగా చూస్తోంది.

వందల ఏళ్ల తరవాత కలుసుకున్న అన్నదమ్ముల్లా ఉంది మా పరిస్థితి.

‘మన తెలుగు నేల నుంచి వేల ఏళ్ల నాడు జరిగిన వలసల గురించి లోతుగా అధ్యయనం చేయాలి. మన్ జాతీయులకు.. తెలంగాణకు ఉన్న సంబంధాన్ని శాస్త్రబద్ధంగా పరిశోధించాలి. ఏదైనా ఓ కొడుకా మన నేల తెలంగాణ.. జోల పాట మన బంధానికి చెక్కు చెదరని రుజువు. మా ప్రభుత్వం తరపున మీకు ఆహ్వానాలు పంపిస్తాం. మన తల్లి నేల తెలంగాణకు మీరు తప్పకుండా రావాలి.....’ అంటూ ఆయన్ని కోరాను.

ఆయనా ‘తప్పకుండా’ అంటూ చేయికలిపారు. ఆయన కుటుంబం అంతా వచ్చి నన్ను పలకరించారు. విడలేక వీడలేక ఆ ప్రదేశాన్ని వీడాం. రోడ్డు దాకా వచ్చి ఆ పెద్దాయన సాగనంపారు. మళ్లీ కలుసుకుంటామో లేదో అన్న ఆరాటం ఆయన కళ్లలో కన్పించింది.

భారమైన గుండెతో తిరుగు ప్రయాణం అయ్యాం. అందరిలోనూ స్తబ్దతే. వెళ్లేప్పుడు ఉన్నంత ఉత్సాహం లేదు. మౌల్మీన్లో రామాలయం వీధికే వచ్చాం గణేషన్నని ఇంట్లో దిగబెట్టడానికి.

వాళ్లింటి దగ్గర చాలా హడావుడిగా ఉంది. పిల్లలు.. పెద్దలు చాలా మందే గుమికూడారు. విషయం ఏమిటో అర్థం కాలేదు.

ముసిముసి నవ్వులు చిందిస్తూ గణేషన్న కారు దిగాడు. ఆయనకి వీడ్కోలు చెప్పేందుకు నేనూ దిగాను.

‘మిమ్మల్ని కలుసుకోవడం వల్ల ఎంతో ఉపయోగం కలిగిందన్నా..మీరు మాతో రాకుంటే తెలంగాణ జోల పాట గురించి తెలిసేది కాదు. మన జాతంతా మీకు రుణపడి ఉంటాం' అంటూ చేయి కలిపాను. తను అంతే ఆత్మీయతతో గట్టిగా హత్తుకున్నాడు.

రెండు అడుగులు వేసి ముందుకు వెళ్లామో లేదో అందరూ మా చుట్టుముట్టారు. గణేషన్న కొడుకొచ్చి నా మెళ్లో పూమాల వేశాడు. యువకులందరూ చేరి నన్ను పైకెత్తేశారు.



'సూర్య అన్నకు జై.. సూర్య అన్నకు జై.. ' అంటున్నారు. నాకేమీ అర్థం కావడం లేదు.

ఇంతలో పుష్ప వదినమ్మ వచ్చి.. 'నువ్వు దేశం నుంచి వచ్చావని మనోళ్లందరికీ చెప్పాను. నిన్ను చూడ్డానికే వీళ్లందరూ వచ్చారు. రా బాబూ ఇక్కడ కూర్చో..' అంటూ అరుగు మీద కూర్చోబెట్టింది.

పెద్దవాళ్లు నా పక్కనొచ్చి కూర్చున్నారు. పిల్లలు నా ముందర కూర్చున్నారు. యువకులు అలాగే నిలుచున్నారు. రావు, చిమ్మయి కూడా వాళ్లతో పాటే ఉన్నారు. అందరూ నన్ను ఓ సెలబ్రెటీనో, హీరోనో చూసినట్టుగా చూస్తున్నారు.

వాళ్ల ఆప్యాయతని నా గుండె తట్టుకోలేకపోతోంది.

నా పక్కన కూర్చున్న ఓ వృద్ధుడు ..." నాయనా నా పేరు అప్పలసామి. నాకిప్పుడు 88 ఏళ్లు. నేనిప్పటి వరకూ దేశం గురించి విన్నదే కానీ అక్కడి వాళ్లని చూసింది లేదు. ఈ మౌల్మీన్లో రెండు వేల తెలుగు కుటుంబాలున్నాయి. ఎవరో ఒకరిద్దరే వెళ్లారుగానీ మిగతా వారు అక్కడికి వెళ్లింది లేదు. మా తాత ముత్తాతల్లో చాలా మంది బ్రిటీష్ సమయంలో ఇక్కడికి వలస వచ్చారు. అప్పుడు ప్రధానంగా రెండు దారుల్లో వచ్చేవారట. ఓ దారి సముద్రం. మరో దారి నేల. నౌకల్లోనే ఎక్కువ మంది వచ్చేవారు. కాబట్టి నదీ, సముద్ర తీరాల్లో మన తెలుగు వాళ్లు ఎక్కువగా ఉన్నారు. నౌకలో ఇక్కడికి రావడానికి ఆనాడు ఏడు రోజులు పట్టేదట.

ఏడు రూపాయలు టికెట్ ధర. మాలో ఎక్కువ మందిమి విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి వచ్చినవాళ్లమే. నేల దారుల్లో ఇక్కడికి ఎలా వచ్చేవాళ్లో మా పెదనాన్న ఓసారి చెప్పాడు. విశాఖపట్టణం, కలకత్తా, గ్యాటి, అస్సాం, ఇంఫాల్, మోరె నగరాల మీదుగా బర్మా సరిహద్దులోని మోంగ్వా గ్రామానికి వచ్చేవారట. ఎలా వచ్చినా కూడా తమ తమ అనుకూలతలను బట్టి దక్షిణ బర్మా అంతా మనోళ్లు కుదురుకున్నారు. ఒకప్పటి బర్మా రాజధాని యాంగాన్లో మన తెలుగు వాళ్ల సంఖ్య ఎక్కువే. అక్కడ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భారతీయ సంతతి వాళ్లు కూడా ఎక్కువే.

పంజాబీయులు, గుజరాతీయులు, బెంగాలీయులు, తమిళులు ఇలా అందరమూ ఉన్నాం. మీ దేశం నుంచి వచ్చే సినిమాలన్నా, హిందీ టీవీ సీరియల్లన్నా మా ఆడపిల్లలకు భలే ఇష్టం. ఆ సీరియల్ల సీడీ వ్యాపారం భలేగా సాగింది నిన్న మొన్నటి వరకు. ఈ దేశంలో చైనీయుల సంఖ్య కూడా ఎక్కువే. చాలా వ్యాపారాల్లో వాళ్లు కన్పిస్తారు. భారతీయులం, బర్మీయులం, చైనీయులం .. ఏ జాతి వారి పండుగైనా అందరమూ జరుపుకోవడం ఇక్కడ ఆచారం. ఏ పెద్ద పండగైనా మొదటి రోజున ఇంటిల్లిపాదీ చేసుకుంటారు, రెండో రోజున బంధువులను ఇంటికి పిలుచుకుని జరుపుకుంటారు, మూడో రోజు ఇరుగుపొరుగు వారు, స్నేహితులు, ఇతర జాతీయులను, బౌద్ధగురువులనూ పిలిచి విందు ఏర్పాటుచేస్తారు. అందరమూ సామరస్యంగా ఉంటాం. వసుధైక కుటుంబం భావనకు నిలువుటద్దం ఈ దేశం. 1964 మిలిటరీ పాలన ఏర్పడినప్పుడు మనోళ్లు చాలా మంది దేశం వెళ్లిపోయారు. కొద్ది మందిమే ఇక్కడ మిగిలాం. ఇంకెంత కాలం ఇలా మన తెలుగు జాతి ముచ్చట్లు చెప్పుకుంటూ ఉంటామో. మీరు, మీ నాయకులు, కళాకారులు అప్పుడప్పుడు ఇక్కడికి రండి మనోళ్లను పలుకరిస్తూ ఉండండి. ఇక్కడి వాళ్లనీ అక్కడి సంబరాలకు ఆహ్వానించండి.. నీ తాతయ్యలా అడుగుతున్నాను... భవిష్యత్తులో ఈ కార్యానికి శ్రీకారం చుడతానని మాటివ్వు...' ఉద్వేగంగా ఆయన చేయి ముందుకు చాచారు.

'తప్పకుండా తాతా..' చేయి కలిపాను. అందరూ గట్టిగా చప్పట్లు కొట్టారు.

నేనెవరో తెలియదు, నా పేరు.. ఊరు తెలియదు, నా భాష తెలియదు ... అయినా నన్ను చూడ్డానికి వచ్చారు. తమ వాడినని అనుకున్నారు. తెలుగు బంధుత్వంతో పలుకరించి మురిసి పోతున్నారు. నాక్కూడా వాళ్లని చూస్తుంటే ఏదో తెలియని బంధం ఏర్పడింది. అందరి దగ్గరా సెలవు తీసుకుని బయల్దేరాం. అప్పుడు గుర్తుకు వచ్చింది మ్యూజియంలో మగాడు విగ్రహాన్ని చూడాలని.

'రావు.. మన్ మ్యూజియం తీసుకువెళ్లు..'

'అన్నా నాకు గుర్తుంది, నువ్వు చెప్పకపోయినా నేను అక్కడికే తీసుకువెళ్లేవాడిని' అంటూ చిన్నగా నవ్వాడు.

మన్ మ్యూజియానికి వెళ్లాం. పురాతన భవనంలో మ్యూజియం ఏర్పాటు చేశారు.

అలసటగా ఉందేమో రావు కారు పార్క్ చేసి, అక్కడే ఉండి పోయాడు.

నేనూ, చిమ్మయి లోపలికి వెళ్లాం. అలనాడు మన్ జాతివారు ఉపయోగించిన పాత్రలు, ఆయుధాలు, సంగీత వాద్యాలు, గ్రంథాలు... ఇలా ఎన్నిటినో అక్కడ భద్రపరచారు. గది మూలలో నిలువెత్తు 'మగాడి' విగ్రహం ఉంది. కింద 'కింగ్ వరేరో' క్రీ.శ.13 వ శతాబ్దం అని పేర్కొన్నారు.

నేను ఎంతో అభిమానంతో 'మగాడు' శిల్పం దగ్గరికి వెళ్లాను. ఆరడుగుల ఎత్తు, వత్తైన కనుబొమ్మలు, తీక్షణమైన చూపులు, గుబురు మీసాలు... రాతి శిల్పమైనా జీవకళ ఉట్టిపడుతోంది.

ఇదే రూపురేఖలున్న వ్యక్తిని ఎక్కడో చూశాను.. ఎక్కడా



అనుకుంటూ గుర్తు చేసుకుంటూ ఆ కళ్లలోకి చూస్తున్నా.. గుర్తొచ్చింది నాగార్జునకొండలో...

ఆస్ట్రేలియాలో సెటిల్ అవుతున్నా అని ఫ్రెండ్స్ కంతా నాగార్జున సాగర్లో పార్టీ ఇచ్చా.

అక్కడి పురాతత్వ ప్రదేశాలన్నీ తిరిగాం. అనుపులోని 'రంగభూమి' దగ్గర ఓ చెట్టు కింద కూర్చుని పచ్చబొట్టు వేస్తున్నాడొక వ్యక్తి. సుమారు 60 ఏళ్ల వయసుంటుంది.. కోయదొరలా ఉన్నాడు.

"మేం వెళ్లిపోతుంటే.. పచ్చబొట్టు వేసుకో దొరా" అంటూ పిలిచాడు.

మాకిష్టం లేదన్నా వినలేదు. మరీ మరీ పిలచాడు. అందరూ వద్దన్నారు. నేను కాదనలేక పోయాను. ఆయన ముందు కూర్చున్నాను.

'అసలు నొప్పితెలియకుండా వేస్తాను, ఏం వెయ్యమంటావు' అని అడిగాడు.

"నీ ఇష్టం" అనాలోచితంగా చెప్పా.

ఎడమ చేతి జెబ్బ మీద హంస గుర్తు పొడిచాడు.

"అంబ పలుకు... జగదంబ పలుకు.. శ్రీశైల మల్లన్న పలుకు.. తెలుగమ్మ పలుకు... దేశదేశాలు తిరుగుతావు... నీ ఇంటికీ, ఊరికీ, నీ జాతికీ పేరు తెస్తావ్.. చల్లగా బతుకు.." అంటూ దీవించాడు.

పర్సులోంచి డబ్బు తీసి లెక్కపెట్టకుండానే ఆయన ముందుపెట్టా.

అతడినే చూస్తూ లేచాను...

అక్కడి నుంచి అందరం బయల్దేరాం. కానీ నా చెవులలో అతడి మాటలే.

అందరమూ కారెక్కాం. ప్రయాణమయ్యాం. సాగర్లో బోటింగ్ కోసం టికెట్టు కొనడానికి డబ్బు కోసం పాకెట్లో చేయిపెట్టా. పర్సు కన్పించలేదు. కారులో వెతికా లేదు. కోయదొరకు డబ్బులిచ్చి అక్కడే మర్చిపోయినట్టు ఉన్నాను. కారులో వెనుదిరిగాం. అనుపు దగ్గర కొచ్చాం. అతడున్న చెట్టు కింద ఎవరూ లేరు. కానీ పర్సు మాత్రం అక్కడే ఉంది. ఆశ్చర్యమేసింది. అక్కడి టూరిస్టులను అడిగాం. ఇక్కడ కోయదొర ఎక్కడికెళ్లాడని. తెలియదనే సమాధానం చెప్పారు. ఆ పరిసరాలన్నీ గాలించాం కానీ అతడు కన్పించలేదు.

ఆ కోయదొరను పోలినట్టుగా ఉంది 'మగాడు' శిల్పం. అంటే మగాడు నాకోసం ఆ రూపంలో వచ్చి పచ్చబొట్టు వేసి ఈ శక్తినంతా ఇచ్చాడన్నమాట.

అలనాటి హంసావతి రాజ్యానికి గుర్తుగా హంస గుర్తే వేశాడు. మన్ జాతీయ పార్టీ జండాలో కూడా హంసే. అందుకే కాలాతీతంగా నా ప్రయాణాలు జరుగుతున్నాయి. ఈ తెలుగుజాతి వేర్లను స్పృశించే ప్రయాణం మయన్మార్తోనే ఆగిపోతుందా.. మరింత ముందుకు సాగుతుందా" ఇలా పరిపరివిధాల ఆలోచిస్తూ నా ఎడమ భుజంపై ఉన్న పచ్చబొట్టును తడిమాను.. ఒక్కసారిగా భూమంతా కదిలినట్టు ఏవో ప్రకంపనలు...

(తరువాయి వచ్చే సంచికలో...)

"తల్లీ నిన్ను తలంచి" ఆవిష్కరణ



19.10.2019 వ తేదీన హైదరాబాదులోని రవీంద్ర భారతి, సమావేశ మందిరంలో ఎమ్.వి.ఆర్.ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డా॥కె.వి.రమణాచారి, ఐఏఎస్ (రి) ప్రముఖ రచయిత్రి డా॥ సి.భవానీదేవి రచన "తల్లీ నిన్ను తలంచి" ఆవిష్కరించారు. శ్రీ సుధామ, పద్మ భూషణ్ పురస్కార గ్రహీత డా॥ కె.ఐ. వరప్రసాద్‌రెడ్డిగారు, డా॥ వోలేటి పార్వతీశం, శ్రీ మట్టిగుంట వెంకటరమణ పాల్గొన్నారు.

వారసత్వ సంపద

-సంకేపల్లి నాగేంద్రశర్మ
80748 26371.

రామప్ప గుడులకు ఈసారైనా యునెస్కో హెరిటేజ్ గుర్తింపు దక్కేనా?


స్థానికుల అభిప్రాయాన్ని సేకరిస్తున్న యునెస్కో ప్రతినిధి వాసుపోష్యానందన

తెలంగాణా రాష్ట్రంలోని ప్రఖ్యాతి గాంచిన రామప్ప గుడులకు ఈ సారైనా యునెస్కో వారి ప్రపంచ వారసత్వ సంపద కట్టడాల జాబితాలో గుర్తింపుకు నోచుకోనున్నదా అన్న విషయమై సందేహాలు అవసరం లేదు. ఇందుకు సంబంధించిన నేపథ్యపు పనిని విజయవంతంగా పూర్తి చేసినట్లు, ఇక నిర్ణయం యునెస్కో వారు నిర్ణయం తీసుకోవడమే ముందున్న బృహత్కార్యమని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ పురావస్తు శాఖధికారులు, కేంద్ర సర్వేక్షణా అధికారిక కార్యాలయం, హైదరాబాద్ శాఖ అధికారులు అంటున్నారు. వీరు గుర్తింపు వస్తుందన్న సరైన ధీమాలో ఉన్నారు.

2017 వ సంవత్సరంలో రామప్పకు రావాల్సిన గుర్తింపు ఆఖరి క్షణంలో ఆగిపోయింది. సరైన వివరాలు లేవంటూ, యునెస్కో కమేటీ వారు నివేదికను త్రిప్పి పంపడంతో, యునెస్కో కన్సల్ టెంట్, రచయిత్రి, ప్రముఖ నాట్యకారిణియైన చూడామణీ నందగోపాల్ ఇక్కడి దేవాలయ నృత్య శిల్పాలపై పరిశోధించి, నివేదికను రూపొందించారు. క్రీ.శ. 1250లో గణపతి దేవ చక్రవర్తి బావమరిది జాయప సేనాని ఇక్కడి గుడుల శిల్పరీతులను పరిశీలించి, నృత్యరత్నావళీ అనే గ్రంధాన్ని రాశారు. అలాగే ప్రముఖ నాట్యాచార్యుడు పద్మశ్రీ నటరాజ రామకృష్ణ గారు, ఇక్కడి శిల్పాలను అధ్యయనం చేసి, పేరిణి శివతాండవం, లాస్య నర్తనం అనే రెండు నృత్య ప్రక్రియలకు జీవం పోశారు. 2017 వ సంవత్సరంలో రామప్ప గుడుల శిల్పాలకు వారసత్వ గుర్తింపు రావడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలను తెలంగాణా ప్రభుత్వం చేసింది. అప్పటి రాష్ట్ర టూరిజం, పురావస్తు శాఖల మంత్రి అజ్మీరా చందూలాల్ గారు ప్రత్యేక శ్రద్ధాసక్తులను తీసుకొన్నారు. న్యూఢిల్లీ వరకు వెళ్ళి కేంద్ర పురావస్తుశాఖ మంత్రిని కలిసి విన్నవించుకున్నారు. యునెస్కో హెరిటేజ్ గుర్తింపు పొందిన కట్టడాలు ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఏ ఒక్కటి ఇంత వరకు నోచుకోక పోవడం గమనార్హం. పెద్ద లోపంగా ఇక్కడి పురావస్తు నిపుణులు భావిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడులోని హంపి, హలిబేడు, తంజావూర్ వంటి పలు దేవాలయాలు యునెస్కో గుర్తింపుకు నోచుకున్నాయి. మొన్నటికి మొన్న మన ప్రధానమంత్రి మోడి గారు యునెస్కో గుర్తింపు పొందిన పల్లవుల కట్టడాలైన మహబలిపురం దేవాలయాల్లోని మండపాలను, శిల్పాలను, పాండవుల రథాలను చూస్తూ, చైనా అధ్యక్షుడు జీపింగ్ తో రెండు రోజుల పాటు సమావేశమైన విషయం మీడియాలో పతాక శీర్షికలతో ప్రచారం జరిగిందే.

రామప్ప గుడులని, ఇక్కడి శిల్ప కళా వైభవాలను యునెస్కో ప్రతినిధుల బృందం వారు సెప్టంబర్ 25, 26 తేదీలలో రెండు రోజులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల బృందాలతో అధికారికంగా పర్యటించి వెళ్ళారు. కట్టు దిట్టమైన బందోబస్తు ఏర్పాట్ల మధ్య ప్రతినిధుల బృందం రెండు రోజుల రామప్ప గుడుల పర్యటన, పరిశీలన ముగిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాకతీయ శిల్పకళావైభవం అంతా ఇంతా కాదు. రామప్పతో పాటు, హన్మకొండ, వేయి స్తంభాల గుడి, ఓరుగల్లు కోట వంటి హెరిటేజ్ కట్టడాలున్నాయి. జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో బాగంగా, ములుగు నూతన జిల్లాలోకి రామప్ప గుడులు చేరి పోయాయి. ప్రస్తుతం వెంకటాపురం మండలం పాలంపేట గ్రామంలో రామప్ప గుడులు వున్నాయి. రామప్ప గుడుల శిల్పకళా వైభవాలతోపాటు, మరో పద్దెనిమిది గుళ్ళను రామప్ప గుడుల పరిధిలోకి తెచ్చారు. ప్రఖ్యాతి గాంచిన రామప్ప సరస్సు కూడా ఇందులో చేర్చారు. సరైన నిర్వహణ లేక పోవడం వల్ల, క్రమేపీ ఈ గుడులు, దీని ఉపాలయాలు శిథిల దశకు చేరుకున్నాయి. కాటేశ్వర, కామేశ్వర ఆలయాలు సైతం శిథిల దశలోనే ఉన్నాయి. ప్రఖ్యాతి పొందిన రామప్ప నందికి ఇంతవరకు రూప్ వంటి రక్షణ, సరైన అదరణ లేకుండా పోయింది. అయినప్పటికినీ ప్రఖ్యాతి గాంచిన కాకతీయ శిల్పాలు ఎనిమిది వందల ఏళ్ళు గడిచినా నాజూకుతనం పోకుండా ఆకర్షిస్తుండటం అందరినీ అబ్బురపరుస్తోంది. నల్ల రాతితో చెక్కిన రామప్ప శిల్పాలు అద్దం వంటి నునుపుతో మెరుస్తు వుండటం దీని ప్రత్యేకతలని చెప్పవచ్చును. తెలంగాణా ఉద్యమ సమయంలో దేవాదుల సొరంగ నిర్మాణాదుల కొరకు జరిగే బ్లాస్టింగ్‌లు, పేలుళ్ళ నుండి రక్షించడానికి 2011 లో తెలంగాణా మేధావులు, ఉద్యమకారులు, చరిత్రకారులు ఆచార్య జయధీర్ తిరుమలరావు, అమ్మనుడి సంపాదకులు డా.సామల రమేష్ బాబు, డా.ఈమని శివనాగిరెడ్డి, డా.చుక్కా రామయ్య , విమలక్క, సంకేపల్లి నాగేంద్రశర్మ, ఆచార్య సూరపనేని సుజాత తదితరుల సారధ్యంలో ఒక ఏడాదిన్నర పాటు ఉద్యమించి, విజయ సంకేతంగా పదివేల దివ్వెల జాతరా జరుపుకొని విజయం సాధించారు. జూన్ 17, 2012 న రామప్పలో దివ్వెల జాతరా జరిగింది. 2013 లో రెండు సార్లు 800 సంవత్సరాల రామప్ప గుడుల స్థాపనోత్సవం జరిగింది.

యునెస్కో హెరిటేజ్ ప్రతినిధి థాయిలాండ్ దేశానికి చెందిన వాసు పోశ్యానంద, ఆర్కియాలోజి సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన

ఉన్నతాధికారులు జాన్విజ్ శర్మ, ప్రవీణ్ కె మిశ్రా, తెలంగాణా ఎఎస్ ఐ అధికారులు మిలన్ కుమార్ చావ్లా, తెలంగాణా పురావస్తు శాఖ డైరక్టర్ దినకర్ బాబు, నారాయణ, మాధవి, నాగరాజు, రంగాచార్య, వరంగల్ కాకతీయ హెరిటేజ్ ట్రస్టుకు చెందిన రథ సారథులు నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, రిటైర్డ్ ఐ ఎ ఎస్ అధికారి బి.వి.పాపారావు, రామప్ప గుడుల శిల్ప భంగిమలపై గత ఏడాది పరిశోధించి పుస్తకం రాసిన నృత్యనిపుణురాలు చూడామణీ నందగోపాల్ తదితరులు ఉన్నారు. తొలుత రామప్ప గుడులను సందర్శించినపుడు ములుగు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ సంగ్రాం సింగ్ పాటిల్ –హెరిటేజ్ పరిశీలక బృందానికి ఘనస్వాగతం పలికారు. రామప్ప గుడులను సుందరంగా అలంకరించారు. పాలంపేట గ్రామాన్ని పారిశుద్ధ్యతతో తీర్చిదిద్దారు. తగిన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

మొదటి రోజు వచ్చిన బృందం అయిదు గంటలు పరిశీలించి వెళ్ళింది. తదుపరి వరంగల్ లోని వేయి స్తంభాల గుడిని, ఓరుగల్లు కోటను సందర్శించింది. గతంలో హైదరాబాద్ లోని చార్మినార్, గోల్కొండ, కుతుబ్ షాహి టూంబ్ లకు దక్కని హెరిటేజ్ హోదా ఈ సారైనా రామప్ప గుడులకు దక్కాలన్న గంపెడాశతో కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖాధికారులు వున్నారు, ఈ సారి ఇండియా నుండి, ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి ఒకే ఒక్క కట్టడం ఎంపికజేశారు. అది రామప్ప గుడుల చారిత్రిక కట్టడం యునెస్కో వారి హెరిటేజ్ పరిశీలనకు ఎంపికైంది. ఇందువల్లే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తదేక దృష్టి పెట్టి, ఆతృతతో ఎదురు చూస్తున్నాయి. హెరిటేజ్ ప్రతినిధి వాసుపోశ్యానంద సైతం సంతృప్తితో వెళ్ళారని, రామప్ప శిల్పాలను, ఇక్కడి ఇతర గుడులను చూసి, సంతోషపడ్డారని,రామప్పకి హెరిటేజ్ హోదా దక్కుతుందన్న ఆశాభావంతో వెళ్ళారని పురావస్తు అధికారి ఒకరు ఈ వ్యాసకర్తతో మాట్లాడుతూ అన్నారు.

రామప్ప గుడులపై రూపొందించిన సమగ్ర డోసియర్ నివేదికను యునెస్కో పరిశీలక అధికారి వాసు పోశ్యానందకి కాకతీయ హెరిటేజ్ ట్రస్టు కార్యదర్శి ప్రొఫెసర్ పాండురంగారావు, పాపారావులు అందజేశారు. చూడామణి నందగోపాల్, పాండురంగారావుగార్లు సంయుక్తంగా కలిపి ఈ డోసియర్ నివేదికను ఒక ఏడాది పాటు శ్రమించి రూపొందించారు. ఈ డోసియర్ ఆధారంగా రామప్ప గుడులపై ప్రచురించిన ఆంగ్ల పుస్తకాన్ని యునెస్కో అధికారి ఆవిష్కరించారు. రామప్ప గుడిలోని మదనికలు, ఇతర నాగినీ, ఆదివాసీ నృత్య శిల్పాల పై సాంకేతిక వివరాలతో ఒక నివేదికను డోసియర్ లో చేర్చారు. రామప్ప గుడులు యునెస్కో హెరిటేజ్ గుర్తింపును పొందేందుకు కావాల్సిన సాంకేతిక సమాచారంతో పాటు, తగిన వీడియోలు, ఫోటో ఆల్బంలను పురావస్తు శాఖాధికారులు ముందస్తు ప్రణాళికతో రూపొందించి అందజేశారు.

కాకతీయ చక్రవర్తి గణపతి దేవుని హయాంలో సామంతుడు, సేనానియైన రేచర్ల రుద్రదేవుడు రామప్ప దేవాలయాన్ని నిర్మించారు. క్రీ.శ. 1171 సంవత్సరంలో మొదలైన పనులు నాలుగు దశాబ్దాల పాటు కొనసాగి, క్రీస్తు శకం 1213 లో పూర్తయ్యాయి. ఇది శివాలయమైనప్పటికిని రామప్పని శిల్పిగా పేర్కొంటూ, అదే పేరుతో పిలుస్తున్నారన్న వాదనలు ఉన్నాయి. రామప్ప గుడి ముందు రేచర్ల రుద్రుడు వేయించిన ఒక శాసనం ఉంది. దీన్ని పాలంపేటలోని రామలింగేశ్వరాలయంగా నామకరణం వుంది.కాని భిన్నంగా రామప్ప గుడులని పిలుస్తుంటారు. భారతీయ సర్వేక్షణా సంస్థ ఆధీనంలో ఉంది. ప్రస్తుతం రామప్ప గుడి వద్ద పడిపోయిన ప్రహరి గోడలను నిర్మిస్తున్నారు. కొంత మేరకు మరమ్మత్తులు చేబట్టారు. గుడి ఉరుపులను పూడ్చారు. చీమల పుట్టలను తొలగించారు. పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేబట్టాలంటే, ఒక 150 కోట్ల ప్రత్యేక గ్రాంటును మంజూరీ చేయాల్సి వుంటుందని చరిత్రకారులు విజ్ఞప్తి చేస్తున్నారు. రామప్ప గుడులకు అమర్చిన ఇటుకలు నీటిలో తేలియాడుతాయి. ఇక్కడి శిల్పాలు సప్త స్వరాలు పలుకుతాయి. ప్రత్యేకమైన తడి ఇసుక పునాదులు గల సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, రామప్ప గుడులను, ఇక్కడి శిల్పాలను వాస్తు కారులు తీర్చిదిద్దారు. నైజాం ప్రభుత్వ హయాంలో ఈ గుడులు అనగా, క్రీ.శ. 1914 లో వెలుగు చూచాయి. తదుపరి కొద్దిపాటి మరమ్మత్తులతో కొన్నాళ్ళకు ప్రజల సందర్శనార్థం తెరిచారు.

ఒక నెల లేదా కొద్ది సమయంలో తాను పరిశీలించిన రామప్ప గుడులపై ఒక నివేదికను యునెస్కో పరిశీలక కమేటీకి యునెస్కో ప్రతినిధి వాసు పోశ్యానందన అందజేయనున్నారని అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. అ తర్వాత సుమారు ఒక సంవత్సరంలోగా, చైనా లోని పూజౌ నగరంలో నిర్వహించనున్న సమావేశం కానున్న యునెస్కో ప్రతినిధులు, ఉన్నతాధికారుల సమావేశంలో ఈ విషయమై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిసింది. రామప్ప పరిసరాల్లోని అనుబంధ దేవాలయాలను కూలంకషంగా పరిశీలించారు. రామప్ప గుడుల అభివృద్ధి విషయమై పాలంపేట గ్రామస్తులతో సమావేశమై చర్చించారు. రామప్ప గైడ్ లు విజయ్, వెంకటేశ్ లిద్దరు తెలుగులో అనువాదం చేసి, గ్రామస్తులకు వివరించారు. ఇక్కడ అదనంగా స్థల సేకరణకు ఏవైన అభ్యంతరాలున్నాయన్న కోణంలో యునెస్కో ప్రతినిధి గ్రామస్తులను ప్రశ్నించారు.

రామప్పగుడులు అయిదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఆవరణ 25 ఎకరాలు ఉంటుంది. మరింతగా అదనంగా నలభై ఎకరాలు సేకరించాలని గతంలోనే ప్రతిపాదనలు ఉన్నాయి. స్థానికుల నుండి సంతృప్తికరమైన సమాధానం రావడంతో ఆయన అనుకూల ధోరణిని కనబరిచారు. రామప్ప చెరువు కట్టపై నడుస్తూ, రిజర్వాయర్ లో బోటింగ్ చేశారు. కట్టపై ఉన్న గుడులను పరిశీలించారు. ఇక్కడ హరిత హోటల్ గతంలోనే టూరిస్టుల కోసం టూరిజం శాఖ వారు ఏర్పాటు చేశారు. ఇంతవరకు భారత్ లో 38 వరకు కట్టడాలు యునెస్కో జాబితాలో ఉన్నాయి. ఏది ఏమైనా ఈ సారైనా రామప్ప గుడులకు, ఇక్కడి శిల్పాలకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు రావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన నేపథ్యపు పనిని అభినందించక తప్పదు. రామప్ప గుడులను వాసు పోశ్యానంద సందర్శించినపుడు మీడియా వారిని దూరంగా ఉంచారు.

ఎలాంటి ఫోటోలు కాని, వీడియోలు కాని తియ్యనివ్వలేదు. ఆయన ఎవ్వరికీ ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు ఇవ్వలేదు. రామప్ప గుడులను వాసు పోశ్యానంద రాక ముందు, ఆగస్టు 11 న న్యూఢిల్లిలోని ఆర్కియాలజీ సంయుక్త సంచాలకులు డా.నంబి రాజన్ తన బృందంతో పరిశీలించి వెళ్ళారు.

ఆచార్య కస్తూరి విశ్వనాథం
9480770557

ప్రాచీన తెలుగు అధ్యయన సంస్థ

ఎట్టకేలకు ప్రాచీన తెలుగు భాషాధ్యయన సంస్థ విషయంలో కొంత స్పష్టత యేర్పడింది. కొంత పురోగతి కూడ కనిపిస్తున్నది. గౌరవనీయులు వెంకయ్యానాయుడుగారు కేంద్రభారతీయ భాష సంస్థ యొక్క స్వర్ణోత్సవాలను జులై 13వ తేదీన మైసూరులో ప్రారంభించారు. అదే సమయంలో అప్పుడప్పుడే యేర్పడి నిలదొక్కుకొంటున్న తెలుగు అధ్యయన కేంద్రాన్ని కూడ లాంఛనంగా ప్రారంభించారు. అంతకు ముందే సంస్థ సంచాలకుడు, ముగ్గురు సీనియరు పరిశోధకులు, నలుగురు జూనియరు పరిశోధకులు నియమింపబడినారు. అంతకుముందే సంస్థ కార్యక్రమాలను నిర్దేశించి నడపటానికి అవసరమైన ప్రాచీన భాషాభివృద్ధి మండలి (క్లాసికల్ లాంగ్వేజ్ ప్రమోషన్ బోర్డు) కూడా నియమింపబడింది.

వెంకయ్యానాయుడుగారు తిరిగి వెళ్లిన దగ్గరలోనే సంస్థను నెల్లూరులో నెలకొల్పటానికి నిర్ణయించబడిందని ఉత్తరువు వచ్చింది. కేంద్ర విద్యాశాఖ నుంచి. నెల్లూరులో దీనికి అవసరమైన వసతి భవనాలు అక్కడికి దగ్గరలో (20కిలోమీటర్ల దూరాలో) ఉన్న వెంకటాచలంలో ఉన్న స్వర్ణభారత ట్రస్టు ఆవరణలో సమకూర్చాలని కూడ నిర్ణయింపబడింది. దీనికి సంబంధించిన మైసూరులోని అధికారులు, భారతీయ భాషా సంస్థ సంచాలకుడు, కేంద్ర విద్యాశాఖ అధికారులు అక్కడికి పోయి అన్ని పరిశీలించి వచ్చారు కూడ. కనుక వీలైనంత త్వరలో ప్రాచీన తెలుగు కేంద్రం అక్కడికి మారే సూచనలు కనిపిస్తున్నాయి. బోర్డు సమావేశం జరిపి ఈ సంవత్సరానికి కార్యక్రమాలను నిర్ణయించి పండితులకు అప్పగించటం కూడ జరిగి పోయింది.

సాధక బాధకాలు

ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం కేంద్ర ప్రభుత్వ సంస్థ అంటే, కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్వహింపబడవలసిన సంస్థ. దీనికి ప్రత్యేకమైన బడ్జెటు ఉన్నా కూడా కార్యక్రమాలు అవి అన్ని కేంద్ర ప్రభుత్వ అధీనంలోనే జరగాలి. కనుక ఇప్పటికే అన్ని సౌకర్యాలతో ఉన్న కేంద్రభారతీయ భాషా సంస్థ (సి.ఐ.ఐ.ఎల్.) ఆధ్వర్యంలో నిర్వహింపబడాలని ప్రాథమికంగా నిర్ణయింపబడినా – అంటే తెలుగు రాష్ట్రాలకు దీని నిర్వహణలో ఎటువంటి సంబంధం లేక పోయినా – భాషాభివృద్ధే ప్రధాన లక్ష్యం కాబట్టి నిజంగా ఈ కేంద్రం ఎక్కడైనా ఉండవచ్చు – కాని మారిన పరిస్థితులలో వివిధ కారణాల వల్ల ఇది స్థానభ్రంశం పొంది, నెల్లూరుకు మార్చబడింది. సంస్థ పరిపాలనకోసం ఒక సంచాలకుడు (ప్రాజెక్టు డైరెక్టరు) మిగతా పండితులు ....ఉంటారు. అన్ని నియామకాలు తాత్కాలికమే. ఇందులో 65 సంవత్సరాలు దాటని పదవీ విరమణ పొందిన పండితులను గాని, అర్హతలు కలిగిన నిరుద్యోగులను గాని నియమించవచ్చు. పదవీ కాలం మూడు సంవత్సరాలు కనుక సంచాలకుడి వయోపరిమితి 62 సంవత్సరాలు – కనీసం మూడు సంవత్సరాల పదవీకాలం ఉండేటట్లుగా నిర్ణయింపబడింది. ప్రస్తుతం సంచాలకుడు, ఏడుగురు ఇతర స్కాలర్లు మాత్రమే నియమింప బడినారు. అకౌంటెంటు, ఆఫీసు సూపరింటెండెంటు, క్లర్కులు, మొదలైన వారు ఇంకా నియమింపబడలేదు. స్థానభ్రంశం జరిగి నెల్లూరికి మారిన తర్వాత అక్కడ సంస్థ పూర్తి స్థాయిలో నడిస్తే మొత్తం అకడమిక్, నాన్ అకడమిక్ సిబ్బంది డిపిఆర్ (డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) ప్రకారం. 30–35 దాకా ఉండవచ్చు.

అయితే ప్రస్తుత పరిస్థితులలో ఈ కేంద్రపు సంచాలకునికి ఆర్థిక సంబంధమైన అధికారాలు ఉండవు. ఇది భారతీయ భాషా సంస్థలో భాగంగా ఉంటే ఆ సంస్థ నిర్దేశకుడి నేతృత్వం కార్యక్రమాల నిర్వహణకు ఆర్థిక పరమైన అనుమతలును పొందవచ్చు. అట్లాకాక ఆ కేంద్రం మరొక చోట ఉంటే అప్పుడు కూడ మైసూరు నుంచే ఆర్థికానుమతులను పొందవలసి ఉంటుంది. ఇది రోజువారి కార్యక్రమాలకు ఆటంకముగాను అసౌకర్యంగాను ఉంటుంది. కనుక ఇది నెలకొల్పబడే స్థానంలో ఇంకొక కేంద్ర ప్రభుత్వ సంస్థ ఉన్నట్లయితే, ప్రభుత్వం కావాలనుకొంటే ఆ సంస్థ పాలకులకి అధికారాన్ని అప్పగించవచ్చు తాత్కాలికంగా. కాని అటువంటి ఆ సంస్థలు నెల్లూరులో ఉన్నట్టు లేదు కాబట్టి ప్రాచీన తెలుగు భాషాకేంద్రం నెల్లూరుకు మారిన తర్వాత కొంతకాలం వరకు ఇటువంటి తిప్పలు తప్పవు. అంతేకాక, ఈ కేంద్రం నెల్లూరుకు మార్చబడితే అక్కడ మారిన రాజకీయ పరిస్థితులు, వాతావరణంలో ఈ కేంద్రపు సంచాలకులు చాలా కష్ట నష్టాలను, అసౌకర్యాలను, సమస్యలను ఎదుర్కొన వలసిన పరిస్థితి యేర్పడవచ్చుననిపిస్తున్నది. కేంద్రం నెల్లూరుకే ఎందుకు, హైదరాబాదుకుగాని మరొక చోటుకు గాని మార్చవచ్చుగదా అనవచ్చు. అది కేంద్ర ప్రభుత్వపు సంస్థ కాబట్టి కేంద్రం ఎక్కడైనా అనుకూలమైన చోట నెలకొల్పవచ్చు. నిర్దేశించిన కార్యక్రమం విజయవంతంగా జరగాలిగాని, స్థానం ముఖ్యంకాదు. అందుకే దానిని అన్ని సౌకర్యాలు ఉన్నా మైసూరులోని కేంద్రభారతీయ భాషా సంస్థలో ప్రారంభించారు. మొదట్లో తమిళకేంద్రము, ఇక్కడే ఉండేది. కన్నడ కేంద్రం కూడా ప్రస్తుతం ఈ సంస్థ ప్రాంగణంలోనే ఉన్నది. తెలుగు సంస్థను ఇక్కడే ప్రారంభించినా తర్వాత వివిధ కారణాల వల్ల నెల్లూరుకు మార్చాలని నిర్ణయించారు. కనుక దీనిని ఎవరూ తప్పుపట్టలేరు. ఎవరో హైదరాబాదు వాసి దానిని 52 : 48 నిష్పత్తి ప్రకారం ఆంధ్రా తెలంగాణాలు పంచుకోవచ్చు కదా అన్నారట. ఏమిటి పంచుకొనేది? ఇది తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ఆస్తికాదు కదా పంచుకోవటానికి? ఈ భాషా కేంద్రానికి ఈ రాష్ట్రాలకు ఎటువంటి సంబంధం లేదు. నియామకాలకు ఏ రాష్ట్రం వారైనా

(...తరువాయి 37 వ పుటలో)

చలసాని నరేంద్ర
9849569050



రామాలయ నిర్మాణం సయోధ్యను కలిగిస్తుందా!

సుదీర్ఘకాలం కోర్ట్ వివాదాలలో చిక్కుకొని, ప్రజల మధ్య అసహనానికి దారితీసి, దేశంలో మతపర ఉద్రిక్తలకు కారణమైన అయోధ్యలో రామాలయ నిర్మాణ అంశంపై చివరకు సుప్రీం కోర్ట్ తీర్పు ఇవ్వడానికి రంగం సిద్ధం కావడం శుభ పరిణామం. సుమారు 135 సంవత్సరాలుగా నెలకొన్న న్యాయపర వివాదానికి ఇప్పుడు సుప్రీం కోర్ట్ ముగింపు పలికే ప్రయత్నం చేయడం కీలక పరిణామం కానున్నది.

అయితే ప్రజల మనోభావాలు, విశ్వాసాలకు సంబంధించిన ఇటువంటి సున్నితమైన, కీలక అంశంపై న్యాయస్థానాల తీర్పుతో పరిష్కారం లభిస్తుందని ఆశింపలేము. వైరుధ్యమైన వాదనలు వినిపి స్తున్న ప్రజల మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేయగలిగినట్లయితే శాశ్వతమైన శాంతికి, స్నేహపూర్వక వాతావరణానికి దారితీయ గలదు. అయితే అటువంటి ప్రయత్నాలు చెప్పుకోదగిన రీతిలో జరుగక పోవడం విచారకరం.

వాస్తవానికి ఈ అంశమై విచారణను ప్రారంభించే ముందు సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజాన్ గొగోయ్ తో కూడిన రాజ్యాంగ ధర్మాసనం సయోధ్యకు చివరి ప్రయత్నం చేయడం జరిగింది. ముగ్గురు ప్రముఖులతో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదర్చడం కోసం ప్రయత్నం చేసింది. అయితే ఆ కమిటీ విస్తృతమైన సంప్రదింపులు జరిపిన తర్వాత సయోధ్య సాధ్యం కావడం లేదని చేతులు ఎత్తేయడంతో, తీర్పు ఇవ్వడానికి ధర్మాసనం సిద్ధపడుతున్నది.

అయితే ఇరు పక్షాల వాదనలు ముగించి, తుది తీర్పు కోసం సుప్రీం కోర్ట్ సిద్ధపడుతున్న సమయంలో వైరి వర్గాల నుండే సయోధ్య సంకేతాలు వెలువడటం విశేషమైన పరిణామమని చెప్పవచ్చు. సుప్రీం కోర్ట్ తీర్పు వెలువడే లోపుగానే అటువంటి సయోధ్య కుదిరిన పక్షంలో ప్రజల మధ్య శాశ్వతమైన మైత్రికి మార్గం ఏర్పడుతుంది.

వాస్తవానికి తొలి స్వతంత్ర సమరంగా పేర్కొనే 1857 పోరాటంలో హిందువులు, ముస్లింలు కలసి బ్రిటిష్ పాలకులపై తిరగబడటం తెలిసిందే. అప్పటి నుండే బ్రిటిష్ పాలకులు జాగ్రత్త పడి వారిద్దరి మధ్య వైరుధ్యాలను పెంచే ప్రయత్నం చేయడం ప్రారంభించారు. ఆ ప్రయత్నాలకు పరాకాష్టగా స్వతంత్రం ఇచ్చి, దేశం వదిలి వెళ్లిపోక తప్పని పరిస్థితులు ఏర్పడినప్పుడు, దేశ విభజనకు నడుం కట్టారు.

ఆదర్శ మూర్తిగా భావించే శ్రీరాముడు జన్మించిన ప్రదేశంగా భావిస్తున్న అయోధ్యలో నెలకొన్న రామాలయాన్ని 16వ శతాబ్దంలో బాబర్ ధ్వంసం చేసి మసీద్ నిర్మించారని హిందువుల విశ్వాసం. ఈ విషయమై తొలుత 1885 స్థానిక మహంత్ స్థానిక కోర్ట్ లో దావా వేసాడు. అక్కడ రామాలయం ధ్వంసం చేసి మసీద్ కట్టారని ఆరోపించారు.

1949 అలాహాబాద్ హై కోర్ట్ హిందువులను అక్కడ శ్రీరాముడి విగ్రహం పెట్టి, కోర్ట్ పర్యవేక్షణలో సంవత్సరానికి ఒకసారి ప్రార్ధనలు చేయడానికి అనుమతి ఇచ్చింది. అప్పటి నుండి అక్కడ శ్రీరాముడికి పూజలు కోర్ట్ పర్యవేక్షణలో సంవత్సరానికి ఒకసారి జరుగుతున్నాయి. ముస్లింల విశ్వాసం ప్రకారం నమాజ్‌కు స్థలం ప్రాధాన్యత ఉండదు. హిందువులకు దేవాలయాలకు స్థల ప్రాధాన్యత ఉంటుంది.

పైగా, ఇతర దైవముల పూజలు జరిగే చోట ముస్లింలు నమాజ్‌కు ఇష్ట పడరు. దానితో 1949 నుండి అక్కడ నమాజ్

జరగడం లేదు. ఈ విషయమై హిందువులు, ముస్లింలకు నచ్చ చెప్పే ప్రయత్నం చేసి ఉంటే, ఎప్పుడో సమస్య పరిష్కారం అయి ఉండెడిది. కానీ అటువంటి ప్రయత్నాలు జరుగలేదు.

ఈ లోగా, 1985లో షబానా కేసులో సుప్రీం కోర్ట్ తీర్పుకు వ్యతిరేకంగా ఉత్తరువు జారీ చేసి దేశ ప్రజల ఆగ్రహానికి గురయిన రాజీవ్ గాంధీ 1986లో ఆ ఆగ్రహం తొలగించాడానికి శ్రీరాముడి విగ్రహానికి రోజువారీ పూజలకు అనుమతి ఇచ్చారు. 1988లో రామాలయం నిర్మాణంకు శిలాశాసనం జరపడానికి రాజీవ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 1989లో ఎన్నికల ప్రచారాన్ని అయోధ్య నుండి 'రామరాజ్యం' నినాదంతో రాజీవ్ గాంధీ ప్రారంభించారు.

ఈ విషయమై కోర్ట్ లో వాదోపవాదనలు జరుగుతూనే ఉన్నాయి. మరోవంక, 1991లో వివాదాస్పద బాబరీ కట్టడాన్ని ధ్వంసం చేశారు. తాత్కాలిక రామాలయం ఏర్పాటు చేశారు. అప్పటి నుండి అక్కడ పూజలు జరుగుతున్నాయి.

ఇలా ఉండగా, 2010లో ఈ భూమిని మూడు భాగాలుగా చేసి ముస్లిం, రామాలయంకు రెండు భాగాలు ఇస్తూ, అలహాబాద్ హై కోర్ట్ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై సుప్రీం కోర్ట్ కు ఇరు వర్గాలు వెళ్లాయి. ఇప్పుడు చివరకు సుప్రీం కోర్ట్ తీర్పు ఇవ్వడానికి సిద్ధపడు తున్నది.

పివి నరసింహారావు హయాంలో హిందూ, ముస్లింల మధ్య సయోధ్యకు ప్రయత్నాలు మొదటిసారిగా ప్రభుత్వం వైపు నుండి జరిగాయి. కోర్ట్ లోనే తేల్చుకుంటామని ఇరువైపులా అంగీకరిం చడంతో, వివాదాస్పద భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, తీర్పు చెప్పమని కోర్ట్ ను ప్రభుత్వమే అడిగింది.

అయితే అందుకు మొదట్లో ఒప్పుకున్న ఒక వర్గం రాజకీయ కారణాలతో వెనుకడుగు వేయడంతో ప్రభుత్వం ఆ కేసును వెనుకకు తీసుకోవలసి వచ్చింది.

అంతకు ముందు 1988లో అధికారంలోకి వచ్చిన విపి సింగ్ కు అటువంటి అవకాశం కలిగింది. హిందూ, ముస్లింలలో మంచి సంబంధాలు ఉండడంతో, ఆయన నిజాయతీతో ప్రయత్నిస్తే అప్పట్లోనే సయోధ్య కుదిరి ఉండెడిది. అందుకు ఇరు వర్గాలు సహితం సుముఖత వ్యక్తం చేశారు. అయితే సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం ఇరు వర్గాలను రెచ్చగొట్టే ప్రయత్నం ఆయన చేశారు.

1999లో అధికారంలోకి వచ్చిన వాజపేయి పరిష్కారం కోసం జయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో ఒక కమిటీ వేశారు. అయితే పరి ష్కారం కుదిరితే, వాజపేయికి పేరొచ్చి, బలం పెంచుకొంటారనే భయంతో ఆయన మంత్రివర్గ సహచరులే తెరవెనుక కుతంత్రాలకు పాల్పడడంతో ఎటువంటి ప్రయోజనం కలుగనే లేదు. కరసేవక్ లపై పోలీస్ కాల్పులు జరిపి, దారుణంగా హత్యాకాండ జరిపిన ములాయంసింగ్ యాదవ్ వంటి వారు కూడా వాజపేయి హయాంలో వలే హిందూ సాధువులలో చీలిక తెచ్చే ప్రయత్నం జరపక పోవడం గమనార్హం.

ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ కూడా అధికారికంగా అక్కడ తిరిగి మసీద్ నిర్మించాలని గాని, రామాలయం నిర్మించవద్దని గాని చెప్పడం లేదు. ఏ రాజకీయ పార్టీ కూడా ప్రత్యక్షంగా ఈ వివాదంలోకి దిగలేదు. అయితే హిందూ, ముస్లింల మధ్య అగాధాన్ని పెంచడం ద్వారా తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం దాదాపు ప్రతి రాజకీయ పక్షం ప్రయత్నం చేస్తూనే ఉన్నది. అందుకనే దేశంలో మత ఘర్షణలు చెలరేగుతున్నాయి.

ఒక విధంగా అయోధ్య అంశాన్ని హిందూ, ముస్లింలు పరస్పరం అవగాహనతో పరిష్కరించుకొనే అవకాశం లేకుండా రాజకీయ విద్వేషాలు సృష్టించే విధంగా మారడానికి, ఎల్ కె అద్వానీ 1991లో జరిపిన రథయాత్ర కారణం అని చెప్పవచ్చు. దేశ ప్రజలు రాజకీయాలకు అతీతంగా శిలాశాసనంలో పాల్గొన్నారు. అందుకోసం ప్రజలలో చైతన్యం తీసుకు రావడానికి హిందూ సంస్థలు దశాబ్దకాలం పాటు విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాయి.

ఈ ఉద్యమంలో ఎక్కడా రాజకీయ నాయకులు పాల్గొననే లేదు. అయితే అయోధ్య ఉద్యమం తుది దశకు చేరుకొంటున్న సమయంలో రథయాత్ర జరపడం ద్వారా, తాను ఒక ప్రజా నాయకు డిగా ఆవిర్భవించే ప్రయత్నం అద్వానీ చేశారు. ఈ ప్రయాత్నంతో మొత్తం అయోధ్య ఉద్యమాన్ని బిజెపి హైజాక్ చేయడం జరిగింది. దానితో రాజకీయ వివాదంగా మారి సమస్య జఠిలమైనది.

ఇప్పుడు సుప్రీం కోర్ట్ ముందున్న వివాదం భూయాజమాన్యంకు సంబంధించినదే అయినప్పటికీ, ప్రజల మనోభావాలకు సంబం ధించిన అంశం కావడంతో జాగ్రత్తగా వ్యవహరించ వలసి ఉంది. రాజ్యాంగంలోని 142వ అధికరణను ఉపయోగించుకొని న్యాయం కోసం సుప్రీం కోర్ట్ ఎటువంటి తీర్పు అయినా ఇవ్వవచ్చు.

అయితే రెండు వైపులా అత్యధికులు సంతోషంగా ఒప్పుకొంటే గాని ఎటువంటి ఒప్పందం అయినా ఆమోదయోగ్యం అయ్యే అవ కాశం ఉండదు. అందుకోసం రెండు వైపులా కొంతమేరకు తమ పట్టుదలలు వదులుకోవలసిందే.

నేడు సుప్రీం కోర్ట్ తీర్పుకు ముందుగా తెరపైకి వస్తున్న రాజీ సూచనలు 80వ దశకంలోనే వచ్చాయి. అయోధ్యలో రామాలయ నిర్మాణంకు సహకరిస్తే కాశీ, మధురలలో సమస్యలు లేవనెత్తవద్దని హిందువులను ఒప్పిస్తామంటూ పలువురు ప్రముఖులు ముందుకు వచ్చారు. అయితే సంకుచిత రాజకీయాలు ప్రవేశించడంతో పరిష్కారం కుదరకుండా పరిస్థితులు జటిలంగా మారాయి.

ఇప్పుడు తీర్పు ఇచ్చే ముందు సుప్రీం కోర్ట్ న్యాయమూర్తులు ఎంతో హుందాగా వ్యవహరిస్తూ, రాజీ పరిష్కారం కోసం అనేక అవకాశాలు ఇవ్వడం ముదావహం. ఇప్పటికైనా వివేకవంతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొనే ప్రయత్నం చేయాలి. తద్వారా మొత్తం దేశంలో హిందూ, ముస్లింల మధ్య అపోహలు తొలగి, సామరస్యంతో వ్యవహరింపగల వాతావరణం ఏర్పాటుకు దోహదపడాలి. నూతన చరిత్రకు నాంది పలకాలి.

ధారావాహిక

నంద్యాల నారాయణ రెడ్డి
9360514800

సొతంత్రకాల సదువులు 6

తెల్లోడి [redacted]

"సిన్నా ఇట్ల రాప్పా" అంటా ఒంటేలుగంట బిడువులో ఒక పిలుపు వినిపించింది నాకు. తిరిగి చూస్తిని. కానగమాను కింద నిలిపిండే ఎద్దులబండి తావ ఒక పెద్దాయన నిలుచుకోని నన్ను పిలస్తా ఉండాడు. నేను ఆయన దగ్గరకు పోతిని.

"దీన్ని సూసి సెప్పప్పా, ఇది కాలణానా అర్ధణానా?" అంటా ఒక నాణేన్ని నా చేతికి ఇచ్చినాడు. "ఇది అర్ధణా కాసు తాతా, అది కూడా తెలీలేదా" అంటిని.

"ఏమి తెలిసేదో పోప్పా, ఇప్పుడంతా కొత్తదుడ్లు, నయాపైసలంట. ఇంతాకంటా రూపాయికి 192 పైసాలుండె. అణాకు పన్నెండు పైసలు. పైసాను గుడ్డికాసు అంటా ఉంటిమి. మూడు గుడ్డికాసులకు ఒక తూటుకాసు. రెండు తూటుకాసులు అర్ధణా. నాలుగు తూటుకాసులు ఒక అణా. రెండు అణాలు ఒక బేడ. ఎనిమిది బేడలు ఒక రూపాయి. అన్ని కాసుల మీదా అది ఎంత అని తెలుగులో రాసి ఉండేది. ఇపుడు ఆరుపైసలు ఒక అణా అంట. నూరుపైసలు ఒక రూపాయంట. అవిటిమింద తెలుగు అచ్చరమే లేదు. సొతంత్రమొచ్చి మన తెలుగు పోయెనే, తెల్లోడి ఏలుబడే మేలుగా ఉండె" అంటా ఇంకా ఏమో చెప్పేకి వచ్చినాడు. లోపలిగంట వినబడి తరగతి తట్టుకు పారితిని.

ఆ సమయంలోనే, మా అగ్గురారము మేస్టరు ఒకసారి మా గురువుగారింటికి వచ్చిరి. "ఏమిరా బాగ చదువుతా ఉండారా" అని మమ్మల్ని పలుకరించిరి. మేస్టరు జతలో ఇంకొక ఇద్దరు వచ్చిరి. వాళ్లు ముగ్గురూ మా గురువుగారూ కలిసి కూకొని మాట్లాడుకొంటా ఉంటే, మేము వింటా ఉండాము.

"ఆంధ్రరాష్ట్రము ఏర్పడి రెండేండ్లు కావస్తా ఉంది. మన హోసూరు ప్రాంతాన్ని కలుపుకోకుండానే రాష్ట్రము ఏర్పడిపోయె. అబ్దుల్ గఫార్ ఖాన్ అని పాకిస్తానంలో ఒకాయన ఉండిరంట. సరిహద్దుగాంధీ అని ఆయనకు అడ్డపేరంట. వాయవ్య సరిహద్దు రాష్ట్రాన్ని పాకిస్తానంలో కలపరాదని ఉద్యమించిరంట. కానీ ఆ రాష్ట్రం పాకిస్తానంలోనే కలిసెనంట. అపుడాయన మమ్మల్ని తోడేళ్లకు విడిచిపెడితిరే అని వగచెనంట. అట్లాయె మన పరిస్థితి. తెలుగు మేకపిల్లలమైన మనల్ని అరవ తోడేళ్లకు విడిచిపెట్టి పొయ్యేసిరి మన ఆంధ్రా అన్నలు. ఏమి చేసేది ఇంక" ఒక గొంతు.

"లేదు లేదు, రాష్ట్రాల పునర్విభజన కోసం ఫజులాలీ కమిటీని నియమించిరి కదా నెహ్రూగారు. మనకు న్యాయం జరక్కుండా ఉంటుందా, మన హోసూరు ప్రాంతమట్లానే బరంపురమూ బళ్లారీ తావుల్లో కూడా ఆంధ్రాలో కలవాలని అడగతా ఉండారంట. అన్నిటినీ పరిష్కరించేకి కమిటీని వేసిరంట" ఇంకొక గొంతు.

"మీరింకా ఎక్కడుండారు సార్, ఫజులాలీ కమిటీ రేపో మన్నాడో నివేదికను ఇచ్చేనట్ల ఉందంట. వాళ్లు అపుడే చెప్పేసిరి కదా, జిల్లానే కొలతగా తీసుకొంటాము, తాలూకాను కాదు అని. అట్లాంటపుడు హోసూరు తాలూకాను ఆంధ్రాకు చేరుస్తారని ఎట్ల నమ్మేది?" మరొక గొంతు.

"మనమే కాదు, కోయంబత్తూరు జిల్లాలోని కొళ్లేగాలం తాలూకాను కన్నడమోళ్లు అడగతా ఉండారు. రాయచూరు జిల్లాలోని గద్వాల తాలూకాను బూర్గుల రామకృష్ణారావుగారు అడగతా ఉండారంట. ఇందరి కోరికలనూ తోసేస్తుందా ఆ కమిటీ, సరే చూస్తాము ఏమి నడుస్తుందో" నాలుగోగొంతు.


"మీరేమన్నా అనుకోండి, ఈ నెహ్రూ ప్రభుత్వము కంటే, తెల్లోడి ఏలుబడిలోనే తెలుగుకు మర్యాద ఉండె. కాంగ్రెసు ప్రభుత్వము తెలుగును తుంగలో తొక్కేసిందప్పా" తొలిగొంతు.

ఆ మాటతో అందరూ నిట్టుసురు విడుస్తా లేచిరి. మన తెలుగుకు ఏమో ఇక్కట్టు వచ్చినట్లుందే అనిపించింది మాకు.

టిప్పు సుల్తాన్ కోట :

"మన హోసూరును ఆనుకొనే పడమర దిక్కులో ఒక పాడుబడిన కోట ఉంది. అందరూ దానిని టిప్పు సుల్తాన్ కోట అంటుంటారు. నిజానికి, ఆ కోటకూ టిప్పు సుల్తానుకూ ఏ సంబంధమూ లేదు. అది బ్రిటీష్‌వాళ్లు కట్టించిన కోట. దాని అసలు పేరు హెనిల్ వర్త్ క్యాజల్. 1860 వ ఏడాదిలో కలెక్టరుగా ఉండిన హెన్రీ డిక్సన్ అనే తెల్లదొర ఆ కోటను ఫోటో తీసిందారు. ఈ వందేళ్లలోనే రూపు మారిపోయి, పాడుగోడలతో మట్టిదిబ్బలతో శిథిలమైపోయి ఉంది. ఎప్పుడన్నా ఒకసారి మిమ్మల్ని తోడుకొనిపోయి చూపిస్తాను లే" అని గురువుగారు ఒకసారి చెప్పిరి. అపుటినింకా ఆ కోటను చూడాలని మనసు పీకుతా ఉంది.

గురువుగారు తోడుకొనిపోయి చూపించేది ఎప్పుడో, అంతాకంటా ఎదురు చూసేది ఎట్లా, దానికనే ఈసారి ఆయిత్తారంనాడు మేమే పోయి చూసేసిరావాలని అనుకొంటిమి. మేము మంచి చిన్నోళ్లమని మా గురువుగారికి నమ్మకము. అందుకనే రవంత చూసీ చూడనట్లు ఉంటారు. కొండ తావున గవులలోకి మేము పోయి వచ్చిన సమాచారాన్ని చెప్పినపుడు కూడా కోప్పడలేదు. అట్లావి చూడవలసిందే కానీ హద్దులు దాటరాదు అనిరి. ఆ ధైర్యంతో ఒక ఆయిత్తారంనాడు చెప్పకుండానే బయలుదేరితిమి.



హోసూరు పేటకు పడమర దిక్కున పెద్ద చెరువు. రామనాయకుడనే రాజు తవ్వించిన చెరువంట అది. అందుకే దానిని రామనాయకుని చెరువు అంటారు. హోసూరులోని సగానికి పైగా జనానికి శుభ్రమైన తాగునీటిని అందించే చెరువది. చెరువుకట్ట చానా పెద్దది, మొత్తం రాతి కట్టడం. కట్టకు లోతట్టు ఒకపక్క బట్టలు ఉతుక్కొంటా నీళ్లుపోసుకొంటా ఉండారు. ఇంకొకపక్కనుండే నీళ్లను తాగడానికి వాడతుండారు. చెరువు నిండుగా తేటంగా తియ్యంగా నీళ్లుండాయి.

చెరువును ఆనుకొనే కోట ఉంది. కోటకు రెండు పక్కలా నూరడుగుల వెలుపూ ఏబై అడుగుల లోతుతో పెద్ద అగడ్త. కోట రక్షణ కోసం తవ్వి ఉంటారేమో దీనిని. అగడ్త నిండా నీళ్లు. ఆ అగడ్తను తవ్వి పోసినదేమో, లోపలిపక్క అగడ్త పొడుగునా ముప్పై నలబై అడుగుల ఎత్తయిన మట్టి దిబ్బ, చిన్నకొండట్లా ఉంది. కోట ప్రాంతమంతా మట్టి దిబ్బలే. అక్కడక్కడా కూలిపోయిండే పాత రాతికట్టడాలు. అక్కడే కోట మారెమ్మ గుడి. హోసూరుకు గ్రామదేవత ఆ తల్లి. కోట బయలంతా సుమారు ఇరవై ఎకరాలు ఉండవచ్చునేమో.

అగడ్త పొడుగునా ఉండే మట్టి దిబ్బను చుట్టిచూస్తా ఉంటే, ఒక దగ్గర కోట లోపలికి దారి కనబడింది. ఆ ద్వారం ఇటుకలన్నీ రాలిపోయి ఉద్దలుగా పడి ఉండాయి. వాటిలో పాములుంటాయేమో అనే దిగులు కలిగింది. మెల్లిగా ఇటుకలపైన ఎక్కీదిగీ తడబడతా లోపలికి పోతుండాము. కప్పులోని ఇటుక రాళ్లు రాలిపడతాయేమో అని ఇంకొక దిగులు. అయినా అట్లే లోలోపలికి పోతిమి. అంతా శిథిలమయి పోయిన పెద్దపెద్ద గదులు. నడుమ నడుమ ఎత్తయిన అడ్డుగోడలు. ఒక్కొక్క గదీ వందలమంది ఉండేంత పెద్దది. ఇంకా లోపలికి పోయే ధైర్యంలేక, వెనక్కి తిరిగి బయటకు వచ్చేస్తిమి.

అగడ్తలోకి దిగేకి, ఒకతావున రవంత అనువయిన చోటు కనిపించింది. దిగి చూస్తిమి. అక్కడొక పెద్ద బండ కనిపించింది. బండ మీదనింకా నీళ్లు అందతా ఉండాయి. ఇదే మంచి తావు అనుకొని, బండమీద కూకొని, మేము తెచ్చుకొన్న వడల్నీ బోండాల్నీ తిని, తియ్యటి ఆ అగడ్త నీళ్లనే తాగి, కొంచెం సేపు ఆ నీళ్లలో ఆట్లాడుకొని బయటకు వస్తిమి.

పొద్దు పడమరకు దిగతా ఉంది. మాపుసరి నాలుగ్గంటలు అయిండచ్చు. ఇంక పోదామని అనుకొంటా ఉండేనపుడు, ఎదురుగా మట్టిదిబ్బ వెనక, పది పదైదుమంది చిన్నోళ్ల మాటలు వినిపించె. చూద్దామని పోతిమి. అక్కడ పెద్ద బయలు ఉంది. ఆ బయల్లో ఒక అంచున కసువునంతా చెక్కేసి కల్లంలాగా చేసిండారు. కల్లానికి ఒకపక్క పదడుగుల కట్టెకి కట్టిన జెండా ఎగరతా ఉంది. ఆ జెండా

కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!

ముక్కోణంగా కావి వన్నెలో ఉంది. పద్దెదుమంది యువకులు మూడు వరుసలుగా ఆ జెండా ముందు నిలబడి ఉండారు. వాళ్ల నాయకుడేమో, ఒక అన్న అందరికంటే ముందు నిలబడి, ఆ జెండాకు సెల్యూట్ చేసినాడు. అందరూ అదే మాదిరిగా చేసిరి. ఆ సెల్యూట్ మాకు కొత్తగా కనిపించింది. చెయ్యిని నుదిటి మీద కాకుండా ఎదమీద పెట్టి సెల్యూట్ చేసిరి. మమ్మల్ని చూసి చిరునగవుతో పిలిచిరి. మేము దగ్గరకు పోయినంక కూకోమనిరి. మేము ఆశ్చర్యంగా చూస్తా కూకొంటిమి.

అనెంక అందరూ ఎదలపై చేతుల్ని పెట్టుకొని ప్రార్థన చేసిరి. అనెంక ఆ పెద్దన్న చెప్పినట్లు ఎన్నెన్నో వ్యాయామాలు చేసి కొత్త కొత్త ఆటలు ఆడిరి. మేము కూడా పాలుగొంటిమి. ఆటలు అయినంక అందర్నీ గుండ్రంగా కూకోబెట్టి పరిచయాలు చేయించిరి. ఆ మీదట పెద్దన్న ఒక ఉపన్యాసము ఇచ్చినాడు. ఆ ఉపన్యాసములో దేశం గురించీ, దేశ గొప్పదనం గురించీ, దేశ ఐక్యత గురించీ చెప్పినాడు. వాళ్ల సంఘంపేరు రాష్ట్రీయ స్వయం సేవక సంఘం అనీ, దేశ సమైక్యత కోసం 1925లో నాగపూరులో తెలుగాయన అయిన కేశవబలిరాం హెడ్గేవార్ అనే ఆయన ఆ సంఘాన్ని స్థాపించిరి అనీ చెప్పినాడు. హిందూ సమాజాన్ని జాగృతం చేసి దేశాన్ని ఐకమత్యంగా ఉంచేకి, ఆ సంఘంలో చేరి పనిచేయాలని చెప్పినాడు. కడసీలో అందరిచేతా భారతమాతకూ జై అని మూడుసార్లు చెప్పించినాడు. అందరమూ ఇండ్లకు బయలుదేరితిమి.

పొద్దప్ప (సూర్యుడు) నిద్దరపోయేసిండాడు. బానములో చుక్కలు మెరిసినట్ల పేట వీధుల్లో సోలుగా దీపాలు వెలుగతా ఉండాయి. మేము ఇంటికి పోయేసరికి గురువుగారు ఉగ్ర నరసింహావతారం ఎత్తి ఉండారు. మాకోసం పేటంతా వెతికించిరంట. మేము పోయి గురువుగారి ముందు చేతులు కట్టుకొని తల దించుకొని నిలుచుకొంటిమి. ఆయన బెత్తాన్ని పైకెత్తేసరికి, నడిచినదంతా ఉన్నదున్నట్లుగా చెప్పేసి, కండ్ల నీళ్లు కార్చేస్తిమి.

"సరి సరి అయింది ఆయె, ఏడవద్దు. నేనే తోడుకొని పోయి కోటను చూపిస్తానంటిని కదా. అయినా పోయేటప్పుడు చెప్పింటే నేనూ వచ్చింటాను కదా. సరే, ఇంకోవారం అందరమూ కలిసే పోదాములే. ఆ ఆరెసెస్ మంచి సంస్థే కానీ, దానిని సర్కారోళ్లు రద్దు చేసిండారు. అందుకే వాళ్లు కోట దిబ్బల్లో మరుగుల్లో కలుసుకొంటా ఉంటారు. వాళ్ల జతకు పోవద్దు సరేనా" అనిరి గురువుగారు.

మా ఏడుపును చూసిన ఉగ్రనరసింహమూర్తి, కరుణారసరామమూర్తి అయిపోయిరి.

ఈయెస్సెల్సీ చదివేస్తిమి :

మేము ఏడోతరగతిని ఫస్టుక్లాసులో దాటేసి ఎనిమిదికి వచ్చేస్తిమి. మా తరగతులకు వేరేపేర్లు ఉండాయి. 6 నింకా 10 వరకూ ఫస్ట్‌ఫాం, సెకండ్‌ఫాం, థర్డ్‌ఫాం, ఫోర్త్‌ఫాం, ఫిఫ్త్‌ఫాం అనేవి ఆ పేర్లు. 11వ తరగతిని ఎస్.ఎస్.ఎల్.సి. అంటారు. 11ని చదివినంక, డిగ్రీ చదవవచ్చునంట. అంతమాత్రము చదివినోళ్లే మా ఊర్లల్లో చానా అరుదంట.

మేము థర్డ్‌ఫాంకు ఎగబారితిమి. మాకంటే ముందే 1956 కూడా థర్డ్‌ఫాంకు వచ్చేసిండాది. థర్డ్‌ఫాంకు ఈయెస్సెల్సీ అని ఇంకొకపేరు. అంటే ఎలిమెంటరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికేట్ అంట. అప్పుడప్పుడే పంచాయతీ గ్రామాల్లోని ఒక్కొక్క ఊరికీ స్కూళ్లను ఆరంభిస్తా ఉంది ప్రభుత్వం. మేస్టర్ల కొరత వల్ల ఈయస్సెస్సెల్సీ చదివినవాళ్లు కూడా మేస్టర్లయిపోతా ఉండారు.

మా చిన్నోళ్లు చానా పెద్ద తరగతికి వచ్చిండారంట. అది సదివేస్తే మేస్టరు ఉద్యోగమో, గుమస్తా ఉద్యోగమో సిక్కిపోతుందంట. మేస్టరు ఉద్యోగమంటే సామాన్యమా, నెలకు ముప్పై రూపాయల సంబళం. ఆ కాసులకు ఒక మూట రాగులూ ఒకమూట వడ్లూ కొనచ్చు. ఇంకా నాలుగైదు రూపాయలు ఉప్పూ మిరపకాయా సంబారాలకు మిగులుతాది" అని చెప్పుకోని సంబరపడతా ఉండారు.

ఆ సంబరంలో గొర్రెల్నో ఆవుల్నో అమ్మి మా చదువులకు చెల్లు చేస్తా ఉండారు. ఒకనాడు మా వూరి మేస్టరు మమ్మల్ని చూసేకి వచ్చిరి. అపుడు గురువుగారి ఇంటితావునే ఉండాము. "ఏమంద్రా బాగుండారా, బాగా చదవతుండారా, అక్కడ ఊర్లో మీ అమ్మా అబ్బల కష్టాన్ని చెప్పేదొద్దు. అంతగాసి పడతా ఉండారు. 'ఆవుల్నో గొర్రెల్నో అమ్మి ఇస్కూలోళ్లకి మాత్రము ఏడాదేడాదీ కొత్త బట్టలూ కొత్త పొత్తాలూ అని చెలువు చేస్తారే, ఆవుల్ని మేపేవాళ్లమని మమ్మల్ని మాత్రము అగ్గవగా చూస్తుండారే అని మీ అన్నలూ తమ్ముళ్లూ గలాటా చేస్తా ఉండారు. 'మన కుటుంబములో ఒకడు బాగా చదివి ఆపీసరు అయితే, మన కష్టాలు తీరిపోతాయి కదా, ఇంకొక మూడు నాలుగేండ్లు మనమట్లా సరుదుకొని, వాళ్లని చదివిస్తే, ఊర్లో మన కుటుంబానికి ఎంత మర్యాద ఉంటుందో చూడంద్రా' అని ఇంటిల్లపాదికీ సర్ది చెప్తా ఉండారు వాళ్లు. మీ అమ్మా అబ్బలకు ఒళ్లుమీద ఒకజత బండమీద ఒకజతగా ఉండాయి బట్టలు, అవి కూడా తేపలు (మాసికలు) వేసినవే. ఆశలన్నీ మీమీదే పెట్టుకోని బతకతా ఉండారు. వాళ్ల ఆశల్ని అడియాశలు చెయ్యద్దంద్రా, బాగా చదివి ఉద్ధారకం కండి" అని బుద్ధిమాటల్ని చెప్పిరి మేస్టరు. మా అమ్మా అబ్బల్ని గురించి మేస్టరు చెప్పింది విని, మా మనసులంతా ఒక మాదిరిగా అయిపోయె.

అనెంక మేస్టరు, గురువుగారు ఇద్దరూ కూకొని మాట్లాడుకొంటా ఉండారు. చూస్తిరేమి సార్, ఫజులాలీ కమిటీ నివేదిక బయటికొచ్చేసింది. ఇంక రేపోమాపో దేశమంతా భాషా రాష్ట్రాలు ఏర్పడతా ఉండాయి. ఆ నివేదికలో మన హోసూరును ఆంధ్రాకు చేర్చే సమాచారమే లేదు. కొళ్లేగాలం తాలూకాను మైసూరు రాజ్యానికి కలుపుతారంట. గద్వాల తాలూకా తెలంగాణకు చేరుతుందంట. మన దగ్గరకు వచ్చేసరికి తాలూకా కొలతకాదు అనేసిరి. అప్పటికీ ఎనబై శాతం పంచాయితీలు ఆంధ్రాలో కలవాలని తీర్మానాలు కూడా చేసి కమిటీకి పంపిరి కదా" ఆవేదనగా అనిరి మేస్టరు.

'అయ్యో, ఉండండి సార్; ఆ తీర్మానాలు ఏవీ కమిటీకి అందలేదంట. అపుడు కామరాజనాడార్ వచ్చిపోయె కదా, మన ఎం.ఎల్.ఎ. మునిరెడ్డి ఆ తీర్మానాలనంతా కట్టగట్టి నాడార్‌చేతికి ఇచ్చేసిరంట. వాటికోసమేనంట ఆయన వచ్చింది. వాటికి బదులుగా టిప్పుసుల్తాన్ కోటను మునిరెడ్డికి దారాదత్తం చేసిరంట. జనం అనుకొంటా ఉండారు" చెప్పిరి గురువుగారు.

" పాడుబడిన కోటను మునిరెడ్డి ఏమి చేసుకొంటాడు సార్" ఆశ్చర్యపోతా అడిగిరి మేస్టరు.

"ఈ గలాట అణిగినంక దానిని దొబ్బేస్తాడు (పడగొడతాడు), లక్షల విలువచేసే టేకు సామాను ఉంది ఆ కోటలో. ఆ సామానును అమ్మేస్తే ఆ దుడ్లతో బెంగుళూరులో ఒక వీధినే కొనెయ్యచ్చు" చెప్పిరి గురువుగారు.

"అయ్యో, కాసులకు ఆశపడి లక్షాంతరము జనం గొంతులు కోసేసినాడే మునిరెడ్డి" అని అంగలార్చిరి మేస్టరు. ప్రతి శుక్రవారమూ మా స్కూల్లో ఉపన్యాస పోటీలను పెడుతుంటారు. ఏదైనా ఒక విషయం మీద పది నిమిషాలు మాట్లాడాల. మేస్టర్లందరూ హాజరవుతారు. రెండు సమావేశాలుగా జరుగుతాయి, ఒకటి తెలుగులో ఇంకొకటి ఆంగ్లంలో. మా గురువుగారు, మా చేత ముందుగానే ఒక విషయాన్ని రాయించి, మాట్లాడేది వాడుక చేస్తుంటారు. ఒక శుక్రవారం నాడు నేను, గురువుగారు చెప్పింది కాకుండా ఆంధ్రోద్యమాన్ని గురించి మాట్లాడేస్తిని. నాలుగేండ్లుగా వింటా ఉండినదే కదా, గుక్క తిప్పుకోకుండా మాట్లాడేస్తిని. నా ఉపన్యాసాన్ని వినిన తెలుగు మేస్టర్లు కూడా గట్టిగా చేతుల్ని తట్టిరి. మా గురువుగారు అప్పుడేమీ మాట్లాడలేదు. ఇంటికి పోయినంక నా భుజాన్ని తడతా "నారాయణా, ఇవన్నీ పెద్దోళ్ల విషయాలు, రాజకీయాలు, నువ్వు తలదూర్చేవి కాదు, బాగా చదువుకో, పై నుండే అరవ అధికారులకు తెలిస్తే నీ చదువుకే ఆపత్తు" అనిరి. నేను దిగులు దిగులుగా తలను ఊపితిని.

మేము ఎనిమిదోది చదవతుండేనపుడే, అంటే 1956 నవంబరు ఒకటిన ఆంధ్రప్రదేశ్, మైసూరు, మద్రాసు అనే భాషావారీ రాష్ట్రాలు ఏర్పాటయినాయి. మా హోసూరు ఆంధ్రలో చేరలేదు, మద్రాసు రాష్ట్రంలోనే ఉండిపోయింది. ఆరు సెక్షన్లు తెలుగూ ఒక్క సెక్షను తమిళూ ఉండే మా తరగతిలో, పదులమంది తెలుగు మేస్టర్లూ ఒకరిద్దరు తమిళ వాద్దియార్లూ ఉండే మా స్కూల్లో, నూటికి తొంభైమంది తెలుగోళ్లూ పదిమంది తమిళోళ్లూ ఉండే మా పేటలో, తొలిసారిగా తెలుగుతల్లికి కలవరపాటు కలిగి, అరవసర్పం పడగెత్తినట్లయింది.

మా గురువుగారి శిక్షణలో నీళ్లు తాగినంత సులువుగా ఈ.ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షల్ని రాసేస్తిమి.

(తరువాయి వచ్చే సంచికలో...)

స్పందన

అక్టోబర్ 2019 'అమ్మనుడి' లో 'మన మూలాలు' శీర్షికతో, శ్రీరహమానుద్దీన్ షేక్, డక్కన్ క్రానికల్ పత్రికలో రాసిన ఒక వ్యాసమునునుసరించి మనమూలాల గురించి రాసినారు – ఆయన అభిప్రాయాలతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. వారు తెలిపినట్టు భారతదేశమునకు నిజమైన వారసులు ఆదివాసులే – ఆ పేరాలో ఉన్న వివరణ సంపూర్ణ సత్యమే. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భారత దేశ దక్షిణ భూభాగం, దక్షిణాఫ్రికా భూభాగంతో కలిసి ఉండేదనీ, అక్కడి నుండే నల్లజాతివారు దక్షిణ భారత భూభాగంలోనికి వలస వచ్చినారని, మానవ చరిత్రకారులు చెప్తున్నారు. చరిత్రకారుల అంచనాల ప్రకారం ఈ దేశంలోనికి వలసవచ్చి స్థిరపడిన జాతులవారు ఈ క్రమంలో ఉన్నారు.

1. దక్షిణాఫ్రికా ప్రాంతం నుండి నీగ్రో జాతివారు, 2. ప్రోటో ఆస్ట్రలాయిడ్స్, 3. అర్లోమెడిటరేనియన్స్, 4. మాంగోలాయిడ్స్, 5. లేటర్ మెడిటరేనియన్స్ (ద్రావిడులు), 6. ఆల్పైన్స్ (ప్రీవేదిక్ ఆర్యన్స్), 7. నార్డిక్స్ (వేదిక్ ఆర్యన్స్).

శ్రీ నిహర్‌రంజన్‌రాయ్ చెప్పినది వాస్తవం. గతంలో ఒక ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బి. భాస్కరరావు మరికొందరితో కలిసి చేసిన పరిశోధించిన ఫలితాల ప్రకారం –

మానవుల ముక్కుయొక్క ఎత్తు వెడల్పుల రేషియో, అనగా ఎత్తు : వెడల్పు యొక్క నిష్పత్తినిబట్టి జాతిని నిర్ధారించవచ్చు అని – అనగా ముక్కు దూలం ఎత్తు ఎక్కువగా ఉండి ముక్కు వెడల్పు తక్కువగా ఉన్నవారు ఇండో ఆర్యన్స్ అని, ఇతరులు ద్రావిడులని స్థూలంగా నిర్ధారించినారు. రంగు, ఎత్తును బట్టి కూడా జాతిని నిర్ధారించవచ్చు. బాగా నలుపుగా ఉన్నవారు మిశ్రమజాతి కానివారు ఆదివాసీలని, మధ్యరకంగా ఉన్నవారు ద్రావిడులని, గోధుమ, ఎరుపు, తెలుపు, పసుపు రంగు గల వారు ఆర్యులని చెప్పవచ్చు స్థూలంగా, ఇంకా వెంట్రుకల రంగునుబట్టి కనుపాపల రంగును బట్టి, కూడా జాతులను నిర్ధారించవచ్చు. తెలుగువారిలో మాదిగలే ఆది తెలుగులు, మాలలు కూడా కాదు; ఈ వివరణలు ఒక అంచనా మాత్రమే.

– కంచర్ల సత్యపాల్‌రెడ్డి
8686486859

(31 వ పుట తరువాయి...)


అర్హతలు కలిగి ఉంటే నియమింపబడవచ్చు.

కేంద్ర, భారతీయ భాషా సంస్థ యొక్క స్వర్ణోత్సవాలు జరిగిన వెంటనే, కేంద్ర ప్రభుత్వం ఈ కేంద్రాన్ని మైసూరు నుంచి నెల్లూరుకు మార్చాలని నిర్ణయించింది. అక్కడ ఇప్పటికే నెలకొల్పబడి యున్న స్వర్ణభారత ట్రస్టు వారి సౌజన్యంతో తెలుగు కేంద్రాన్ని నెలకొల్పటానికి కావలసిన భవనాలను, యోగ్యమైన గృహవసతులు చూపించబడినాయి. మైసూరులోని భాషా సంస్థ నిర్దేశకులు, ప్రాచీన భాషా కేంద్ర నిర్దేశకులు భాషా విభాగానికి చెందిన అపర కార్యదర్శి (అండర్ సెక్రటరీ) నెల్లూరుకు పోయి, అన్నీ పర్యవేక్షించి వచ్చారు కూడా

ఇప్పటికే ఈ కేంద్రం హైదరాబాదులోను, తిరుపతిలోను ప్రాచీన తెలుగు పరిశోధనకు సంబంధించిన కార్యశాలలు (వర్క్‌షాపు) మైసూరులోనే ఒక పునశ్చరణ తరగతుల కార్యక్రమం నిర్వహించింది. నెల్లూరుకు కేంద్రాన్ని మార్చే విషయంలో త్వరత్వరగా ఫైళ్లు కదులుతున్నాయి. ముందుముందు ఏమి జరుగుతుందో, కేంద్రాన్ని మార్చితే దాన్ని అక్కడ నుంచి ఎట్లా నడుపుతుంది. వేచి చూడవలసిందేగాని, దాని పురోభివృద్ధిని గురించి ఇప్పుడే ఏమీ ఊహించలేము.

ధారావాహిక

జోగిని మంజమ్మ ఆత్మకథ



కన్నడ మూలం
డా. చంద్రప్ప సొబటి

అనువాదం
రంగనాథ రామచంద్రరావు
9059779289

(గత సంచిక తరువాయి...)

లక్షలాది ప్రజల ప్రేమను కానుకగా ఇచ్చిన గొప్ప కళాకారుడు

బసప్ప నాకు ఈ జోగమ్మ నృత్య కళను(జోగిని నృత్య కళ) నేర్పిన మొదటి గురువు.

అతని వెంబడి భిక్షాటన చేయడం ప్రారంభించాను. అనేక ఊళ్లల్లో, సంతల్లో, సినిమా థియేటర్ ముందు భాగంలో, నాలుగు రోడ్లకూడళ్ళల్లో, బస్టాండులలో జాతరలలో ఇలా ఎక్కడెక్కడ జనం ఎక్కువగా చేరుతారో అక్కడ 'జోగిని నృత్యం' చేశాను. అప్పుడు ఆ కళను ప్రదర్శిస్తూ భిక్షం అడుగుతూ నెలలకొద్దీ అనేక ఊళ్ళు తిరిగాం. రాణిబెన్నూరు, బ్యాడగి, హావేరి తాలూకాలోని జనం మా నృత్యాన్ని చాలా ఇష్టపడేవాళ్ళు. మిరపకాయల కోతలు అయిన సమయంలో హావేరి జిల్లా వైపు వచ్చేవాళ్ళం. ఒక ఊరి నుంచి మరొక ఊరికి వెళ్ళేటప్పుడు బస్సులో కానీ, ఏదైనా వాహనంలో కానీ, రోడ్డు దారిలోకానీ ప్రయాణం చేసేవాళ్ళం కాదు. పొలాల గట్లు మీదుగా సాగుతూ ఒక ఊరినుంచి మరో ఊరికి చేరుకునేవాళ్ళం. అప్పుడు పొలాల్లో పనులు చేసుకునేవాళ్ళ ముందు ఆడిపాడి, మా నృత్యాన్ని ప్రదర్శించేవాళ్ళం.

ఆ సమయంలో పొలంలో మిరపకాయలు విడిపిస్తూ చాలామంది ఉండేవారు.

వాళ్ళ దగ్గర సుమారు అరగంట నృత్యం చేస్తే చాలు. పండ్లు, కాయలు, ఇచ్చేవాళ్ళు.

ఒక్కొక్కసారి కేవలం మిరపకాయల పొలాల్లోనే నృత్యం చేసేవాళ్ళం. అప్పుడు మిరపకాయలను ఇచ్చేవాళ్ళు. వాటన్నిటిని తెచ్చి మేము బసచేస్తున్న ఏ దేవాలయాల్లోనో, పాఠశాలల్లోనో రాత్రంతా ఆరవేసి, ఉదయం కాయకానికి వెళ్ళేముందు బట్టలో మూటకట్టుకుని తీసుకుని వెళ్ళేవాళ్ళం. ఇలా భిక్షమెత్తి వారంపదిహేను రోజులకు ఒక్కొక్కరం రెండు రెండు ఎండుమిరపకాయ సంచులు మోసుకుని వచ్చేవాళ్ళం. అలాంటి జోగమ్మ కళాభిమానులు, భక్తులు ఈ హావేరి జిల్లాలో ఉండేవారు.

ఇన్ని మిరపకాయలు వచ్చినా బసప్ప ఎందుకో నా కోసం పిడికెడు మిరపకాయలు ఇచ్చేవాడు కాదు.

పిడికెడు ఎందుకు ? కనీసం పద్లీగి పూజకోసం అయిదు మిరపకాయలు కూడా నాకు ఇవ్వలేదు.

ఒకసారి బయట నృత్యం చేస్తే రెండువందలు, రెండు వందల యాభై రూపాయలు వచ్చినా, కనీసం యాభై పైసలు కూడా ఇచ్చేవాడు కాదు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నృత్యం చేసి అలసిపోయినా, చాలని అనేవాడు కాదు.

నా కోసం ఏదీ ప్రత్యేకంగా ఇచ్చేవాడు కాదు. టిఫిన్, భోజనం, చాయ్ మాత్రం ఇప్పించేవాడు. అది కూడా ఎంత పెట్టిస్తే అంతే తినాలి. నేను ఏదీ అడగటానికి లేదు. ఫలానది కావాలని అడగలేను. అన్నింటికి మించి నా మనస్సును విపరీతంగా నొప్పించిన విషయం ఏమిటంటే, హోటల్లో అతను లోపల కూర్చుని టిఫిన్ కానీ, భోజనం కానీ చేస్తున్నప్పుడు, నేను బయట నిలబడి భోజనం చేయాల్సి వచ్చేది. "నువ్వూ లోపలికి వచ్చి, మా పక్కన కూర్చుని తిను" అని ఎన్నడూ పిలవనే పిలవలేదు.

నేను లోలోపల చాలా బాధపడేదాన్ని. అయినా అతని దగ్గర



జోగమ్మ గురువు – బసప్ప

నా బాధను ఎన్నడూ చెప్పుకోలేదు. నా బాధను నృత్యం నేర్చుకోవటంలో, దాన్ని సాధన చేయటంలో మరిచిపోయేదాన్ని. నృత్యకళను నేర్చుకుంటున్నానుకదా అది చాలని అనుకునేదాన్ని. బసప్ప నన్ను ఇంత బాధ పెట్టాడు... నన్ను దూరంగా పెట్టాడు... అని ఇప్పుడు మీ దగ్గర చెబుతున్నాను. అతన్ని తిడుతున్నాను. నా మాటలు విన్న మీ అందరికీ అతను ఒక్కింత కూడా జాలి, దయ లేని మనిషిగా కనిపిస్తాడు. నా పట్ల అయ్యో అని అనిపించవచ్చు. అతను నా పట్ల ప్రేమాభిమానాలు చూపించకపోయి ఉండొచ్చు.

కానీ నేను మీ అందరి ముందు ఇలా నిలబడగలిగే శక్తి ఇచ్చాడు.

అతను ఈ జోగిని నృత్యకళను నేర్పించకపోయివుంటే నేను ఒక సామాన్యమైన జోగినిలా బతికే దాన్నేమో?

లక్షలాదిమంది ప్రేమను పొందేలా, వాళ్ళ ప్రేమను గెలుచుకునే కళను నేర్పాడు. జీవితాన్ని కొత్తగా మలుచుకునే జ్ఞానాన్ని ఇచ్చాడు. గౌరవనీయులైన కులపతులవంటి గొప్పగొప్ప వ్యక్తులపక్కన కూర్చునే అవకాశం కల్పించాడు. ఇలాంటి జ్ఞానాన్ని ఇచ్చిన అతనికి భక్తితో నమస్కరిస్తున్నాను. ఈ రోజు నేను ఈ 'జోగతి నృత్యం' ఆరంభించ డానికి ముందు – ఆ గురువుకు ఒకసారి నమస్కారాలు సమర్పించి అడుగులు వేయడానికి ప్రారంభిస్తున్నాను.

అలాంటి గురువు పాదాలకు మరొకసారి నమస్కారాలు !

చీరకట్టుకున్న మగవాడి మీద సామూహిక అత్యాచారం

ఇంటి అద్దెకు డబ్బు ఇవ్వాల్సివుంది.

అందుకోసమే కుక్కువాడ అంగడిలో బియ్యం అమ్మి వచ్చిన డబ్బును అక్కడే దాచుకున్నాను.

ఆ డబ్బును తెచ్చుకుంటే అద్దె చెల్లించ వచ్చని సిటికి వెళ్ళాను.

ఆ రోజు ఆలస్యమైంది.

ఇల్లు చేరేసరికి మరీ ఆలస్యమవుతుందని డబ్బులు ఇప్పించుకుని బస్సు ఎక్కాను.

బస్సులో వచ్చి విద్యార్థి భవనం దగ్గర దిగాను.

జాలినగరానికి కాలేజిలోపలి నుంచి అడ్డదారిలో నడిచిపోతే తొందరగా ఇల్లు చేరుకోవచ్చనే ఆలోచన నా మనస్సులోకి వచ్చింది.

అది ఏ చెడు ఘడియలో అలాంటి ఆలోచన వచ్చిందో నాకు తెలియదు.

ఆ రోజు నా దగ్గర సుమారు ఎనిమిది, పది కేజీల బియ్యం ఉంది. డెబ్బయి రూపాయలు ఉన్నాయి. తల మీద బియ్యం మూట మోసుకుని, చేతిలో పడ్లిగి పట్టుకుని, హడావుడిగా బయలుదేరాను. కాలేజి కాంపౌండ్ లోపల నలుగురు యువకులు వచ్చి నన్ను అడ్డుకున్నారు.

ఆ రోజు వాళ్ళు నా పట్ల ప్రవర్తించిన తీరును ఈ రోజు చెప్పుకోవడానికి నాకు అసహ్యం వేస్తోంది. అంతటి వికృతమైన ప్రవర్తనకు బలి అయ్యానని ఇప్పటికీ దుఃఖం కలుగుతుంది. ఆ రోజు అడ్డుగా నిలబడ్డ వాళ్ళంతా బాగా తాగివున్నారు. ఏమీ అనకుండా హఠాత్తుగా నా చీరకొంగు పట్టి లాగారు. జాకెట్టు చింపేశారు. నేను ఏడ్చాను. ఆర్తనాదాలు చేశాను. తప్పించుకోవడానికి వారి నుంచి దూరంగా పరుగెత్తినా, వాళ్ళు వదల్లేదు. నా వెంటబడి నన్ను పట్టుకున్నారు.

నేను ఒక్కదాన్ని.

వాళ్ళు నలుగురు.

నాలుగు దిక్కుల్లో నిలబడ్డారు.

పరుగెత్తబోతే వెంటబడి పట్టుకున్నారు.

ఈ రోజు ఆ స్థలం సిటిగా మారిపోయింది.

ఆ రోజు నిర్మానుష్య ప్రదేశం.

లైట్లు లేవు.

జనసంచారం లేదు.

నేను కేకలు పెట్టినా విడిపించేవారు లేరు.

నా దగ్గరున్న డెబ్బయి రూపాయలు లాక్కున్నారు.

ఆ పెనుగులాటలో పడ్లిగి ఒకవైపు, సామాన్లు మరోవైపు పడిపోయాయి.

బియ్యము, ఇతర వస్తువులంతా చెల్లాచెదురుగా పడిపోయాయి.

ఆ పరిస్థితిని నేను గుర్తు చేసుకోకూడదు.

ఇంతకు నేను మగవాడిని. ఆడదాని వేషంలో ఉన్న మగవాడిని.

వేషాన్ని చూసి కూడా వాళ్ళు నన్ను అంతగా హింసించారు.

ఆ సమయంలో వాళ్ళకు నిజమైన ఆడది దొరికివుంటే ఎంత కష్టపడేదో? ఎంత బాధను అనుభవించేదో? ఎలాంటి హింసకు

అపురూపమైన వ్యక్తికి అరుదైన గౌరవం



ప్రియమైన పాఠకులారా,

సుమారు మూడు నెలల నుంచి మన అమ్మనుడి మాసపత్రికలో మీరు 'జోగిణి మంజమ్మ 'గారి ఆత్మకథను చదువుతున్నారనే భావిస్తున్నాను. వారి గురించి తెలిసిన ఒక విషయాన్ని మీతో పంచుకోవాలని –

నేడు శ్రీమంజమ్మ జోగినిగారిని కర్ణాటక జానపద అకాడెమీ అధ్యక్షురాలిగా నియమిస్తూ కర్ణాటక ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం జరిగింది. ఇది నిజంగా చాలా ఆనందం కలిగించే వార్త. మంజమ్మలాంటి కళాకారిణి, సంఘసేవకురాలు, జోగిణి నృత్యానికే గౌరవం తెచ్చిన వ్యక్తికి ఈ అరుదైన గౌరవనీయమైన పదవికి ఎన్నుకుని అరుదైన గౌరవాన్ని ఆమెకు ఇవ్వటం చూస్తే, కర్ణాటక ప్రభుత్వాన్ని, పాలకులను అభినందించక తప్పదు.

"పారంపర్యంగా వచ్చిన మా జోగిణి కళను కేవలం కళగా, జీవనం కోసం ప్రదర్శించడం కాకుండా , ఇతర కళల్లా ఈ జోగిణి కళను పరిగణించాలి. అంతేకాకుండా ఇప్పటి తరంవారు ఇతర కళల్లా ఈ కళను నేర్చుకోవడానికి ముందుకు రావాలి" –అని చెప్పే మంజమ్మగారు జీవితాంతం తను నమ్ముకున్న జోగిణి కళను ప్రదర్శిస్తూ, ఎందరికో నేర్పిస్తూ, వేలాది ప్రదర్శనలిస్తూ, బృందాలను తయారు చేస్తూ, జోగిణి నృత్యానికి సమాజంలో ఒక ఉన్నత స్థానాన్ని కల్పించడంలో ఆమె చేసిన కృషి చాలా గొప్పది

మంజమ్మగారు తమ జోగిణి నృత్యంతో రంగస్థలం మీద, చలనచిత్రాలలోనూ అభినయించి అభినందనలు అందుకున్నారు. ఈమె "రేణుకా చరిత్రె" నాటకాన్ని వేలాది ప్రదర్శనలు ఇచ్చింది. అంతేకాకుండా మోహినీ భస్మాసుర, హేమారెడ్డి మల్లమ్మ, కీచకవధె, గోకర్ణద గౌడశాని, హిరిజా కల్యాణ (బయలాట) –ఇలా అనేక నాటకాల్లో అభినయిస్తూ ప్రజాభిమానాన్ని పొందారు.

ఈ మధ్యనే మిత్రులు ప్రొ. చంద్రప్ప సోబటిగారు రాసిన మంజమ్మ జోగినిగారి ఆత్మకథలోని కొన్ని భాగాలను విజాపుర అక్కమహాదేవి విశ్వవిద్యాలయం బి.ఎ. అయిదవ సెమిస్టర్‌కు పాఠ్యాంశంగా చేర్చింది. దీనివల్ల సుమారు వందకు పైగా మహిళా కళాశాలల విద్యార్థినులు మంజమ్మగారి జీవిత విశేషాలను చదువుకుంటారని తెలుస్తోంది.

సమాజంలో జోగిణులను గౌరవ భావంతో చూసేవారికన్నా, తక్కువగా చూసేవారే ఎక్కువ. అటు పురుషుడు కాకుండా, ఇటు స్త్రీ కాకుండా ఉన్న ఇటువంటివారిని చూసి ముఖం తిప్పుకునే వారి నడుమ– తమ జోగిణి నృత్య కళా నైపుణ్యంతో రాష్ట్రమంతటా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న 'అమ్మ'గా అందరి చేత పిలవబడే మంజమ్మగారి వ్యక్తిత్వం చాలా గొప్పది. వారికి అభినందనలు.

గురయ్యేదో తలుచుకుంటే ఇప్పటికీ నా ఒళ్ళు జలదరిస్తుంది. పేపర్లలో, టీవీలో ఇలాంటి సన్నివేశాలు చూసినపుడు, ఆడపిల్లల మీద అత్యాచారాలు జరిగే సన్నివేశాలను చూసినప్పుడల్లా నేను ఎదుర్కొన్న ఆ సంఘటన గుర్తొస్తుంది. ఆ సంఘటనను నేను నా జీవితంలో మరిచిపోలేను. అలాంటి బాధను నేనొక్కదాన్నే అనుభవించాను. ఈ విషయాన్ని చెప్పుకోవడానికి ఆరోజు నాకుతోడుగా ఎవరూ లేరు.

ఇంట్లో కూర్చుని రాత్రంతా ఏడ్చాను.

ఆ రోజు నా కుటుంబం నా దగ్గర ఉండివుంటే ఇలా సంకటపడే పరిస్థితి వచ్చేదికాదేమో?

జరిగిన సంఘటనను చెప్పికునివుంటే ఊరకే ఉండేవాళ్లా? ఓదార్చేవాళ్ళు.

ఆ రోజు అలాంటివాళ్ళు ఎవరూ నాకు తోడుగా లేరుకదా అని గుండెలు బాదుకుని ఏడ్చాను. నేను ఇక బతకకూడదన్నంత బాధ కలిగింది. ఏదైనా చేసుకుని చచ్చిపోదామని అనిపించింది. అయితే చావు కోసం ప్రయత్నించి, కేవలం కొన్ని నెలలే అయ్యాయి. చావలేదు. చావటానికి ప్రయత్నించి, ఆ ప్రయత్నంలో సఫలమై చస్తే, అక్కడితో జీవితం ముగిసిపోతుంది. అకస్మాత్తుగా బతికితే అప్పుడు అనుభవించాల్సిన నరకయాతన ఎవరికీ వద్దు. ఈ బాధ

భాష లేకపోతే భావంలేదు;నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది

అనుభవించవచ్చు. ఆ బాధను ఊహించుకోవడానికే సాధ్యం కాదు. ఆ బాధను గుండెలో దాచుకుని, ఆ దుఃఖాన్ని దిగమింగుకుని, ఆ యాతనను ఇప్పటికీ మనసు మూలలో అనుభవిస్తూనే ఉన్నాను.

ఇంటి అద్దె కట్టడానికి తెచ్చిన డబ్బును లాక్కున్నారు.

ఇంటి యజమానికి నా దగ్గర డబ్బులు లేవని చెప్పడానికి నాకు సంకోచంగా ఉంది.

అయినా చెప్పక తప్పలేదు.

ఇంటి యజమానికి జరిగిన సంఘటన చెప్పాను.

ఆయన చాలా మంచివాడు.

పరిస్థితిని అర్థం చేసుకున్నాడు.

జరిగిన సంఘటన గురించి చాలా బాధపడ్డాడు.

ఆ నెల అద్దె వద్దన్నాడు.

అయితే నా మనస్సు అంగీకరించలేదు. మరుసటి నెలలో రెండునెలల అద్దె చెల్లించాను.

ఈ సంఘటన శనివారం సాయంకాలం జరిగింది.

ఆదివారం దావణగెరె సంత ఉండింది.

ఆ సంతలో పాతబట్టలు అమ్మేవారి దగ్గర పడ్లీగిలో పెట్టిన ఏడు రూపాయలతో ఒక చీర కొన్నాను.

ఇలా జరిగిన కొద్ది రోజుల తరువాత హొసపేట తాలూకాలోని హులిగి గ్రామంలోని హులిగమ్మ జాతరకు పోయాను. ఆ కాలంలో జాతర జరిగే రోజులలో సుమారు ఒక నెల రోజులపాటు అక్కడే ఉండేవాళ్ళం.

నేను హులిగి దగ్గర హిరెబగనాళ గ్రామంలో ఉన్న కాళవ్వ జోగినితో ఉండేదాన్ని. ఆమె ఈ రోజు లేదు. ఆమె జన్మనామం బసవరాజు. ఎర్రగా చాలా అందంగా ఉండేది. నేను ఆమె ఇంట్లోనే ఉండేదాన్ని. ఆమె, ఆమె గుంపులోని వారితో కలిసి జాతరలో భిక్షాటన చేసేవాళ్ళం.

ఇలా ఒకసారి భిక్షం ఎత్తుతున్నప్పుడు, "ఏ శెట్టి, మంజూ" అనే కేక వినిపించింది.

నన్ను ఎవరు పిలిచారా అని వెనుతిరిగి చూస్తే, మా బావ. అతను పెద్దమ్మ బంధువర్గానికి చెందినవాడు. హొసపేట తాలూకా చిలకనట్టి గ్రామస్థుడు. అతన్ని చూడటం నాకు చాలా ఆనందాన్ని కలిగించింది.

ఇల్లు వదిలిపోయిన తరువాత నా అనేవాళ్ళు ఎవరూ నాకు కనిపించలేదు.

వెంటనే దగ్గరికి వెళ్ళి పలకరించాను.

"ఏమిటి జోగమ్మగా మారావంట?" అని అడిగాడు.

"నేనేమీ కాలేదు. దేహం, మనస్సు దేవుడి ఇచ్ఛ ప్రకారం మారింది" అన్నాను.

కొద్దిసేపు మాట్లాడుకున్నాక తమ ఊరికి రమ్మన్నాడు.

నాకొక చీర కొనిస్తే వస్తానని అన్నాను.



"అదేమంత గొప్ప విషయమా? కొనిస్తాను రా" అని చెప్పిపోయాడు.

ఒక నెల రోజులు జాతరలో గడిపి, బావ చీర కొనిస్తానన్నాడుకదా, ఒకటి రెండు రోజులు అక్కడ ఉండి, చీర కట్టుకుని, దావణగెరెకు వెళదామని చిలకనట్టికి వెళ్ళాను.

ఆ ఊళ్ళో ఒక రోజు కాదు. ఒక వారం గడిపాను. బావ చీర తీసుకుని రాలేదు. వెళ్ళు అనలేదు. నేనూ వెళతానని అనలేదు. తినటం, ఇంటి అరుగు మీద కబుర్లు చెప్పుకుంటూ కూర్చోవటం.

ఇలా నెల రోజులు గడిచిపోయాయి.

ఒక రోజు అక్కడ భజన కార్యక్రమం జరిగింది.

నేను కూడా అక్కడికి వెళ్ళాను.

అక్కడ చేరిన భక్తజనమంతా మీరూ పాడండి అన్నారు.

అప్పుడు మట్టికల్లు బసప్ప నుంచి నేర్చుకున్న రెండు పదాలు పాడాను.

మొదటిది:

హుట్టి బందె యల్లమ్మనాగి
నిన్న మదువెయమాడి
కొట్టారవ్వ జమదగ్నిగె
నిమ్మ తందె రేణుక రాజ
నిమ్మ తాయి భోగవతి
అవరొట్టెయల్లి హోకి
తూగ్యారె తొట్టిలల్లి

-అనే పాటను పాడాను.

జోగమ్మలలో జనరంజకమైన పాట ఇది.

జోగమ్మలందరూ ఈ పాటలు పాడుతారు.

కాళవ్వ చాలా చక్కగా పాడేది.

ఈ పాటను పాడిన తరువాత-

అక్క కేళె కరె హులిగమ్మ
చిక్క బాలరాడిద మాతు



బాలన్న మాడి సలువన్నమ్మ

–అనే పాట పాడాను.

తరువాత బసప్ప చాలా ఇష్టంగా ప్రజాభిమాన కార్యక్రమాల్లో పాడుతున్న పాట:

నిల్లె ఇంద్రమ్మ శుభవాణి నిన్నత్తిర

కరెద ఓడి ఓడి బారమ్మ

బడవర బడ్డి, సాల మనన మాడిసిదెమ్మ

గండ సత్త హెంగసరిగెల్ల సంబళ మాడిదెమ్మ...

– అనే పాట పాడాను.

జనం సంతోషంతో చప్పట్లు కొట్టారు.

నా గురించి ఆందరూ చాలా బాగా పాడుతుందని మాట్లాడుకున్నారు.

నన్ను ఎంతో మెచ్చుకున్నారు.

ఆ కారణంగా నాకు ఒక ఆలోచన వచ్చి భజన సంఘం వాళ్ళను కలుపుకుని 'యల్లమ్మ కథ' చెప్పడం మొదలుపెట్టాను.

కథ చెప్పేటప్పుడు మధ్యమధ్యన తలమీద నిండు చెంబు పెట్టుకుని నృత్యం చేసేదాన్ని. ఇది చూసి భజనవాళ్ళు చిన్న కలశం, దానికొక కొబ్బరికాయ, జాకెట్టుగుడ్డ తెచ్చిచ్చారు. నేను ఆ కలశాన్ని అలంకరించాను. కొబ్బరికాయనే దేవతామూర్తిగా చేశాను. అప్పట్లో నాకు కలశం కొనేటంత డబ్బులు లేవు. అలాంటప్పుడు యల్లమ్మ విగ్రహాన్ని చేయించుకోవడం ఊహించలేని విషయం.

ఈ రోజు నాదగ్గర ఉన్న కలశం, యల్లమ్మ విగ్రహం మామయ్య గాందెమ్మ ఇచ్చినటువంటివి.

ఆ రోజు కొబ్బరికాయ పెట్టిన కలశం తలమీద పెట్టుకుని నృత్యం చేశాను.

అది చూసిన జనం గింజలు, ధాన్యం, కూరగాయలు, కందిబేడలు, డబ్బు ఇచ్చారు.

నాలుగైదు రోజులు ఊళ్ళోని వేరు వేరు వీధుల్లో కార్యక్రమాలు చేశాను.

భిక్షం వచ్చింది.

డబ్బు తప్ప, అన్నీ బావ ఇంటికి తెచ్చి వేశాను.

డబ్బు మాత్రం నేనే దాచిపెట్టుకున్నాను.

డబ్బు కూడబెట్టి చీర, జాకెట్టు కొనుక్కున్నాను. బావ మాత్రం చీర కొనలేదు.

అతని ఇంట్లో కాస్త చోటిచ్చాడు కదా, అదే చాలని అనుకున్నాను.

ఇలాగే జీవితం సాగుతూ ఉంది. ఎందుకని అడగకుండా, చెప్పకుండా మా బావ ఇంటివాళ్ళు నామీద రుసరుసలాడసాగారు. ఇలా నా మీద జనం కోపగించుకోవడం, నన్ను ఊరకూరకే తిట్టడం, నా మీద విసుగుపడటం, కారణం లేకుండా ఉన్నట్టుండి దూరం కావడం– నాకేమీ కొత్తకాదు.

నా జీవితం చూసి నా తల్లితండ్రులే విసుగు చెందారు. ఇక ఇతరులు విసుగు చెందకుండా ఉంటారా? అనే వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకున్నాను. అయినా అక్కా–బావ ప్రవర్తన చూసి బాధ కలిగింది. ఇలా మూడు రోజులు గడిచాయి. ఆ మూడు రోజులు నేను వాళ్ళింట్లో భోజనం చేయలేదు. ఇంట్లో వాళ్ళు భోజనాలకు పిలవలేదు. నేను వెళ్ళి అడిగి భోజనం పెట్టించుకుని చేసేదాన్ని కాదు.

ఒక రోజు బస్టాండు దగ్గరికి వెళ్ళి కూర్చున్నాను.

అక్కడున్న కుర్రవాళ్ళు కొందరు నన్ను వెక్కిరించడం మొదలుపెట్టారు. కుర్రవాళ్ళ అలాంటి ప్రవర్తన చూస్తే నాకు ఒళ్ళు మండిపోయేది. ఇప్పటికీ అంతే. జాతర, సంతలలో నన్ను వెక్కిరించి, చెడుగా మాట్లాడి ఎంతోమంది నా చేత దెబ్బలు తిన్నారు. ఎందుకంటే నేను మగవాడ్నయినా కేవలం మగవాడినే కాదు. ఆడదాని వేషం వేసుకున్న మగవాడిని. ఆడది ఆడదిలాగే జీవితం గడపాలన్నది నా అభిప్రాయం. అంతే కాకుండా నేనెమైనా తప్పు చేస్తే జనం నన్ను నీచమైన దృష్టితో చూస్తారని నా అభిప్రాయం. జోగమ్మగా మారిన తరువాత మొదటి రోజు నుంచీ ఈ భావన నాలో ఉంది. ఈ రోజుకూ దాన్ని పాటిస్తూ వస్తున్నాను.

ఆ రోజు బస్టాండులో నేనొక్కదాన్ని కూర్చుని ఉండటం చూసి కుర్రవాళ్ళు వెక్కిరించారు.వాళ్ళను తిట్టాలని, బుద్ధి చెప్పాలనే ఆలోచన నాకు రాలేదు. అలాగని వాళ్ళ వెక్కిరింపులు భరించే మనస్థితి నాలో లేదు. కొద్దిసేపటి తరువాత ఆ కుర్రవాళ్ళ ప్రవర్తన మరీ శృతి మించింది. అందువల్ల బస్టాండు దగ్గర్లోనే ఉన్న శ్రీసూళెకల్లు విరపణ్ణగారి ఇంటి దగ్గరికి వెళ్ళాను. అక్కడ ఎలాంటి కోతిచేష్టలు చేసే కుర్రవాళ్ళు వచ్చేవాళ్ళుకారు. అలాంటి వాళ్ళను ఆయన భరించేవారు కాదు. అది నాకు ముందుగానే తెలుసు. ఈ సందర్భంలో తగిన స్థలం అదేనని అనుకుని నేను అక్కడికి పోయాను.

అక్కడ జరిగిందే వేరు.

నేను ఊహించలేకపోయాను.

వాళ్ళు తమ పాతయింటి పక్కన కొత్త ఇల్లు కట్టుకున్నారు.



ఆ రోజే ఆ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఉంది. అప్పుడు నన్ను భోజనానికి పిలిచారు. నేను ఏమీ మాట్లాడకుండా వెళ్ళి భోజనానికి కూర్చున్నాను. మొదట్లో వద్దు అందామనుకున్నాను. అయితే కడుపులోని ఆకలి బాధ ఆలస్యం చేయకుండా 'వద్దు' అనే మాటను అడ్డుకుంది. అప్పుడు ఆయన కొడుకును నాతోపాటు కూర్చోబెట్టి భోజనం పెట్టారు. వారి ప్రేమను చూసి ఏడ్చేశాను. నాకు తెలియకుండానే కన్నీళ్ళు వచ్చేశాయి. ఆ సమయంలో కలిగిన ఆకలి, అంతేకాకుండా ఎవరూ లేని ఊళ్ళో, అక్కా-బావలు కోపగించుకోవడం, ఏ మాత్రం సంబంధం లేనివారు ప్రేమను చూపించడం వీటన్నిటివల్ల నాకు తెలియకుండానే కన్నీళ్ళు వచ్చాయి.

ఇలా ఏడ్వటం చూసి వాళ్ళంతా కంగారుపడి, ఎందుకు? అని అడిగారు.

అప్పుడు జరిగిన సంఘటన చెప్పాను.

దానికి వాళ్ళు, "చూడు మంజమ్మ, నువ్వు ఈ ఊళ్ళో ఉన్నంత వరకు ఏడ్వకు. నీకు ఆకలి వేస్తే మా ఇంటికి రా. మా ఇంట్లో ఒక రొట్టెలో నేను సగం, నీవు సగం తిందాం. మాకు ఉన్న నలుగురు మగపిల్లలలో నిన్ను చేర్చుకుని అయిదుమంది, మాకున్నది ఒక కూతురు కాదు, ఇద్దరు కూతుళ్ళమని అనుకుంటాం" అని అంటూ యజమానురాలు సుశీలమ్మ అంది.

ఆ మాటలు విని మరింత దుఃఖం పొంగుకు వచ్చింది.

తమ ఇంటి పిల్లలతో నన్ను కలుపుకుందామె.

అంతేకాదు కొడుకుగా, కూతురుగా, మగవాడిగా, ఆడపిల్లగా నన్ను స్వీకరించింది.. నాలో ఉన్న స్త్రీ-పురుష స్థానాన్ని నాకు ఇచ్చింది. నన్ను బాగా అర్థం చేసుకుని చెప్పిన మాటలవి అని అనుకున్నాను. నా తల్లితండ్రులు, బంధుబలగం వాళ్ళెవరూ ఈ విషయాన్ని అర్థం చేసుకోలేదు. దేవుడు అలాంటి బుద్ధి ఎవరికీ ఇవ్వలేదేనని అనిపిస్తోంది. అది నా సమస్య కాదు. వారి అవగాహన లోపం. శ్రీమతి సుశీలమ్మ 1987లో నాలో ఉన్న స్త్రీత్వాన్ని, నా దేహనిర్మాణంలో ఉన్న మగవాడిని గుర్తించి అర్థం చేసుకుని, కొడుకుగా, కూతురిగా అభిమానించి చెప్పిన మాట అది.

అలాంటి ఆభిమానాన్ని, ప్రేమను నేను కోరుకుంటున్నాను.

నేను మాత్రమే కాదు.

నాలా మారిన వాళ్ళు కూడా ఈ ప్రేను కోరుకుంటున్నారన్నది నా దృఢమైన అభిప్రాయం.

మగజోగమ్మను ముట్టడానికే కాదు, కనీసం మగజోగమ్మలతో మాట్లాడటానికి కూడా సంకోచించే కాలమది. ఈ రోజు అలాంటి మనోభావం తగ్గింది. సుప్రీం కోర్టు తృతీయలింగులను/ థర్డ్‌జెండర్ వారిని మనుష్యులుగా చూడాలని చెప్పింది. ఇది గొప్ప తీర్పు. ఇది తృతీయలింగుల / థర్డ్ జెండర్‌ల పోరాటానికి లభించిన విజయం. నేను ఈ పోరాటంలో స్వయంగా పాల్గొనలేదు. కానీ టి.వీ.లో వస్తున్న వార్తలను చూసి సంతోషపడ్డాను. ఇలాంటి సంతోషాన్ని ఆ కాలంలో శ్రీమతి సుశీలమ్మగారి నుంచి అనుభవించాను. అందువల్ల ఆ మహిళకు ధన్యవాదాలు. ఈ రోజు ఆమె పిల్లలు గొప్ప గొప్ప ఉద్యోగాల్లో ఉన్నారు. అయినా వాళ్ళు నన్ను చూసుకోవటంలో ఎలాంటి మార్పు లేదు. నేనూ అంతే. ఇంటి కొడుకుగా, కూతురుగా నడుచుకుంటున్నాను. అందరూ ఇలాంటి ప్రేమను పంచితే, మమ్మల్ని మనుష్యులుగా భావిస్తే ప్రత్యేకమైన చట్టాలు అవసరమా?

చూడండి, దేవుడు కొన్నిసార్లు సంబంధాలను దృఢపరుస్తూ, పెంచుతూపోతాడు. ఒక్కొక్కసారి సంబంధాలను పోగొడతాడు. అందుకే దేవుడిని పెద్దవాళ్ళు, "నువ్వు ఒక ఆటగాడివి" అంటారు. ఆ రోజుకన్నా మూడురోజులకు ముందు అక్కా-బావల సంబంధం పోగొట్టుకున్నాను. అయితే శ్రీమతి సుశీలమ్మగారి కుటుంబం నన్ను కలుపుకుంది. నన్ను మా ఇంటి నుంచి బయటికి తోసినపుడు శ్రీమతి రాధమ్మ నాకు తల్లి అయ్యింది. ఇదొక విచిత్రమైన విధివిలాసం కాదా?

ఇలా ఉండగా ఒకసారి వాళ్ళింటికి పారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్న అధికారి వచ్చారు. ఆయన నా కథ విని నా జీవితానికి ఆసరా అయ్యారు. మా పిల్లలకు ట్యూషన్ చెప్పుకుంటూ మా ఇంట్లోనే ఉందువు రమ్మని చెప్పి నన్ను పిల్చుకునిపోయారు. తమ కోసం ఇచ్చిన క్వార్టర్స్‌లో ఒక గది ఇచ్చారు. ఆ ఇంటి మహిళ టైలరింగ్ చేస్తూవుండేది. ఆమె నాకు టైలరింగ్ నేర్పింది. ఈ రోజు నా బట్టలను నేనే కుట్టుకుంటాను.

నేను అప్పుడు ట్యూషన్ క్లాసులు కూడా ఆరంభించాను. ఒకటవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు ట్యూషన్ చెప్పేదాన్ని. అప్పుడు జీవితం కొంచెం నెమ్మదిగా అనిపించింది. అప్పట్లో నేను చదువుకోవటానికి నా దేహం, నా మనస్సు సహకరించలేదు. చదువుకునే పిల్లలకైనా విద్య నేర్పుతున్నానుకదా అని చాలా ఆనందపడ్డాను. అలా రెండు నెలలు గడిచివుంటాయి. ఆ పారెస్ట్ అధికారికి హఠాత్తుగా బదిలీ అయింది. అప్పుడు నేను ఆ ఇంటిని వదలవలసి వచ్చింది. కొత్తగా వచ్చిన అధికారులు తమ ప్రభుత్వ క్వార్టర్స్‌లో మాలాంటివారిని ఎవరు పెట్టుకుంటారు?

అందువల్ల నెలకు నలభై రూపాయలు పెట్టి ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నాను.

అప్పటి నుంచి భిన్నమైన జీవితం ఆరంభమైంది.

(తరువాయి వచ్చే సంచికలో...)

రాజేంద్ర సింగ్ బైస్ ఠాకూర్
9885722196

చర్యా పదాలు- ఒక పరిశీలన



అనువాదం : ముకుంద రామారావు
పుటలు : 160, వెల : రు. 99/-
ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ గవర్న మెంట్ సృజనాత్మకత & సంస్కృతి సమితి, అమరావతి, విజయవాడ - 2 ఆంధ్రప్రదేశ్
సెల్ : 9440559575

పేరు కొత్తగా అనిపించే ఈ గీతాలు 10-12 శతాబ్దాల మధ్య కొంతమంది బౌద్ధ సిద్ధ ఆచార్యులు మహాయాన తాంత్రిక పూజల్లో పాడడానికి రాసినవి. 1907లో నేపాల్ రాజ గ్రంధాలయం లోని ఈ తాళపత్ర గ్రంథాన్ని పండిత హరిప్రసాద శాస్త్రి వెలికి తీశారు. ముకుంద రామారావు తెలుగులోకి అనువదించారు. రామారావుగారు వృత్తిరీత్యా ఇంజనీర్ అయినా ప్రవృత్తిరీత్యా కవి, అనువాదకుడు, పరిశోధకుడు. వీరికి కవిత్వం మీద ఎంత ప్రేమంటే తెలుగులో రాయడంతో తృప్తిపడక అనేక భారతీయ, విదేశీ భాషల లోని కవిత్వాలను అనువాదం చేయడం మొదలు పెట్టారు.

చైనా, జపాన్, కొరియా, హీబ్రూ, అరబ్బీ లాంటి అనేక భాషలనుండి సేకరించిన కవిత్వాన్ని తెలుగులోకి అనువాదం చేశారు. "దేశం నుండి దేహం దాకా" అంతా వీరి ఇష్ట వస్తువులే. అనేకమంది నోబెల్ గ్రహీతల రచనలను అనువదించారు.

ఎంతో క్లిష్టమైన బౌద్ధ ఆచార్యుల రచనలను అర్థం చేసుకుని అనువదించే సాహసోపేతమైన ప్రయత్నం చేసారు.

భావగాంభీర్యంతో కూడిన ఈ గీతాలు పైకి మామూలుగా కనిపిస్తూనే, ఆధ్యాత్మిక అగాధాలను తరచి చూస్తాయి. పాటక జనం నృత్యం చెయ్యడానికి అనువుగా వుండే ఈ సంగీతాలు, సాధకులకు తత్వబోధ చేసే సద్గురు ప్రవచనాలు. మంత్రం, ధ్యానం వల్ల కాక సంయమనంతో, గురు ఉపదేశంతో నిర్యాణం పొందవచ్చంటాయి.

చర్యా గీతం -1

కేవలం అయిదు కొమ్మలున్న శ్రేష్టమైన చెట్టు ఈ దేహం
చంచల మనస్సులోకి కాలం ప్రవేశిస్తుంది.
మహా సుఖ పరిమాణాన్ని బలపరచుకో
గురువునుండి అడిగి నేర్చుకో అంటాడు లుయిపా.
ధ్యానాలన్నిటిని ఎవరైనా ఎందుకు చేస్తారు
సుఖంలోనో దుఖంలోనో మరణం నిశ్చయం.
ఎప్పటికప్పుడు పడే బేడీల ఇంద్రియ సుఖాల్ని వర్జిస్తూ
శూన్యం రెక్కల్ని హత్తుకో.
ఉచ్ఛ్వాస నిశ్వాసాల రెండు పీఠాల మీద కూర్చున్న
ధ్యానంలో దీనిని గమనించా నంటాడు లుయిపా.

1వ పంక్తి : పంచేంద్రియాల శరీరం.

2: పుట్టుకనుండి మరణం వరకు ఉన్న కాలం (దేశ కాలాలకు పరిమితమైన జీవం).

3: జీవిత లక్ష్యమైన నిర్వాణం పొందాలన్న కోరికను బలపరచుకో.

4: గురువు మార్గదర్శనం అనుసరించు.

5,6:సుఖదుఃఖాల జీవితంలో మరణం తప్పదు కాబట్టి ధ్యానం చెయ్యి.

7: ఇంద్రియ సుఖాలు ఆధ్యాత్మిక మార్గానికి బేడీలు / అడ్డంకులు.

8: అంతిమ లక్ష్యమైన (బౌద్ధ) శూన్యం / నిర్యాణం అందుకో.

9, 10: జీవితంలో కష్టసుఖాలను అనుభవించి తెలుసుకున్న సారమిది.

1-10: ఇంద్రియ నిర్మితమైన భౌతిక శరీరం కాల ప్రవా హంలో నశించి పోయేదే. కాబట్టి ఇంద్రియ సుఖాలకు లొంగిపోక, జ్ఞాని అయిన గురువు మార్గదర్శనంతో అంతిమ లక్ష్యమైన నిర్యాణాన్ని చేరుకో.

చర్యా గీతం -2

తాబేలు (పొదుగు) పాలు ముంతలో పట్టలేము
చెట్టునుండి చింతపండు మొసలి తింటుంది
ఓ చదువుకున్న స్త్రీ, విను, ఇంటివైపు పెరడు ఉంది
అర్ధరాత్రి దొంగ, చెవి పోగులు దొంగిలించాడు
మామ నిద్ర పోయాడు, కోడలు మేల్కొనుంది
దొంగిలించిన చెవి పోగులు ఎక్కడ దొరుకుతాయి?
పగలు కోడికూతకు కోడలు భయ పడుతుంది
రాత్రి కాముక శృంగారానికి పోతుంది
కుక్కురిప ఎంత లోతైన చర్యాని గానం చేశాడంటే
లక్షల్లో ఏ ఒక్కడో దాన్ని అర్థం చేసుకోగలడు.

1 వ పంక్తి : తాబేలు (పొదుగు) విషయ వాంఛల ప్రతీక. వాటిని పట్టి అధీనంలో ఉంచుకోవడం వీలు కాదు.

2: శరీరం నుండి పుట్టిన వాంఛ (లోకంతీరు) అనేది పట్టు వదలని మొసలి కాటు లాంటిది.

3: ఆలోచన కలిగిన వారికి కూడా లోపల భౌతిక కోర్కెలు ఉంటాయి.

4: విని నేర్చుకున్నదంతా అజ్ఞానమనే దొంగ దొంగిలించాడు.

5: విజ్ఞత నిద్రపోయింది, కోరికలు మేలుకున్నాయి.

6: పోయిన జ్ఞానం మళ్ళీ తిరిగి పొందడం ఎలా?

7: జ్ఞానానికి అజ్ఞానం భయపడుతుంది.

8: అజ్ఞానం ఇంద్రియాలకు లొంగిపోతుంది.

(...తరువాయి 48 వ పుటలో)

కథానిక

దాసరి శివకుమారి
9866067664

మందార మకరందాలు

> "ముందుగా మనం వచ్చేస్తే
> ఆ తర్వాత మన పిల్లలు వస్తారు.
> వాళ్లకోసం వాళ్ల పిల్లలూ వస్తారు. అలా అందరూ ఇండియా
> వేపు తొంగి చూస్తారు. ఎంత పరాయి గడ్డమీద వుంటున్నా
> మన రక్తంలో వున్న ప్రేమలూ, అనుబంధాలూ
> ఎలా మాసిపోతాయండీ?"

"అన్నయ్య ఎక్కడికెళ్లాడొదినా?"

"మా అన్నయ్య వచ్చిన ప్రతిసారీ గుంటూరు మెడికల్ కాలేజ్‌కెళ్లి పేథాలజీ క్లాసులు తీసుకుంటారుగా. అలాగే ఈసారి వచ్చీరాగానే వాళ్లు వచ్చి ఇంతకు ముందే తీసుకెళ్లారు. తిరిగి వచ్చేప్పటికి సాయంత్రమవుతుంది తులసీ.

"ఇంత వయసొచ్చి కూడా అన్నయ్య ఇంకా అమెరికా క్లాసులు చెప్తూనే వున్నాడు. అది చాలక ఇక్కడికొచ్చిన ప్రతిసారీ తను చదువుకున్న మెడికల్ కాలేజీ అంటూ గుంటూరెళ్లి రెండు మూడు క్లాసులన్నా తీసుకుంటాడు. అన్నయ్యకు విసుగనేదీ, అలసటనేదీ వుండదా?"

"నాకదే ఆరోగ్యమంటారు తులసీ, అమెరికాలో కూడా రోజూ లోకల్ ట్రెయిన్‌లో దిగి, నడుచుకుంటూనే మెడికల్ కాలేజీ కెళ్తారు." అని మరుద్వతి చెప్తూ వుండగానే వీళ్ల దగ్గరి బంధువైన లలిత వచ్చింది.

"ఇవ్వాళ గురువారం కదా. సాయంకాలం హారతి టైమ్‌కల్లా మనం ముగ్గురం బాబా గుడి దగ్గరకెళదాం. నువ్వూ తులసీ కూడా రండి మరుద్వతీ. గుడీ, పూజా చూద్దురుగాని. పైగా అక్కడ నలుగురూ కలుస్తారు" అన్నది.

"మరుద్వతి వదినొస్తే అలాగే వెళ్దాం లలితొదినా అన్నది ఆడపడుచు తులసి.

సాయంకాలం బాబా గుడిలో హారతి సమయానికి ఒక్కొక్కరే రాసాగారు.

"గుడి ఆవరణ బయటకీ అందంగా కనుపిస్తున్నది. బాగా విశాలంగా కూడా వున్నది. గుడి గోడకు కుళాయిలూ, ఒక వారగా పంపూ అన్నీ వున్నాయి. మొక్కలూ, చెట్లూ కూడా దట్టంగా పెరిగి కనపడుతున్నాయి. మొత్తానికి ఆహ్లాదంగా కనపడుతున్నది".



"అవును, మరుద్వతీ, సౌకర్యాలకు, సౌకర్యాలూ వున్నాయి. బాగా ప్రశాంతంగా, హాయిగా కూడా వుంటున్నది. పూజా సామగ్రి అంతా కూడా ఇక్కడే కొనుక్కోవచ్చు. నేనీ మధ్య తరచూ వచ్చి నలుగురితో మాట్లాడు తున్నాను. 8 గంటలదాకా వుండి పల్లకీ సేవ కూడా చూసుకుని మరీ ఇంటి కెడుతున్నాను. మీరిద్దరూ ఇక్కడే వుండండి. పూజా టిక్కెట్లు కొని తెస్తాను. అవి తీసుకుని లోపలికెళదాం".

"ఫరవాలేదు లలితా మేమూ నీతో వస్తాం నడువు".

"ఏ టికెట్లివ్వమంటారమ్మా? ఏ.టి.నే కదా? పీ.టి.లు కూడా కావాలా? ఈ పూట ఏవి టికెట్లు వుండవు."

మరుద్వతీ, తులసీ తెల్లబోయారు. "ఏ.టి.ఏంటి? పీ.టి.ఏంటి? ఏ వీ దొరక్క పోవటమేంటి?" అనుకున్నారు.

"అర్చన టికెట్లే మూడివ్వండి. ప్రసాదం టికెట్లు రెండివ్వండి. ఈసారి పొద్దున్నే వచ్చినప్పుడైనా అభిషేకం టికెట్లు తీసుకుంటాంలే'' అంటూ లలిత డబ్బులు తీసి ఇచ్చింది.

"ఏం బాబూ? అర్చన టికెట్‌ను ఎ.టి. అనీ ప్రసాదం టికెట్‌ను పీ.టీ. అని అంటు న్నావా? ఎబి అంటే అభిషేకం టికెట్టా?"

"అవునండీ. ఇప్పుడన్నీ షార్ట్ కట్లే కదా? నేను తిరుపతి వెళ్లినప్పుడు అక్కడ టికెట్ కౌంటర్‌లోని వ్యక్తి ఇలాగే షార్ట్‌కట్‌లో అడగటం విన్నాను. నాకు బాగుందని పించింది. అప్పట్నుంచీ నేనూ మొదలు పెట్టాను".

"ఈ పేర్లకు మేం అలవాటు పడి పోయాం మరుద్వతీ'' అంటూ నవ్వింది లలిత.

"చూడుబాబూ! వాళ్లెవరో అన్నారని నువ్వూ అనొద్దు. అసలు తిరుపతిలాంటి పెద్ద దేవాలయాల్లో తెలుగు ప్రాంతంలో అలా మాట్లాడకూడదు. అలాగయితే తెలుగు భాష చచ్చిపోతుందయ్యా. పరాయి దేశాల్లో వుండే వాళ్లం అచ్చ తెలుగు మాట్లాడేవాళ్లకోసం మొఖం వాచిపోయి వుంటాం. ఇక్కడకొచ్చి ఇలాంటి మాటలు వింటుంటే ఏడుపొస్తుంది. నువ్వే ఇలా మాట్లాడుతుంటే అది విని నీ పిల్లలు తెలుగుభాషను ఇంకా కుదించి వేస్తారు. అమ్మభాషను బతికించుకుందా మయ్యా. దయచేసి పూర్తిగా తెలుగులోనే మాట్లాడు".

"అయ్యో? అమ్మా, మీరు హైదరాబాద్ లాంటి పెద్ద ఊళ్లకు వెళ్లినప్పుడు లాల్‌బహదూర్ నగర్‌కెళ్లాలంటే కాబ్‌వాడు తెల్ల ముఖం వేస్తాడు. యల్.బి.నగర్‌కెళ్ళాలంటేనే 'సమఝ్‌హై' అంటాడు. టాగూర్‌రోడ్ అనో, మహాత్మాగాంధీరోడ్ అనో అన్నారంటే 'పతానై' అంటాడు. టి.రోడ్‌అనో, యమ్.జి.రోడ్ అనో, అడిగారంటే హా.హా.చలీయే' అంటాడు. ఇంకా ఏ కాలంలో వున్నారమ్మా మీరు? అంతా శరవేగంగా దూసుకుపోయే రోజులు ఇవి.

పరాయి దేశాన్నుండి వచ్చారంటున్నారుగా. పగటి పూట ఈ గుడివాళ్లే నడిపే 'సరస్వతీ శిశు కుటీర్' కు రండి. ఇక్కడున్న రెండు మూడు కాలనీల పిల్లలు ఇంగ్లీషు ఎంత బాగా నేర్చుకుంటున్నారో చూద్దురు గాని. మేం తెలుగు పద్యాలూ, తెలుగు పాటలూ నేర్పటం లేదు. అవి మాకే సరిగ్గా గుర్తులేవు. నేనైతే ఇంగ్లీషు రైమ్స్ రిధిమిగ్గా పాడి వినిపించి, మరీ నేర్పిస్తున్నాను. మిగతా వాళ్లొ ఇంగ్లీషులోనే పాఠాలు చెప్తున్నారు." అన్నాడు గర్వంగా.

''అయ్యో? మన తెలుగుభాషలో మంచి శతకాలూ, నీతి పద్యాలు వున్నాయి కదయ్యా. పిల్లలు మాట్లాడే భాషలోని పద్యాలూ, పాట లూ మీరు నేర్పిస్తే వాళ్లూ ఎంతో ఇష్టంగా నేర్చుకుని పాడుకుంటారు కదయ్యా. ఆ పుస్తకాలు నేనే కొని తీసుకెళ్లి అమెరికాలో నా మనవళ్లకూ మనవరాళ్లకూ నేర్పాను. తెలి సిన మన తెలుగువాళ్ల పిల్లల పుట్టిన రోజు లకూ ఇవే కానుగ్గా ఇస్తున్నాను".

వీళ్లలా మాటల్ల వుండగానే లోపల హారతి గంటలు మోగాయి. అతనూ, అతని తోపాటు వీళ్లు ముగ్గురూ చప్పున గుడి లోపలికెళ్ళారు.

"అన్నయ్యా. వీరు సత్యనారాయణ గారనీ ఇక్కడే వుంటున్నారు. వీరు కట్టించిన గుడి ముఖ్యంగా గుడికానుకుని వున్న కళ్యాణ మంటపం మధ్య తరగతి వాళ్లకు బాగా ఉపయోగంగా వున్నది. 'సరస్వతీ శిశు కుటీర్' అనే స్కూలు కూడా పెట్టి పిల్లలకు చదువు చెప్పిస్తున్నారు. మిగతా ముగ్గురూ కూడా మన ఊరివాళ్లే. నీకు గుర్తుతగుల్తా రేమో చూడు" అన్నాడు రామం.

''గోపాలం, సుందరమే కదరా'' అన్నాడు ఈశ్వర్రావు చిన్నగా నవ్వుతూ.

వాళ్లూ ఈశ్వర్రావు నవ్వుతో శృతి కలిపారు.

"ఈశ్వర్రావుగారూ! ఆ బాబా దయ వలన నేను చేసే వ్యాపారాలన్నింటిలో లాభాలే వస్తున్నాయి. సంపాదించినదంతా నా సంతానానికే కాకుండా, సమాజానికి కూడా కొంత ఉపయోగిస్తే నా మనసుకు సంతృప్తిగా వుంటుంది. కొద్ది మంది భక్తులు స్వచ్ఛందంగా ఇచ్చిన దానిని మాత్రమే ఇప్పటి వరకూ తీసుకుంటున్నాం. గుడీ, బడీ, నడుపు తున్నాం. ఫర్వాలేదు నడుస్తున్నాయి. అనాధలకు, కనీసం కొంతమందికైనా వృద్ధాశ్రమ మంటూ నడిపి కూడూ, గూడూ అన్ని ఇచ్చి, వాళ్ల వాళ్లు నిశ్చింతగా కడవరకూ గడిపే టట్లు చూడాలని నా కోరిక. చివరకు వాళ్ల అంత్యక్రియల బాధ్యత గూడా ఆశ్రమానిదే అన్నట్లుగా వ్యవహరించాలని ఆలోచిస్తున్నాను. ఎంత వరకు సాధ్యపడుతుందో చూడాలి. మాలాంటివారు పదిమందీ పది చేతులేస్తే ఆ పని అసాధ్యమేం కాదనీ అన్పిస్తున్నది. గుడిలో అమ్మే టికెట్ల ద్వారా వచ్చే సొమ్ము పూలకూ, పూజ సామగ్రికీ వినియోగిస్తున్నాం. భక్తులిచ్చే కానుకలు అంటే హారతిలో పెట్టే డబ్బు పూజారిగారే తీసుకుంటారు. అయినా రోజు రోజుకూ భక్తుల ఆదరణ పెరుగుతున్నది. ప్రతి గురువారం పేదలకు అన్నదానం, రోజూ రెండు పూట్లా నిత్య ప్రసాదాలకు బాగా సహకరిస్తున్నారు. ఇప్పుడు చేయబోయే పని బాగా ఖర్చుతో కూడుకున్నటువంటిది కావటంతో మీలాంటి వాళ్లను అడుగు తున్నాం" అంటూ సత్యనారాయణ గారు ఓపిగ్గా చెప్పుకొచ్చారు.

'మీ తమ్ముడు రామంగారు కూడా రెండు లక్షలు ఇస్తున్నారు'' అన్నాడు సుందరం.

ఇంతలో మరుద్వతి కాఫీలు తీసుకుని లోపలి నుంచి వచ్చింది. ఆమెను చూసి అందరూ గౌరవంగా లేచి నిలుచున్నారు. ఆమె చేతిలోని కాఫీ కప్పులు తీసుకుని రామం అందరికీ ఇచ్చాడు.

''అయ్యో ఎందుకు లేచారు?

కూర్చోండి, కూర్చోండి" అంటూ తనూ అక్కడే ఓ కుర్చీలో కూర్చున్నది.

"సరస్వతీ శిశుకుటీరం నడుపుతున్నారట గదా? చక్కని పేరు. అయితే అక్కడ చదువు అల, వల లాంటి పదాలతో మొదలు పెట్టటం లేదు. అలాగే సుమతీ శతకం, వేమన శతకం ఇంకా కొన్ని నీతి పద్యాలను నేర్పించండి. పిల్లలకు తెలుగు భాషంటే ఇష్టం కలిగేటట్లు, చూడండి. మన తెలుగులో ఎంతో గొప్ప సాహిత్య మున్నది. దాన్ని చదవాలంటే తెలుగు బాగా వచ్చి వుండాలిగా. తెలుగేరాని పిల్లలు ఇంకా సాహిత్యం జోలికేం పోతారు! "మందార మకరంద మాధుర్యమున దేలు" లాంటి పద్యాలలోని మాధుర్యాన్నేం తెలుసు కుంటారు? మన భాష గొప్పతనం ఎంతో విలువైన సాహిత్యం ఏదీ తెలియకుండా యాంత్రికంగా మిగతా చదువులు చదువు తుంటారు". అన్నది భావోద్వేగంగా.

ఈశ్వర్రావుకు భార్య మాటలు అనుభవమే కనుక మెదలకుండా ఊరుకున్నాడు. రామానికి వదిన మాటలు ముచ్చటగా అనిపించాయి. సత్యానారాయణ వాళ్లకు అమెరికాలో వుండే మనిషి నోటివెంట ఇలాంటి మాటలు అంటూ ఆశ్చర్యం కలిగింది.

నేను టీచర్లను పెట్టాను. జీతాలిస్తున్నాను. మిగతా విషయాలు మా ఆవిడ చూసుకుంటున్నది. అందరూ ఇంగ్లీష్ మీడియమ్ కోరుకుంటున్నారని మేం కూడా దానిమీదే శ్రద్ధపెట్టాం. ఇంత వివరంగా నేను ఆలోచించ లేదు. ఇకపై శ్రద్ధ పెడతాను. మీరు చెప్పిన శతకాలు తెప్పిస్తాను. తప్పకుండా పిల్లలకు నేర్పేటట్లు చూస్తాను" అన్నాడు సత్యనారాయణ.

మధ్యలో జోక్యం చేసుకుంటూ "సత్యనారాయణగారూ! మీరు చేసే పనుల గురించి కొంత విన్నాను. ఇప్పుడూ మీరు చెప్పారు. మేం హైద్రాబాద్ వెళ్లేలోపు నేనెంత ఇవ్వగలిగేదీ చెప్తాను. బాగా మంచిపనులు చేస్తున్నారు. మీరు మళ్లీ రానక్కర లేదు. మా రామం ద్వారా విషయం చెప్తాను" అన్నాడు ఈశ్వర్రావు.

"నా వంతుగా నేనూ వృద్ధాశ్రమానికి కొంత సాయం చేస్తానండీ" అన్న మరుద్వతి మాటలకు ఆశ్చర్యం కల్గినా, కప్పిపుచ్చుకుంటూ చిన్నగా నవ్వాడు ఈశ్వర్రావు.

"వెళ్లి వస్తామంటూ" వచ్చిన వాళ్లులేస్తే వాళ్లను గేటు దాకా రామం సాగనంపి వచ్చాడు.

"నేనూవెళ్తాను అన్నయ్యా, వదినా వస్తాను అంటూ రామం కూడా వెళ్ల బోయాడు.

"ఏం నీకూ ఏదన్నా పని వున్నదా?"

"కాస్త గ్రంథాలయం దాకా వెళ్లి రావాలి. అక్కడి పుస్తకాలు ఒక ఆర్డర్‌లో లేవు. రిజిస్టర్‌లో వున్న పుస్తకాలకూ, బీరువాల్లోని పుస్తకాలకూ పొంతన లేకుండా వున్నది. గవర్నమెంట్‌తో అయ్యేపని కాదులే అని మేం ఇద్దరం, ముగ్గురం పూనుకుని వాటిని కాస్త దుమ్ము దులిపి, ఒక ఆర్డర్‌లోకి తెస్తున్నాం.

"ఇప్పటి దాకా ఆఫీస్‌లో ఎకవుంట్స్ చూసి చూసి, ఇక్కడా మళ్లా చిట్టాలు చూసే పనిపెట్టుకున్నావా?"

"మన గ్రంథాలయంలో బోలెడు సాహిత్యమున్నది అన్నయ్యా. అందుబాటులో పెడితే కొందరైనా వుపయోగించుకుంటారు కదా అని మొదలు పెట్టాం."

"చాలా మంచి ఆలోచన రామం. ఇంకా ఏమేం పుస్తకాలు వుంటే బాగుంటుందో ఆలోచించి నాటికీ ఒక లిస్టు తయారు చేయండి. పోటీ పరీక్షలకు, నిఘంటువులు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలూ ఆలోచించండి. అలాగే పిల్లలకోసం బాల సాహిత్యాన్ని కూడా ఆలోచించండి. బాలల రామాయణం, భాగవతం, భారతం బొమ్మ లతో సహా వుండేటట్లు చూడండి. "బాల బంధు" బి.వి. నరసింహా రావుగారి పుస్తకాలు ఇంకా ప్రాచీన జానపద కథలు. శాస్త్రవేత్తల జీవితాలు ఇలా ఎన్నో వున్నాయి. ఇవన్నీ తెప్పించండి. వాటికి కావలసిన డబ్బు నేనిచ్చి వెళతాను. పద్యాలు, దేశభక్తి గీతాల పోటీలు పెట్టి పిల్లలకు చిన్న చిన్న బహుమతు లివ్వండి. అదంతా మనమే ఏర్పాటు చేద్దాం" అన్నది మరుద్వతి.

"అలాగే వదినా. నీ ఆలోచనలు చాలా బాగున్నాయి" అంటూ రాము వెళ్లిపోయాడు.

"ఏమిటి మరుద్వతీ? ఏవో కొత్తకొత్త ఆలోచనలు చేస్తున్నట్లున్నావు?"

"ఈ ఆలోచనలు ఎప్పటి నుంచో వున్నవేనండీ. అమలులోకి రావటానికే టైం పట్టింది. మనపిల్లలు పెద్దవాళ్లయ్యారు. వాళ్ల పిల్లలూ ఎదిగొస్తున్నారు. మీరేమో ఆ అమెరికా వదిలి రానంటారు. వైద్య విద్యార్థుల మధ్య గడపకుండా వుండలేనంటారు. ఇంకెప్పుడండీ! మనం మన గడ్డమీదుండేది! తెలుగు మాట్లాడే మన తెలుగువాళ్ల మధ్య గడిపి సంతృప్తితో వెళ్లాలని నాకు వుంటుంది. మనం ఇండియా వచ్చి అమెరికా తిరిగి వెళ్లేటప్పుడల్లా మీ అమ్మ మీ వంక ఎంత జాలిగా చూసేదో నాకు బాగా గుర్తున్నది. మనం ఆవిడ గదిలో ఎ.సి. పెట్టిస్తున్నప్పుడు అత్తయ్య ఏమన్నదో తెలుసా? "చల్లబడాల్సింది గది కాదమ్మా. మనసు, కన్న కొడుకూ, కోడలూ, ఎదురుగా వుంటే కదా మనసు చల్లబడేది. ఇంకా ఎన్ని కోట్లు సంపాదిస్తే వాడి మనసు తృప్తి పడుతుందో నాకర్థం కావటం లేదు. మేనకోడలి పెళ్లిక్కాని, మేనల్లుడి పెళ్లిక్కాని ఒక్కగానొక్క మేనమామగా తను లేదు. చివరకు మీ పిల్లల పెళ్లిళ్లూ ఇక్కడ చేయక పోతిరి. వాళ్లకు నచ్చిన వాళ్లతో అమెరికాలోనే పెళ్లిళ్లు అంటూ చేసేశారు. నా మనవరాళ్లకూ, మనవ ళ్లకూ 'నానీ' అంటూ ఓసారి పలకరించట మేకాని మరింకే మమ కారాలూ తెలీదు. వాళ్లను కట్టుకున్నవాళ్లకు వాళ్ల భాషలో నేనో ముసలిదాన్ని అంతే. విడ్డూరం కాకపోతే మరేంటి? అంటూ బాధపడ్డారు.

"నా చిన్నతనంలోనే మా నాన్నగారు పోయారు మరుద్వతీ. నన్నేమో చదువు కోసమని అక్క దగ్గరకు పంపేసింది. అందు కని నాకు అమ్మకంటే, అక్క దగ్గరే చనువె క్కువ. ఆ తర్వాత పీ.యూ.సీ. మెడిసిన్, గుంటూర్లో చదివాను. మళ్లీ వరంగల్‌లో పి.జి. చేశాను. తర్వాత పెళ్లీ ఉద్యోగం ఆ తర్వాత అమెరికా ప్రయాణం. అలా గడిచి పోయింది".

"ఆవిడ మనసెప్పుడూ మీ కోసం కలవరిస్తూనే వుండేదండీ. ఎప్పుడెప్పుడు మిమ్మల్ని చూస్తానా అని ఎదురు చూసేది. చివరకు చనిపోయి శవమై గుంటూరు మార్చు రీలో పడి వుండి మనకోసం, మనం అమెరికా నుండి వచ్చేదాకా పడిగాపులు వేసింది. ఆమె కెప్పుడూ ఎదురు చూపులు తప్ప లేదు పాపం" అంటుంటే మరుద్వతి గొంతు వణికింది.

తనెప్పుడూ చూడని మరుద్వతిని

ఇప్పుడు చూస్తున్నాను అనుకుంటూ ఈశ్వ ర్రావు ఆలోచనల్లో పడ్డాడు. "తనని అమెరికా అమెరికా నుండి వచ్చేయమని తల్లి అనేది కాని మరుద్వతి ఎప్పుడూ పట్టుపట్టలేదు. తమ పిల్లలు అక్కడే పెరిగి పెద్దవాళ్లయ్యారు. వాళ్ళిక్కడకొచ్చి వుండలేరు. తనే రాలేక కేవలం ఇండియాకు అతిథిగా మాత్రమే వచ్చి పోతున్నాడు".

"నేనిందాక చెప్పినట్లుగా మీరే కాదు, నేను కూడా కొడుగ్గా ఆమెకేమి చెయ్యలేక పోయాను. దూరపు బంధువుల సంరక్షణలో వదిలేసి చేతులు దులుపుకున్నాను. ఇందాక వాళ్లు అనాథ వృద్ధ శరణాలయం గురించి చెప్పారు. ఇది మన ఊరు. మన వాళ్ల ఆత్మలు ఇక్కడే ఐక్యమైపోయాయి. అత్తయ్య పేరుతో ఆ వృద్ధాశ్రమాన్ని మనమే కట్టించి ఇస్తే బాగుంటుంది. ఆలోచించండి. అలా అంటూ ఆమె ఆత్మకు శాంతి, మన మనస్సులకు తృప్తి కలుగుతాయేమో చూద్దాం".

ఆమె ఆత్మకు శాంతి, మన మనస్సు లకు తృప్తి కలుగుతాయేమో చూద్దాం."

"నీకంత కోరికైతే అలాగే చేద్దాం మరుద్వతీ".

"అచ్చం నా కోరికే కాదండీ. నా కోరి కలో అత్తయ్య ఆశలు కూడా వున్నాయి. బీదా బిక్కీ అంటే ఆమెకు చాలా ఇష్టం. వాళ్లపట్ల ఎంతో దయగా వుండేది. అత్తయ్యకింకో మంచి అలవాటు కూడా వున్నది. రోజూ స్నానం చేసి రాగానే రామాయణంలోదో, భారతంలోదో లేదా భగవద్గీతా శ్లోకాలైనా సరే, కొన్నింటిని చదివి ఆనందపడేవాళ్లు. ఆమె కోరికకు తగ్గట్లుగా ఆ పుస్తకాలు తెప్పించి ముఖ్యంగా పిల్లలకు అర్థమయ్యే వాటిని అందుబాటులో వుంచే ప్రయత్నం చేద్దాం. ఇలాంటి పనులు చేస్తేనయినా ఆమెకు సంతోషం కల్గించిన వాళ్లమవుతానే మోనని చిన్న ఆశ"

వయసు రీత్యా బలహీనమైన ముఖం లో మెరిసే కళ్లతో చెప్పే మరుద్వతి మాటలు వినసొంపుగా ఈశ్వర్రావు మనస్సుకు మరు వంపు వాసనలాగా తాకింది.

కొద్దిరోజుల్లోనే మరుద్వతి ఆర్థిక సహా యంతో ఊరిగ్రంథాలయంలో తెలుగు ప్రాచీన ఆధునిక సాహిత్యంతోపాటు పిల్లలకూ యువతకూ కావల్సిన పుస్తకాలు దర్శన మిచ్చాయి.

సరస్వతీ శిశు కుటీరంలో ప్రతి విద్యార్థీ శతక పద్యాలు వల్లెవేస్తూ తెలుగులో దేశభక్తి గీతాలు పాడుతున్నాడు. బాబా గుళ్లో సూపర్ వైజరు పి.టీ.అనీ, డి.టీ అని అన కుండా కట్టడి చేశారు. ఈశ్వర్రావు తల్లి అయిన రామ చంద్రమ్మ అనాథ వృద్ధాశ్ర మానికి మరుద్వతి దంపతులు శంకుస్థాపన చేశారు. సత్యనారా యణ, రామం మొదలగు వారంతా అన్ని రకాల సహాయం అందించ టానికి నడుం కట్టారు. "మరుద్వతీ! నీకు ఇండియా వచ్చేసి ఇక్కడే వుండిపోవాలన్న కోరికే వుంటే అలా ప్లాన్ చేద్దామా! అయితే పిల్లలెవరూ మన కంటికి కనపడరన్న బెంగ కలుగుతుంది. ఇలాంటి బెంగే మా అమ్మ మనకోసం పడిందని నాకిప్పుడు బాగా అర్థ మయింది".

"ముందుగా మనం వచ్చేస్తే ఆ తర్వాత మన పిల్లలు వస్తారు. వాళ్లకోసం వాళ్ల పిల్లలూ వస్తారు. అలా అందరూ ఇండియా వేపు తొంగి చూస్తారు. ఎంత పరాయి గడ్డమీద వుంటున్నా మన రక్తంలో వున్న ప్రేమలూ, అనుబంధాలూ ఎలా మాసి పోతాయండీ?"

"అలాగే ప్రయత్నిద్దాం" అన్న భర్త మాటలతో మరుద్వతికి మబ్బుల్లో తేలిపోతు న్నట్లనిపించింది.

సవరణ

సెప్టెంబరు 2019 సంచికలో డా. మండలి బుద్ధప్రసాద్‌గారు రాసిన 'నడుస్తున్న సారస్వతమూర్తి శివరాజు సుబ్బలక్ష్మి' 23వ పేజీలోని వ్యాసంలో మొదటి కాలమ్ మూడవ పేరా ముద్రణ కాలేదు. అది ఈ క్రింది విధంగా ఉంది. అసౌకర్యాన్ని కలి గించినందుకు చింతిస్తున్నాము. - సం.

'సుబ్బలక్ష్మిగారు సమకాలీన రాజ కీయ పరిణామాలను కూడా ఎంతో శ్రద్ధగా పరిశీలిస్తు వాటి మీద తన అభి ప్రాయాన్ని నిర్మొహమాటంగా మాట్లాడారు. కార్గిల్ యుద్ధాన్ని ప్రస్తావిస్తూ, బంగ్లాదేశ్‌కి విముక్తి కలిగిస్తూ ఇందిఒక చేసిన పాకిస్తాన్ యుద్ధం ఎంతో గొప్పదన్నారు. దాన్నెవరూ గుర్తించటం లేదని ఆవేదన వెలిబుచ్చారు.'

(44 వ పుట తరువాయి...)

9, 10: ఇక్కడి భావం లక్షల్లో ఒకడికి మాత్రమే అర్థ మవుతుంది.

1-10: తాబేలు పొదుగు మనిషిలోని విషయ వాంఛలకు సంకేతం. పొదుగు నుండి పెల్లుబికే కోరికలను పట్టి నియంత్రించ లేదు. శరీరమనే చెట్టునుండి పుట్టిన ఫలాన్ని (కోరికను) అంతరాంత రాల్లో దాగిన (పట్టు విడవని) మొసలిలాంటి భౌతికత్వం మింగే స్తుంది. మనిషి కోరికలు లోకంతీరుకు అనుగుణంగానే సాగుతాయి.

శాస్త్రజ్ఞానం కలిగిన వారైనా మరోవైపునుండి వచ్చే భౌతిక ప్రేరణలకు లొంగి జ్ఞానం కోల్పోతారు. ఇంటి యజమానియైన మామ (బుద్ధి) నిద్రపోయినపుడు, కోడలు జ్ఞానం పోగొట్టుకొని, శృంగారానికి లొంగుతుంది.


అణచ వీలుకాని కామం ముంతలో పట్టించ లేనిది. బుద్ధి చాంచల్యం వల్ల ఉన్న జ్ఞానం మరుగున పడి అజ్ఞానం (కామం) పెచ్చురిల్లడాన్ని లక్షల్లో ఒకడు మాత్రమే అర్థం చేసుకోగలడు.

ముకుంద రామారావుగారు "వలస పోయిన మందహాసం" లాంటి కవితలు, అదే ఆకాశం లాంటి దేశ దేశాల కవిత్వాల అనువాదాలు, 20వ శతాబ్దపు నోబెల్ గ్రహీతల కవిత్వాల అను వాదాలు, కథలు, వ్యాసాలు అనేకం రచించిన సాహితివేత్త. అనేక పురస్కారాలు పొందిన వీరి సేవ తెలుగు వారు గుర్తుంచు కోదగినది.

ఈ వ్యాస రచయిత రాజేంద్ర సింగ్ బైస్ ఠాకూర్ ఆంగ్ల ఆచార్యుడిగా, తెలుగు కవిగా, ఆంధ్ర ఆంగ్ల సాహిత్యాలలో విమర్శకుడిగా, అనువాదకుడిగా, ఆలోచనాపరుడిగా నాలుగు దశాబ్దాలకు పైగా సేవలందించారు.

పుస్తక సమీక్షలు

కట్టడ కళాధిదేవత : వాస్తు పురుషుడు



రచన : వాస్తు పురుషుడు– ఒక అధ్యయనం
కన్నడమూలం : డా॥ జ్ఞానానంద
అనువాదం : కందుకూరి వెంకట సత్య బ్రహ్మాచార్య, వెల:రు.150/–పుటలు: 168
ప్రచురణ: కందుకూరి యామబ్రహ్మాయాచార్య శిల్పవాఙ్మయపీఠమ్, శిల్పకళాభారతి, శ్రీకామాక్షిదేవి పూజాపీఠమ్
శిల్పశాల వీధి, విద్యాధరపురం
విజయవాడ – 12

నివాసాలకు మూలమైన భూమిని వస్తువు / వస్తు అంటారు. ఈ భూమిపైన నిర్మించే అన్నిరకాల కట్టడాలను 'వాస్తు' (వస్తురేవవాస్తు) అంటారు. ఈ వాస్తుకు సంబంధించిన వివరాలనందించే శాస్త్రాన్ని వాస్తుశాస్త్రమంటారు. వివిధ రకాలైన రూపాలు, ఆకారాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దటమే శిల్పం. శిల్పాన్ని అధర్వవేదానికి ఉపవేదంగానూ, స్థాపత్యవేదంగానూ (స్థాపత్య వేదో విశ్వకర్మాది శిల్పశాస్త్రం అధర్వవేదస్యోప వేద) పిలువబడింది. వాస్తు శాస్త్రంలో ఇళ్లు, గ్రామాలు, పట్టణాలు, నగరాలు, పురాలు, వాపీకూప, తటాకాలు, కోటలు, ఆలయాలు, ఆరామాలు మొదలైన నిర్మాణాల గురించిన వివరాలుంటాయి. ఈ నిర్మాణాలను ప్రారంభించేప్పుడు, పూజయేత్ వాస్తు పురుషామ్) వాస్తు పురుషుని పూజించాలని శిల్ప శాస్త్రాలు చెప్పాయి. దీనినే వాస్తుపూజ అని కూడా అంటారు. స్థపతులు అని పిలువబడే అనుభవజ్ఞులైన శిల్పుల సమక్షంలో, ఋత్విక్‌లు ఈ పూజను నిర్వహించి, వాస్తు పురుష మండల దేవతలను స్తుతిస్తారు. వాస్తు పురుషుడెవరు? అతని శరీరం పై అధిష్ఠించే విధానం, స్థిర, చర, దిన, వాస్తు పురుషులు, విశ్వకర్మ, వాస్తుపూజ సందర్భంగా పఠించే ఋగ్వేదంలోని వాస్తోష్పతి సూక్తం, ఆలయ నిర్మాణం – వాస్తుపురుషుడు, దిక్కుల నిర్ణయం, సకళం నుంచి ఆసనం వరకూ గల 10 రకాల వాస్తు పద మండలాలు, వాటి ఆకారాలు, దేవాలయవాస్తు, గ్రామవాస్తు, నగరవాస్తు, గృహవాస్తు విశేషాలను శాస్త్రీయ ఆధారాలలో డా.జి.జ్ఞానానంద కన్నడంలో 'వాస్తు పురుషనెలెహిన్నెలె' అన్న గ్రంధాన్ని, 'ఆగమవిద్వాన్', 'శిల్పశాస్త్ర ప్రవీణ' కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య (బ్రహ్మాజీ) 'వాస్తు పురుష – ఒక అధ్యయనం' పేరిట తెలుగులో అనువాదం చేశారు. ఈ పుస్తకాన్ని కందుకూరి యామబ్రహ్మాయాచార్య శిల్పవాఙ్మయ పీఠమ్, శిల్పకళాభారతి, శ్రీకామాక్షిదేవి పూజాపీఠమ్, విజయవాడ వారు ప్రచురించారు. శాస్త్రీయ అవగాహన, ఆధారాలతో రాసిన ఈ గ్రంధాన్ని వాస్తు, శిల్పం, ఆర్కిటెక్చర్ విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, వాస్తు సలహాదారులు తప్పక చదవాలి.

– డా॥ ఈమని శివనాగిరెడ్డి – స్థపతి
9848598446

మా కేరళ పర్యటన

రచన : కట్టమంచి బాల కృష్ణారెడ్డి
వెల : రు. 100/-
ప్రచురణ : సువేరా ఏజెన్సీ
ఇం.నెం. 15-2294, సువేరా హౌస్
బాలాజీ నగర్ కాలనీ
చిత్తూరు – 517 002, ఆం.ప్ర.
సెల్ : 9440559575



కొత్త ప్రాంతాలు చూడడం, కొత్త విషయాలు తెలుసుకోవడంలో రచయితకి చాల ఉత్సాహం ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే వీరి యూరప్ జ్ఞాపకాలు, కొన్ని కలలు – జ్ఞాపకాలు, ఆ పది రోజులు, మధురమైన మామిడి అనే పుస్తకాలు ప్రచురింపబడ్డాయి. వ్యాపారం, వ్యవసాయం వృత్తిగాను, సాహితీ సృజన, జర్నలిజం ప్రవృత్తిగా గల బాలకృష్ణారెడ్డి 2016 వ సం॥లో తనతో కలిపి 8 మంది (4 జంటలు) ఒక డ్రైవరుని తీసుకుని కేరళయాత్ర చేపట్టారు. అయితే 9 రోజుల యాత్ర తరువాత చర్తాల గ్రామంలోని కె.వి.ఎం. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అస్వస్థత కారణంగా చేరవలసి వచ్చింది. అందువలన బృందంలోని మిగతావారు యాత్ర కొనసాగించగా, ఆ విశేషాలను – 5 రోజుల యాత్రా వివరాలను రచయిత స్నేహితుడు డా॥ వెక్కల ఆంజనేయ నాయుడు తెలియచేశారు.


కేరళ రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేకతలు, రాజకీయ, సాంఘిక, చారిత్రక, భౌగోళిక విషయాలను ప్రస్తావించారు. కొచ్చిన్‌లో చొట్టి నికార దేవాలయము, కొచ్చి ఫోర్టు, సెయింట్ ఫ్రాన్సిస్ చర్చి, యూదుల ప్రార్థనా స్థలం–సినగాగ్, గురువాయూర్‌లోని శ్రీకృష్ణదేవాలయం, తిరువానూరులోని పద్మనాభస్వామి దేవాలయం, వైక్కం దేవాలయం, భగవత్పాదులు ఆదిశంకరుల జన్మస్థానం 'కాలడి' – వంటి దర్శనీయ ప్రదేశాల గురించిన వివరాలన్నిటినీ అందించారు. ఇక, కేరళ రాష్ట్ర ప్రముఖులు – ఇ.ఎం.ఎస్.నంబూద్రిప్రసాద్, వి.కృష్ణ మీనన్, మాజీ రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్, మిల్క్‌మేన్ ఆఫ్ ఇండియాగ ప్రసిద్ధి చెందిన వర్గీస్ కురియన్, హేతువాది డా॥ అబ్రహాం కోవూరు, పరుగుల రాణి పి.టి.ఉష, కార్టూనిస్టుల పితామహుడు ఆబూ అబ్రహాం, రవివర్మ, శంకర్స్ వీక్లీ – కేశవ శంకర పిళ్లై, స్వామి చిన్మయానంద వంటి ప్రముఖుల వివరాలు, ఛాయా చిత్రాలు (వర్ణ) పుస్తకంలో మనకు ఆసక్తిని కలిగిస్తాయి.

కేవలం తాను జరిపిన విహారయాత్రతో సరిపెట్టుకోకుండా, తన అనుభవాలను నలుగురికీ పంచితే, ఆయా ప్రదేశాలను చూడ గోరిన యాత్రికులకు ఇటువంటి పుస్తకాలు ఎంతో ప్రయోజనకారి అవుతుందని భావించిన రామకృష్ణారెడ్డి, ఆ ప్రయోజనాన్ని చాల వరకు సఫలం చేసుకున్నారు. ఎన్నో ఆసక్తికరమైన విషయాలను కూడ సందర్భాన్ని అనుసరించి పాఠకులతో పంచుకునే ప్రయత్నం చేసిన రచయిత కృషి అభినందనీయం.

– ఎం.వి.శాస్త్రి
9441342999




నమ్మలేని నిజాలు– నా గ్రామానుభవాలు
రచయిత:భాగవతుల వెంకట పరమేశ్వరరావు
పుటలు:384, వెల: రు.260/–
ప్రతులకు : భాగవతుల ఛారిటబుల్ ట్రస్టు
ఓరుగంటి వారి వీధి, ఎలమంచిలి,
విశాఖపట్నం – 531055



తెలుగు భాషా వైతాళికులు గురజాడ, గిడుగు
సంపాదకుడు : డా॥ పేరిశెట్టి శ్రీనివాసరావు
పుటలు: 224, వెల: రు.350/–
ప్రతులకు : శ్రీమతి పేరిశెట్టి వెంకట సీతాదేవి
డోర్ నెం. 31–4–23, 3వ అంతస్తు, ఫ్లాట్ నెం.
202, గద్దె పూర్ణ చంద్రరావు వీధి, సాయిరామ్
రెసిడెన్సీ, మారుతీ నగర్, విజయవాడ – 4
సెల్ : 9989242343



ఒక సామాన్యుని సింహావలోనం – ఆత్మకథ
రచన : జె.యస్.ఆర్.కె.శర్మ
పుటలు:258, వెల:250/–
ప్రతులకు : జగర్లపూడి సీతారామకృష్ణశర్మ
తెలుగు భాషా వికాస ఉద్యమం
భారత్ కుంజ్, 87–1027
బాలాజీ కాలనీ, సి.క్యాంపు, కర్నూలు – 2
సెల్ : 94404 43443



మహారాష్ట్ర తెలుగు రచయితల కథా సంకలనం
సంకలనం : సంగెవేని రవీంద్ర
పుటలు: 208, వెల: రు.200/–
ప్రతులకు :తెలుగు కళా సమితి, ఫ్లాట్ నెం.13
సెక్టార్ 9ఎ, వాషి, నవీ ముంబయి – 400 703
ఫోన్ – 022–27801637




ఆంధ్రాలో గాంధీజీ
సంకలనం :చింతపల్లి వెంకటనారాయణ
పుటలు:32, వెల:అమూల్యం
ప్రతులకు: చింతపల్లి వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి
సాహితీ మిత్రులు, ఫ్లాట్ నెం. 131–ఎ, శాంతి నిలయం
ఎన్.జి.ఓ. కాలనీ, కైకలూరు – 521333, కృష్ణా జిల్లా
ఫోన్: 9441091692




వరూధిని విరహం, హేతువాద సూక్తులు :
రచయిత:డి.పేరలింగం
పుటలు:50,వెల:అమూల్యం
ప్రతులకు:సైన్సు గ్రంథాలయం
డి.పేరలింగం, హేతువాది
ఎ.వి.అప్పారావు రోడ్డు, బాలాజి వీధి, రాజమండ్రి.
సెల్ : 9502654774




విహారం – (దీర్ఘ కావ్యం)
రచన : బి.ఎస్.రాములు
పుటలు:80, వెల: రు.60/
ప్రచురణ : విశాల సాహిత్య అకాడమి, 201, సులేఖ
గోల్డెన్ టవర్స్, 2–2–186/5/53/5, ఆర్.కె.నగర్
బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ – 500 013
సెల్ : 8331966987




స్వేచ్ఛ నుండి విముక్తి 'ఓ.యు.క్యాంపస్'...ఇతర కథలు
రచన : బి.ఎస్.రాములు
పుటలు:136, వెల: రు.60/
ప్రచురణ : విశాల సాహిత్య అకాడమి, 201, సులేఖ
గోల్డెన్ టవర్స్, 2–2–186/5/53/5, ఆర్.కె.నగర్
బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ – 500 013
సెల్ : 8331966987



కర్మ వీరులు – కార్యనిబద్ధులు
రా. స్వ. సంఘ జేష్ఠ కార్యకర్తలు భాగం 1 :
ప్రచురణ : శ్రీభోగాది దుర్గాప్రసాద్ స్మారక సమితి
పుటలు: 128, వెల :80/–
ప్రతులకు :సాహిత్య నికేతన్, ఏలూరు రోడ్డు
గవర్నరుపేట, విజయవాడ –2
సెల్ : 9440652115



కర్మ వీరులు – కార్యనిబద్ధులు
రా. స్వ. సంఘ జేష్ఠ కార్యకర్తలు భాగం 2 :
ప్రచురణ : శ్రీభోగాది దుర్గాప్రసాద్ స్మారక సమితి
పుటలు: 128, వెల :80/–
ప్రతులకు :సాహిత్య నికేతన్, ఏలూరు రోడ్డు
గవర్నరుపేట, విజయవాడ –2
సెల్ : 9440652115



దేవదుర్లభ వీరవ్రతధారులు
రా. స్వ. సంఘ జేష్ఠ కార్యకర్తలు భాగం 1 :
ప్రచురణ : శ్రీభోగాది దుర్గాప్రసాద్ స్మారక సమితి
పుటలు: 128, వెల :80/–
ప్రతులకు :సాహిత్య నికేతన్, ఏలూరు రోడ్డు
గవర్నరుపేట, విజయవాడ –2
సెల్ : 9440652115



దేవదుర్లభ వీరవ్రతధారులు
రా. స్వ. సంఘ జేష్ఠ కార్యకర్తలు భాగం 2 :
ప్రచురణ : శ్రీభోగాది దుర్గాప్రసాద్ స్మారక సమితి
పుటలు: 128, వెల :80/–
ప్రతులకు :సాహిత్య నికేతన్, ఏలూరు రోడ్డు
గవర్నరుపేట, విజయవాడ –2
సెల్ : 9440652115

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావుగారికి
'తానా - గిడుగు రామమూర్తి స్మారక తెలుగుభాషా పురస్కారం'



పురస్కారాన్ని అందిస్తున్న 'తానా' అధ్యక్షుడు జయశేఖర్ తాళ్లూరి, అధికారభాషా సంఘం అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్. ఎడమ చివర వెల్చేరు నారాయణరావు.



సభాధ్యక్షుడు సామల రమేష్‌బాబు ప్రసంగం



'తానా' అధ్యక్షుడు జయశేఖర్ తాళ్లూరి ప్రసంగం



పురస్కారగ్రహీత గారపాటి ఉమామహేశ్వరరావు ప్రసంగం

అక్టోబరు 4న విజయవాడ ఐలాపురం హోటల్‌లోని సమావేశ మందిరం తెలుగుభాష, సాహిత్య అభిమానులతో నిండిపోయింది. తెలుగుభాషపట్ల మమకారం వెల్లివిరిసింది. ప్రముఖ భాషాశాస్త్రవేత్త, తెలుగులిపికి కంప్యూటర్ హంగులు అద్దిన ప్రొ॥ గారపాటి ఉమామహేశ్వరరావుగారికి తానా - గిడుగు రామమూర్తి పురస్కారాన్ని తానా అధ్యక్షులు జయశేఖర్ తాళ్లూరి ప్రదానం చేశారు. తెలుగుభాషకు ఎనలేని సేవ చేసిన గిడుగు రామమూర్తి పేరు మీద 2002 నుంచి ప్రతి రెండేళ్లకు ఒకసారి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రకటించే 'తానా - గిడుగు రామమూర్తి స్మారక తెలుగు భాషా పురస్కారం' 2018 సంవత్సరానికి 'ప్రొ॥ గారపాటి ఉమామహేశ్వరరావుకి ప్రకటించింది.

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గతంలో పురస్కారం అందుకున్న సామల రమేష్‌బాబు, ప్రముఖ భాషా సాహితీవేత్త, తానా జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్న వెల్చేరు నారాయణ రావు వంటి ఉద్ధండుల సమక్షంలో గారపాటి ఉమామహేశ్వర రావుకి పురస్కారం అందజేశారు. కథా సాహితి సంపాదకులు వాసిరెడ్డి నవీన్ సభకు స్వాగతం పలుకుతూ ఈ పురస్కార పూర్వాపరాలు వివరించగా, అమ్మనుడి సంపాదకులు సామల రమేష్‌బాబు సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలుగుభాషను రక్షించు కోవలసిన ఆవశ్యకత గురించి, ఈ క్రమంలో తానా చేస్తున్న కృషి గురించి వివరించారు. తెలుగు శాస్త్రభాషగా ఎదగాల్సిన అవసరాన్ని వెల్చేరు నారాయణరావు వివరించారు. గత 40 సంవత్సరాలుగా తెలుగుభాషా సాహిత్యరంగాల్లో తానా చేస్తున్న కృషిని, దాని ఫలితాలను క్లుప్తంగా సమీక్షించి, పురస్కారాన్ని ప్రదానం చేశారు తానా అధ్యక్షులు జయశేఖర్ తాళ్లూరి.

భాషను కూడా ఆర్థిక వనరుగా గుర్తించి, ఆ వైపు కృషి కొనసాగించినట్లయితే తెలుగు కలకాలం నిలిచి ఉంటుందని పురస్కార గ్రహీత గారపాటి ఉమామహేశ్వరరావు వివరించారు. ఈ క్రమంలోనే దేశదేశాల్లో ఉన్న అనుభవాలను సోదాహరణంగా వివరించారు. వారి ఉద్వేగపూరిత ప్రసంగం సభికుల్లో అనేక ఆలోచనలు రేకెత్తించింది. బండ్ల మాధవరావు వందన సమర్పణ చేశారు.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly) Date of publication : 1st of every month RNI-APTEL / 2015/62362
November 2019 Vol :5, Issue 9 Date of posting : 3rd & 6th of every month Postal Reg NO. TEN/13/2018-20

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244